ఆంధ్రమహిళ



FEBRUARY '55 ANDHRA MAHILA ANNAS 8

ఆంధ్ర మహిళా సభ

మైలాపూర్ మద్రాసు

మహిళా విద్యాలయము : హిందీ, కాశీ విశ్వవిద్యాలయపు ఎడ్మిషన్. ఇంటర్‌మీడియెట్, ఇ.యస్.ఎల్.సి., పరీక్షలు.

పారిశ్రామిక విద్యాలయము (గవర్నమెంటువారిచే రికగ్నైజ్ చేయబడినది) : కుట్టు, ఎంబ్రాయిడరీ, ఊలు. అల్లికలు, నూలు వడకుట. చేనేత, అచ్చు కూర్పు, ముద్రణ, బైండింగ్ ఇత్యాది పరిశ్రమలలో గవర్నమెంటు పరీక్షలకు శిక్షణ. బీద విద్యార్థినులకు ఉచితము.

వస్త్రములపై అద్దకపుపని మిషనుకుట్టు, మిషను అల్లిక, చేనేత- బుక్ బైండిగు, ఎంబ్రాయిడరీ. : భారత ప్రభుత్వ పునరావాసశాఖవారిచే ఆంధ్రమహిళా సభ పారిశ్రామిక భవనములు, 7-ఎ రోజరీ చర్చి రోడ్డులో నడుపబడుచున్నవి.

టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్ : స్త్రీలకు సైపు,—గవర్నమెంట్ పరీక్షలకు శిక్షణ.

మహిళా మందిరము : స్త్రీవిద్యార్థినులకు వసతిగృహము.

ఆంధ్ర మహిళ : స్త్రీలలో విద్యావ్యాప్తికై, స్త్రీలచే నడుపబడుచున్న సచిత్ర మాసపత్రిక.

నిర్మలాదేవి గ్రంథాలయము : సభ్యురాండ్ర, విద్యార్థినుల ఉపయోగార్థము సేకరించిన తెలుగు, హిందీ, ఆంగ్ల గ్రంథ సముదాయము.

నర్సింగ్ హోమ్ : స్త్రీ, శిశువుల, సంరక్షణశాల, ప్రసూతిశాల, ఉచిత వైద్యశాల— అడయారులో నిర్మించబడినది. భారత ప్రభుత్వ ఆరోగ్యశాఖవారి విధానాన్ని అనుసరించి, సంక్షిప్త నర్సుఎయిడ్—మంత్రసాని పనులలో శిక్షణ యివ్వబడుచున్నది.

ముద్రణశాఖ : ఆంధ్ర మహిళా సభవారిచే స్వంతంగా స్థాపించబడినది. విద్యార్థినులకు అచ్చుకూర్పు, బైండింగు, ప్రూఫ్ రీడింగు, మొదలైనవి వుచితంగా నేర్పబడును.

క్రీడా, క్లబ్బుశాఖలు.

సభ్యురాండ్రుగా జేరి, యీ జాతీయ సంస్థను పోషించండి.

వస్తున్నది....



వాహినీ వారి

బంగారు పాప

నిర్మాత - దర్శకుడు
బి.యన్.రెడ్డి

ఆంధ్రమహిళ

సంపుటి 11 :: ఫిబ్రవరి 55 :: సంచిక 10

సంవత్సరచందా :: :: ఆరు రూపాయలు.

సంపాదకురాలు :
లక్ష్మీరఘురామ్

వ్యవస్థాపకురాలు :
శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్

సంయుక్త సంపాదకురాలు :
కె. సుగుణమణి

ముద్రణ :
ఆంధ్ర మహిళా ప్రెస్.

ఆంధ్రమహిళ

సంపుటి 11 :: జనవరి 55 :: సంచిక 10

సభలు - సమావేశాలు

ఈనెలారంభమునుండి మద్రాసు పట్టణములో జరుగుచున్న సభలకు సమావేశాలకు అంతేలేదు. కారణము దేశము నలుదిక్కులనుండి వచ్చిన నాయకులను మద్రాసు ప్రజానీకము, ప్రేక్షకులు, సంస్థలు వుపయోగించు కొనుటయే.

అరవదోసభ జరుపుకొనుచూ మన దేశపు కాంగ్రెసు రాజకీయపక్షము ఒక ప్రజానాహినిని మొన్న ఈ పట్టణానికి ఆకర్షించింది. ఏరాజకీయ పక్షసభకైనా కొంత ఆర్భాటము, హంగులు అవసరమోకాని యింత అట్ట హాసము లేకుండా కాంగ్రెసు సభలు జరపుకొంటే కలిగేనష్టము ఏమియువుండదేమో ! లాభముంటే యుండవచ్చును.

మామూలుప్రకారమే కాంగ్రెసు సభలో కొన్ని తీర్మానాలు ప్రతిపాదించటము తీర్మానించబడటము జరగినది. ముఖ్యముగా సోషలిస్టు సమాజ స్థాపన లక్ష్యంతో ఆర్థిక ప్రణాళికలు అమలుజరుపవలెనసుట, వ్యవసాయపు పంటల ధరల స్థిరీకరణచేసి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను సుస్థిరము చేయవలయుననుట, కాంగ్రెసు మహా సంస్థ క్రమశిక్షణను పవిత్రతను కాపాడవలెననుట, కాంగ్రెసులో ప్రభుత్వములో ఆర్భాటము లేకుండా పెక్కుమార్పులు కలుగ చేయవలయుననుట, శిశుమహిళా సంక్షేమము పట్ల ఇతోధికముగా శ్రద్ధ వహించాలనుట మొదలగు తీర్మానములను ప్రతిపాదించి తీర్మానించిరి.

మరి అమలు జరపుటెప్పుడో ? శ్రీధేబరు సారథ్యమున కాంగ్రెసు రాజకీయ శకటమును యేవిధముగా నడిపిస్తాడో చూడవలసియున్నది. ఆయన ఉద్బోధించినట్లు సోషలిస్టు సమాజమునకు అనువైన ప్రవర్తన అలవర్చు కొనమన్న సలహా ఎంతమంది ఆచరణయందు పెట్టగలరో చూడవలసియున్నది. మరియు ముఖ్యముగా స్త్రీలకు ఆర్థికముగా, రాజకీయముగా, నైతికముగా, సాంఘికముగా కాంగ్రెసు పక్షమునుండి న్యాయము జరుగగలదని ఇదవరకువలనే శాంతముగా నిరీక్షించుదాము.

ధేబరుభాయిజీ కాంగ్రెసు అధ్యక్షపదవీ నిర్వహణతో శ్రీ నెహ్రూజీ వాంఛించిన విశ్రాంతి ఆయనకు లభించగలదని తోచుచున్నది. మొన్న సభలలో ఉల్లాసముతో తోటి రాజకీయవేత్తలతో దిండ్లాటకు, ఒకానొక ఆంధ్ర సోదరీమణి అత్యంత ఆదరగౌరవములలో ఇచ్చిన నవరత్నఖచిత కిరీటాలంకృతులగుటకు అవకాశము కలిగినది — ఆయనకు మానసికముగా కొంత విశ్రాంతిప్పటికే కలగినట్లు తోచుచున్నది. వీలయునంత విశ్రాంతి తీసికొనిన పిదప, శ్రీ నెహ్రూ ఈ కాంగ్రెసు సభలో ప్రతిపాదించబడిన తీర్మానములు అమలు జరపగలరని విశ్వసించుచున్నాము.

కోకిల

సి. హెచ్. నిర్మల — నాగరత్నము

కోకిల పంచమస్వరపుఁ గూఁత చెవింబడినంత నెంతో చీ
కాను వహించి, వెంటఁబడఁ గారణమేమొ వచింపరాదె యో
కాకమ ! కండకావరమ? కాక మతేమిటి? పాప మద్ది యే
కాకిగఁ బూవుఁదోట దిరుగన్ సహియింపవు, కన్నుగుట్టెనా?

మావిచిగుళ్ళు మెక్కి, పనిమాని, వినుండని పాట పాడఁగా
నీవు వినంగలేవు, గ్రహియింపగఁజాలవు దాని గేయపుం
భావము, పున్నెముండు, పయిపైఁ బడి ముక్కునఁ బొడ్వఁబోకుమీ !
ఈవి యొసంగకున్న సరియే, హరియింపకు దాని ప్రాణముల్.

పదుగురు సంతసించి, నలువైపులహా ! యని ప్రస్తుతింపఁగా
అది వినలేక నీవు సరియయ్యెడు పక్షులఁ గూర్చుకొంచుఁ గూ
సెద వేదొ, దాన నేమగును? ఛీ యనువారలఁ జూచుకొమ్ము, దు
ర్మదము సతమ్ము సాగదు సుమా ! గ్రహియింపుము ! దుష్టకాకమా !

గానమునందు దాని సరిగానము, త్వాదృశ దుష్టలోక స
మ్మాన విహీన కారణము మానస మెంతగ వంత గూర్చెనో
కాననిచోట నక్కొనగా వలసెన్ గద గాంచవోయి ! యు
ద్యాన విహారిణిన్ సుకవితా రచయిత్రిని గోకిలామణిన్.

అండజము లొక్కటొకటికి నండ నుండ
మన్ను మిన్నేకముం జేసి మసలఁగలవు
లేనిపోని వైరమ్మునే పూనెనేని
అంతరింపదె యెపుడో బ్రహ్మాండ మంత?



ఆంధ్రమహిళాసభ మాతా శిశు సంరక్షణాలయ నూతన భవన ఆవిష్కరణ మహోత్సవం

ఆంధ్ర మహిళాసభ నర్సింగ్ హోమ్ పిల్లల వార్డుకు ఈనెల 22 వ తేదీన సాయంత్రం 4 గంటలకు కేంద్ర ఆరోగ్యశాఖా మంత్రిణి శ్రీమతి రాజకుమారీ అమృత కౌర్ ప్రారంభోత్సవం చేశారు. ఆనాటి ఉత్సవానికి కేంద్ర ప్రభుత్వ ఆర్థిక మంత్రి శ్రీ చింతామణి దేశ్‌ముఖ్, తదితర ప్రముఖులు విచ్చేశారు. సరిగా నాల్గు గంటలకి మంగళ వాద్యాలు మ్రోగుతుండగా, వేదఘోషల నడుమ శ్రీమతి అమృతకౌర్‌ను, శ్రీమతి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ గారు, తదితరులు చందన, పుష్పాదులతో ఆహ్వానించారు. ఆతరువాత విద్యుద్దీప కళికలతో నలంకరింపబడిన నర్సింగ్ హోమ్‌లోని వివిధ ప్రదేశాలను దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ గారు శ్రీమతి అమృతకౌర్‌కు చూపించారు. లెఫ్టినెంట్ కలోనెల్ సంగమ్‌లాల్ (డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీస్) కూడా వున్నారు.

ఒక సంవత్సరం క్రితం మాద్రాస్ గవర్నర్ శ్రీ శ్రీప్రకాశగారిచే శంకుస్థాపన చేయబడిన ఈ పిల్లల వార్డును శ్రీమతి అమృతకౌర్ నేడు ఆవిష్కరిస్తూ ఇలా అన్నారు: ఆంధ్ర మహిళాసభ నిర్వహిస్తున్న సేవకి నేనెంతో అభినందిస్తున్నాను. భారతదేశం స్వతంత్ర మయాక నర్సింగ్ వృత్తికి గౌరవ ప్రపత్తులు పెరిగాయి. ప్రజలు ఈ వృత్తి విశిష్టతను గమనించారు. డాక్టర్ల సౌకర్యాలు తక్కువయినా పల్లెప్రాంతాలకు వెళ్ళి ప్రజా సేవ చేయడం ఎంతయినా అవసరం"

పది మంచాలతో 1953 ఆగస్టులో స్థాపింపబడిన ఈ నర్సింగ్ హోమ్ నేడు 40 మంది స్త్రీలకీ, 10 మంది పిల్లలకీ సరిపోయే 50 మంచాలవరకూ సౌకర్యం కలిగింది.

కార్యదర్శిని శ్రీమతి వి. తిమ్మాంబాయిగారు స్వాగత వచనాలు చెపుతూ ఈ నర్సింగ్‌హోమ్‌కి శ్రీమతి అమృత కౌర్ శంకుస్థాపన గావించారనీ, ఇక్కడ తర్ఫీదుపొందే నర్సులు వారు సూచించిన విధంగానే శిక్షణ పొందుతు న్నారనీ చెప్పారు.

నర్సింగ్ హోమ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టరు ఎమ్. పావనబాయి, ఈ సంస్థ పైనందిన కార్య కలాపాలను వివరించారు.

1953 లో 8024 మంది బయటి రోగులు పరీక్షింప బడి చికిత్స పొందగా 1954 లో 17,848 మంది పరీ క్షింపబడి చికిత్సపొందారు. శిశు సంక్షేమ కేంద్రంలో 1953 లో 13,693 మంది పిల్లలకి పాలు పంచగా; 1954 లో 16,530 మందికి పాలు సరఫరా చేశారు. 1953 వ సంవత్సరం ఉత్తరార్థంలో 25 మందికి బదులు, 1954 సంవత్సరం ఉత్తరార్థంలో 438 మంది పురుళ్ళు పోసుకున్నారు. 1953 ద్వితీయార్థంలో మొత్తం 83 మందికే ప్రవేశం లభిస్తే 1954 ఆఖరు ఆరు నెలల్లోనూ 1023 మంది ఈ నర్సింగ్ హోమ్‌లో చికిత్స పొందారు.

ఈ నర్సింగ్‌హోమ్ స్వయం సమృద్ధం కావాలంటే ఆపరేషను థియేటరూ, రోగులను చూడడానికి వచ్చే వారికి ప్రత్యేకం ఒక హాలు, పిల్లలు ఆడుకొనేందుకు ఒక గదీ, నర్సులకు, ఉద్యోగులకు క్రీడా సౌకర్యాలు, బోధనా పరికరాలు వుండితీరాలనీ, ప్రభుత్వమూ, ప్రజలూ ఈ విషయంలో తగినసహాయం చేయవలసినదిగా డాక్టర్ పావనాబాయిగారు అభ్యర్థించారు.

తదనంతరం అధ్యక్షురాలు శ్రీమతి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్‌గారు రాజకుమారీ అమృతకౌర్‌గారిని నూతన భవనాన్ని ఆవిష్కరింప వలసినదిగా కోరినారు.

అనంతరం శ్రీమతి అమృతకౌర్ మాట్లాడుతూ "స్వయంకృషి అంటే నాకెంతో నమ్మకం. స్వయం కృషితో నిర్వహింపబడే సంస్థలలో తర్ఫీదు పొందిన నర్సులైనా, మరెవరైనా ప్రభుత్వ సంస్థలలో కంటే సేవానిరతి, దేశభక్తితో మూర్తీభవించి వుంటారనేది నిర్వివాదాంశం. ఈ కారణాలపైన ఇలాంటి సంస్థలంటే నాకెంతో యిష్టం. ఇలాంటి సంస్థలకి డబ్బు సమకూర్చా లంటే ఎంత కష్టమో నాకు తెలుసును. భాగ్యవంతులైన వారు నేడు సామాన్యులయారు. దేశంలో లేమి ఎంత గానోవుంది.

ఈ దారిద్ర్యాన్ని పోగొట్టి, ముఖ్యంగా స్త్రీల, శిశువుల అవసరాలని తీర్చవలసివుంది. ధనాభావంవల్ల ఏసత్కా ర్యం ఆగిపోదు. మానవసహకారం లేకపోతేకాని. మానవసహకారానికి లోటులేని ఆంధ్ర మహిళాసభ వంటి

మహత్తర సంస్థ. తన లక్ష్యాన్ని క్రమంగా సాధించి తీరుతుంది.

ప్రథమ, ద్వితీయ పంచవర్ష ప్రణాళికలలో గ్రామాభివృద్ధి పథకాలకి ఎంతో ప్రాముఖ్యత ఇవ్వబడింది. ఆయా ప్రాంతాల ఆరోగ్యవైద్య సదుపాయాల విషయంలో ఇలాంటి సంస్థలు సుశిక్షితులైన మహిళలద్వారా ఎంతో సహకరింపగలవు. గ్రామీణ ప్రాంతాలకి వెళ్ళడానికి డాక్టర్లు ఎంతగానో త్యాగం చేయవలసివుంటుంది. అలా చేయడానికి వారు సంసిద్ధులై వున్నారుకూడా. కాని వారు పనిచేయడానికీ, తమ ప్రతిభను ప్రజాసేవకి వినియోగించడానికీ, మనం ఇలాంటి సంస్థలని వారికందుబాటులో వుండేటట్టు చేయాలి. ఇలాటి సంస్థలు నర్సులు, మంత్రసానులు, ఆరోగ్యపరిశీలకులు మున్నగు సహాయక దళాలను తయారుచేస్తే మన గ్రామీణప్రాంతాలు సర్వతోముఖంగా అభివృద్ధి చెందుతాయనడంలో నాకెంతమాత్రం సందేహంలేదు." అన్నారు.

ప్రస్తుతం నర్సింగ్ హోమువున్న స్థలం ప్రక్కనే వున్న ఒక భవనం కొనడానికి ఆంధ్ర మహిళాసభ ప్రయత్నిస్తూన్నదనీ, కాని ఆ యింటిని అమ్మడానికి దాదాపు లక్షరూపాయల ఖరీదు చెపుతున్నారనీ, అంత ఖరీదు ఈ సంస్థ భరించలేదనీ, ఆ ఇంటి యజమానులు ప్రజాహితం మనస్సులో పెట్టుకొని ఆ ఇంటిని ఉచితంగా ఇవ్వకపోయినా తక్కువ ధరకి ఇవ్వవలసిందిగా తాను విన్నపము చేస్తున్నాననీ శ్రీమతి అమృతకౌర్ అన్నప్పుడు ప్రేక్షకులు హర్షధ్వనులు చేశారు.

అనంతరం నర్సింగ్ హోమ్ మహిళలు "ఫ్లారెన్సు నైటింగేల్" ఆంగ్లనాటికనీ, మహిళాసభ విద్యార్థినులు "నర్సింగ్ హోమ్" బుర్రకథనీ చక్కగా ప్రదర్శించారు.

ఉరుములు - మెరుపులు

'మరొక యుద్ధంవస్తే ఎవరు జయించలేరు'.

అవును. జయాపజయములు దైవాధీనములు.

* *

హైద్రాబాదులో లఘుపరిశ్రమల అభివృద్ధి.

గుడిపరిశ్రమల క్షీణమా!

* *

ఒకే దుకాణముపై నాలుగు పార్టీల జండాయి!

దుకాణాదారుడు సహజీవన ప్రచారము చేస్తున్నాడు కాబోలు.

* *

లక్నోలో 1500 యువతులు తాము స్వతంత్రముగా జీవించ దలచుకొన్నామని పట్టణ మాజిస్ట్రేటుకు తెలియజేసారట!

మాజిస్ట్రేటుకు మా సానుభూతి.



రాజకీయాలు

శ్రీ గోళ్ళమూడి రామచంద్రరావు.

1954 డిసెంబరు నాలుగో వారం మొదలుకుని 1955 జనవరి మూడో వారం వరకూ భారతదేశంలో నడిచిన రాజకీయ సంఘటనల్లో చెప్పుకోతగ్గవి అఖిలభారత కాంగ్రెస్ మహాసభ 60 వ సమావేశం, ఆంధ్ర ఎన్నికల్లో కాంగ్రెసు కూటమిలో కలవటానికి ప్రజాసోషలిస్టుల నిరాకరణ. అంతర్జాతీయ రంగంలో చెప్పుకోతగ్గవి ఆసియా-ఆఫ్రికా రాజ్యసమావేశాన్ని జరపటానికి కొలంబో రాజ్యాలు నిర్ణయించటం, దక్షిణ అమెరికా రాజ్యాల్లో మరొక పిడకలాట, చైనాతో సంప్రదింపులు జరిపివచ్చిన హామర్ షెల్డ్ సంతృప్తి వెల్లడించటం.

* * *

జనవరి 21, 22, 23 తేదీలలో అఖిలభారత కాంగ్రెస్ 60 వ సమావేశం మద్రాసు సమీపంలో జరిగింది. అనేక సమస్యలను చర్చించి మహాసభ తీర్మానాలు చేసింది. వాటిలో ముఖ్యమైనవి ఇవి :

1. సోషలిస్టు పద్ధతిలో సమాజ వ్యవస్థను నెలకొల్పటమన్న లక్ష్యాన్ని పెట్టుకుని ప్లానింగు జరగాలి. ఆవ్యవస్థలో ఉత్పత్తి పరికరాలన్నీ సమాజం ఆధీనంలోనో, కంట్రోలు క్రిందనో ఉండాలి. ఉత్పత్తి సమంగా పెరిగి, జాతీయ సంపదలు అందరికీ యథోచితంగా పంపిణీకావాలి

2. దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ నిర్వాహణ అంతకంతకూ ఎక్కువ ప్రాధాన్యతను వహించాలి. ముఖ్యంగా కీలక పరిశ్రమల్లో ఈప్రాధాన్యత ఎక్కువ కావాలి అయితే ప్రభుత్వేతరమయిన వ్యక్తి నిర్వాహణకూ, చొరవకూ కూడా ప్రాధాన్యత ఉంటూనే ఉంటుంది.

3. భూమి సంస్కరణలు త్వరగా సాగిపోయేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్య తీసుకోవాలి. గ్రామాల అభివృద్ధికి అతిముఖ్యమయిన ఋణసౌకర్యాలను అభివృద్ధి చేయాలి. వ్యవసాయోత్పత్తుల ధరలను ఆదుకుని నిలబెట్టాలి.

4. స్త్రీలను కించపరిచేట్లుగా ఉన్న సాంఘిక, న్యాయశాస్త్ర సంబంధమయిన, ఆచార సంబంధమయిన ఆటంకాలన్నింటినీ నిర్మూలించి వారు అర్హస్థానం పొందేటట్లు చేయాలి. చిన్న పిల్లల శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇవ్వాలి.

5. విద్యా విధానాన్ని సంస్కరించి 'బేసిక్' విద్యా సూత్రాలు దేశమంతటా 10 సం॥లో ప్రవేశపెట్టాలి.

ఇంకా, భారత ప్రభుత్వ విదేశాంగ విధానాన్ని హర్షిస్తూ ఒకటీ, కాంగ్రెసు సంస్థను శుద్ధి చేయాలని హెచ్చరిస్తూ ఒకటీ, జాతీయైక్యతయొక్క అవసరాన్ని ఉద్ఘాటిస్తూ ఒకటీ తీర్మానాలు చేయబడ్డవి.

* * *

శాంతియుతంగా, ప్రజాస్వామిక పద్ధతిలో సమాజ వ్యవస్థను సోషలిస్టు పద్ధతిలోకి పెడతామని కాంగ్రెసు మహాసభ ప్రకటించింది. ఈ లక్ష్యాన్ని కాంగ్రెసు పెట్టుకున్నందుకు ప్రజాసోషలిస్టు పార్టీలో అశోక్ మెహతా ప్రభృతులు, ఫార్వర్డ్ బ్లాక్ లో శీల భద్రయాజీ ప్రభృతులు హర్షించారు. యాజీ ప్రభృతులు కాంగ్రెసు పార్టీలోనే కలిసిపోయినారు. సోషలిజం అని నెహ్రూ చెప్పేది ప్రజలను తప్పుదోవలో పెడుతున్నదనీ, ఆయన చెప్పే 'సోషలిజం' మీద విశ్వాసం వున్నవాళ్ళు ప్రజాసోషలిస్టు పార్టీలోనుంచి బయటకు నడవటం అవసరమనీ పి.ఎస్.పి. ప్రముఖుల్లో ఒకరయిన డా॥ రాంమనోహర్ లోహియా విమర్శించారు.

సోషలిస్టు సమాజాన్ని సాధించటానికి ఒక గడువు అంటూ నిర్ణయించకపోవటాన, అది అస్పష్టధోరణికి దారి

తీయగలదని వినోబా భావే హెచ్చరించారు. సోషలిజం స్థాపనకు తగిన చర్యలు తీసుకునే అధికారం ప్లానింగ్ కమిషన్‌కు ఉండాలనీ, అంటే రాజ్యాంగంలో ఆస్తి హక్కు మొదలయిన వాటికి సంబంధించిన సూత్రాలను సవరించవలసి వుంటుందనీ భావే అన్నారు.

సోషలిజాన్ని వర్గ కలహంద్వారానే తీసుకునిరావలసిన అవసరం లేదనీ, దేశంలో వర్గ సంఘర్షణ అనేది ఉన్నమాట నిజమే అయినప్పటికీ, బ్రిటిష్ సామ్రాజ్య వాదాన్నీ, సంస్థానాల సమస్యనూ, జమీందారీ సమస్యనూ శాంతియుతంగా పరిష్కరించినట్లే, ఈ సమస్యనుకూడా కాంగ్రెస్ శాంతియుతంగా సాధించగలదనీ నెహ్రూ ప్రకటించారు. శ్రేయోరాజ్యం అనేది సోషలిజం లేకుండానే ఉండవచ్చుననీ, తాము ఆ రెండింటినీ కోరుతున్నామనీ ఆయన అన్నారు.

* * *

ప్రభుత్వ నిర్వహణకూ, వ్యక్తి స్వనిర్వహణకూ తారతమ్యాన్ని నిర్దేశించిన తీర్మానానికి వెనక కొంత కథ ఉన్నది. ప్రధాని నెహ్రూ నవచైనాను సందర్శించి తిరిగి వచ్చారు. చైనా నాయకులు సోషలిస్టు సమాజ స్థాపనకు తమ ప్రజలందరినీ ఎంతో చక్కగా కూడగట్టుకుని వస్తున్నారన్న సంగతిని ఆయన గమనించారు. తమ దేశంలో కూడా ఈ లక్ష్యాన్ని సాధించాలంటే, పరిస్థితుల్లో మార్పులు తీసుకురావటం అవసరమని నిశ్చయించుకున్నారు. అందువల్లనే చైనానుంచి ఇండియాకు తిరిగి వచ్చి రావటంతోటే, ఆయన సోషలిస్టు లక్ష్యాన్ని ఉద్ఘాటించారు. ముఖ్యంగా పారిశ్రామిక రంగంలో మార్పు రావటం అత్యవసరమని అన్నారు. ప్రభుత్వ నిర్వహణయొక్క ప్రాధాన్యతను గురించి హెచ్చరించారు.

సోషలిజం అంటే దారిద్ర్యాన్ని పంచటంకాదనీ, దేశం అభివృద్ధి చెందేవరకూ వ్యక్తి స్వపరిశ్రమలు కూడా ఉండాలనీ చైనా నాయకుడు అభిప్రాయ పడినట్లే నెహ్రూ కూడా అభిప్రాయపడుతున్నారు. ఈ వ్యక్తి స్వపరిశ్రమల స్థానం ఏమిటి, వాటిమీద ప్రభుత్వ కంట్రోలు ఎట్లా ఉండాలి అన్న విషయమై ఆయనకు కలిగిన ఆలోచనల ఫలితమే ప్రభుత్వ నిర్వహణకు పారిశ్రామిక రంగంలో ప్రాధాన్యత ఉండాలన్న ఉద్ఘాటన.

ఆయన చైనానుంచి తిరిగి వచ్చేటప్పటికి దేశంలో పరిస్థితులు ఈవిధంగా ఉన్నవి:— ఉక్కు ఫ్యాక్టరీలను స్థాపించేందుకు బిర్లా సోదరులు విడివిడిగా రెండు పథకాలను ప్రతిపాదించారు. ఒక సోదరుడు పెట్టుబడిని తానే సంపాదించి, నిర్వహణ తన కిందనే ఉంచుకుంటానని ప్రతిపాదించగా, వేరొక సోదరుడు ఇంచుమించుగా యావత్తు పెట్టుబడికీ భారత ప్రభుత్వమే హామీ ఇచ్చి, నిర్వహణ మాత్రం తనకు అప్పగించాలని ప్రతిపాదించారు. వాణిజ్య పరిశ్రమల మంత్రి కృష్ణమాచారిగారు మొదటి పథకానికి సుముఖంగా ఉండి, దానికి లైసెన్సు ఇవ్వాలని సిద్ధపడినట్లు తెలిసింది. కాని ఉత్పత్తి శాఖా మంత్రి కె.సి. రెడ్డిగారు, మరికొందరు మంత్రులు దానిని ప్రతిఘటించినట్లూ తెలిసింది. ఈ తగాదా మీద కృష్ణమాచారిగారు రాజీనామా దాఖలు చేయటం, నెహ్రూ దానిని సర్దుబాటు చేయటం జరిగిందని పత్రికలన్నీ ప్రకటించినవి.

ఈ సంఘటనలతో, పారిశ్రామిక రంగంలో ప్రభుత్వ వ్యక్తి స్వనిర్వహణలకు గల తారతమ్యాలను విస్పష్టంగా నిర్ణయించటం అవసరమని నెహ్రూ నిశ్చయించి, పార్లమెంటులో సోషలిస్టు సమాజ లక్ష్యాన్ని ఆమోదింపజేశారు. కీలక పరిశ్రమల్లో ప్రభుత్వ ప్రాధాన్యతను ఉద్ఘాటించారు. అయితే వ్యక్తి స్వపరిశ్రమలపై ప్రభుత్వ కంట్రోలు మాత్రం నిర్దేశించలేదు.

సోషలిజానికి ముందు జాతీయ సంపద అభివృద్ధి చేసి శ్రేయోరాజ్యాన్ని స్థాపించాలంటే వ్యక్తి స్వపరిశ్రమల మీద ప్రభుత్వానికి కచ్చితమయిన కంట్రోలు ఉండటం అవసరం. ఉదాహరణకు నిరుద్యోగసమస్య తీసుకోవచ్చు. నిరుద్యోగం పరిష్కారం కావాలంటే నేతమిల్లులు, జనపపరిశ్రమ మొదలైన వాటిని జాతీయం చేసి తీరవలెనని కాంగ్రెసు ప్రముఖుల్లోనే ఒకరయిన ఎన్.వి. గాడ్గిల్ గారు ఈ విషయమై పార్లమెంటులో జరిగిన చర్చలో ఉద్ఘాటించారు. అది లేనిదే నిరుద్యోగ సమస్య 20 ఏళ్ళకు కూడా పరిష్కారం కాదని హెచ్చరించారు. ఇట్లాగే, పరిశ్రమల ఆధునికీ కరణం పనికిరాదని జాతీయ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ హెచ్చరించింది. సిబ్బందికి న్యాయం జరిగి, వ్యక్తి స్వపరిశ్రమలు దేశాభివృద్ధికి అను

కాలంగా ఉండేట్టు అదుపులో ఉంచటమన్నది జరుగుతున్నదా అన్నదే ప్రధానమయిన ప్రశ్న.

ఇండియాలో శాస్త్ర పరిశోధన సంస్థల పనిని పరిశీలించేందుకు భారత ప్రభుత్వం పిలిపించిన ప్రఖ్యాత బ్రిటిష్ శాస్త్రజ్ఞుడు జె. డి. బెర్నాల్ ఇండియా, చైనాలలో ప్రభుత్వ వ్యక్తి స్వపరిశ్రమల తారతమ్యాలను గురించి ఈ విధంగా అన్నారు. "చైనాలో పరిశ్రమలపై ప్రభుత్వానికి కచ్చితమైన కంట్రోలు ఉన్నది. ఇండియాలో కంట్రోలు చేస్తున్నది ఎవ్వరో చెప్పేందుకు వీలు లేకుండా ఉన్నది."

* * *

స్త్రీలకు ఆటంకాలను తొలగించాలన్న తీర్మానాన్ని శ్రీమతి కుట్టిమాలు ప్రతిపాదిస్తూ, హిందూ న్యాయశాస్త్ర సవరణ బిల్లులన్ని నిరాటంకంగా నెగ్గగలవన్న ఆశను వెల్లడించారు. తీర్మానాన్ని సమర్థించిన ఓ. వి. అళగేశన్ గారు, ఈ కోరికను సమర్థిస్తూ, కాంగ్రెస్ ఈ విషయమై లోగడ ఇచ్చిన హామీలను నెరవేర్చవలసి వున్నదని హెచ్చరించారు. తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించబడ్డది.

గ్రామాల్లో ఋణ సౌకర్యాల అభివృద్ధికోసం ఇంపీరియల్ బ్యాంకును జాతీయం చేయటానికి భారత ప్రభుత్వం నిశ్చయించినందుకు కాంగ్రెస్ మహాసభ సంతోషం వెల్లడించింది.

* * *

కాంగ్రెస్ మహాసభలో ఒక్క విషయం చాలా ప్రాముఖ్యంగా కనిపించింది. రాజాజీ చలోక్తిగా అన్న మాట — నెహ్రూ పానకంలో పుడక మోస్తరు అన్నింట్లో అడ్డం తగులుతున్నాడు అన్న మాట- యదార్థ పరిస్థితులనే సూచిస్తున్నది. నెహ్రూ మాట్లాడకుండా ఒక్క తీర్మానం కూడా నెగ్గలేదు. అంటే, తీర్మానాల అమలుకు కూడా నెహ్రూ అనుక్షణం జోక్యం కలిగించుకుంటూ ఉండవలసిందేనా, నిత్య పరిపాలనా వ్యవహారాల్లో ప్రతి ఒక్క చోటా, నెహ్రూ జోక్యం కలిగించుకుని సరిదిద్దటం సాధ్యమవుతుందా అన్న ప్రశ్నలు రాకమానవు.

ఫిబ్రవరిలో శాసనసభను ఎన్నుకోవలసిన ఆంధ్రప్రజలకు కూడా ఇదే ప్రశ్న రాకమానదు. కాంగ్రెస్ సభ సందర్భంలో నెహ్రూ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్ష కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ అంటే దేశంలో ఉన్న మంచి పేరువల్లనూ, కమ్యూనిస్టులంటే ఉన్న అయిష్టతవల్లనూ ఆంధ్రంలో కాంగ్రెసుకే మెజారిటీ రావచ్చునన్న నమ్మకం వెల్లడించినట్టు పత్రికల్లో ప్రకటించబడ్డది. ఆంధ్రలో కాంగ్రెస్ కొరమాలినదిగా తయారయిందని ఆయన అన్నట్లు తెలుస్తున్నది. కాంగ్రెస్ కొత్త కార్యవర్గంలో ఆంధ్ర ప్రతినిధి పేరు ప్రకటించటం సాధ్యపడలేదంటేనూ దేశంలో ఉన్న రాష్ట్ర కాంగ్రెసులన్నీ అధ్యక్షుడిని ఎన్నుకోగా, ఆంధ్ర కాంగ్రెసుకు అది సాధ్యపడలేదంటేనూ, ఆ పార్టీ పరిస్థితులు ఊహించుకోవచ్చును.

కాంగ్రెస్ ఫ్రంటులో ఉన్న ఇతర సహచరులు కూడా స్థిరమైత్రి పట్ల నమ్మకం కలిగించే వాళ్ళు కాదు.

ఇది ఇట్లా ఉండగా, ఆంధ్ర ప్రజా సోషలిస్టు పార్టీ ఈ కాంగ్రెస్ ప్రజాస్వామిక ఫ్రంటును విశ్వసించలేక విడిగానే ఎన్నికల్లో పోటీ చేస్తున్నది. ఎన్నికల్లో వోట్ల లెక్కింపు మార్చి 1 న జరుగుతుంది.

* * *

డిసెంబర్ చివరలో ఇండియా, పాకిస్థాన్, సింహళం, బర్మా ఇండోనీషియాల ప్రధానులు ఇండోనీషియాలో సమావేశమై వచ్చే ఏప్రిల్‌లో ఆసియా ఆఫ్రికా రాజ్యాల సమావేశం జరపటానికి నిశ్చయించారు. దక్షిణాఫ్రికా ఇస్రేల్, సోవియట్ ఆసియా మినహా మిగిలిన ఆసియా ఆఫ్రికా దేశాలు సమావేశానికి ఆహ్వానించబడ్డవి.

* * *

కొరియారంగానికి చెందిన అమెరికన్ వైమానికులు చైనాలో గూఢచారులుగా పనిచేసి చైనా అధికారులచేత శిక్షించబడ్డారు. వీరి విడుదల విషయమై సంప్రదించేందుకు ఐక్యరాజ్య సమితి కార్యదర్శి హామర్‌ష్కోల్డ్ ఈ నెలలో పెకింగ్ వెళ్ళివచ్చారు. పరిస్థితులు ఆశాకరంగా ఉన్నవని, అందరూ నిగ్రహం ప్రదర్శిస్తే సమస్య పరిష్కారం

కాగలదని అన్నారు. ఖైదీల బంధువులు వచ్చి చూసి వెళ్ళేటందుకు చైనా అనుమతించింది. బంధువులు వెళ్ళటం మంచిది కాదని అమెరికా అధికారులు చెప్పగా, బంధువుల భద్రతకు తాను హామీ ఇస్తానని హామీర్ షెల్డ్ అన్నారు.

ఫార్మోజా పరిసరాల్లో చాంగకైషక్ ఆధీనంలో ఉన్న ద్వీపాల్లో ఒకదాన్ని చైనా ఆక్రమించుకున్నది. ఇంకా దాడులకు సన్నాహాలు జరుపుతున్నట్లు తెలుస్తున్నది.

*   *   *

దక్షిణ అమెరికాలో కోస్టారికా అనే రాజ్యంమీద నికరాగ్వాఅనే పొరుగు రాజ్యంనుంచి దండయాత్రజరిగింది. కోస్టారికాకు సాయపడటానికి అమెరికా ఒప్పుకున్నది. ఇది వరకు అభ్యుదయ వాదిగా ఉన్న గ్వాటెమాలామీద హాండ్యురాస్‌నుంచి విద్రోహులు దాడిచేయగా అమెరికా దానికి సాయపడేందుకు నిరాకరించి, ఆ ప్రభుత్వం పడిపోయేట్లు చేసింది. అంటే బందిపోటు గుంపులను ఆటవిక ప్రభుత్వాలనూ కూడా అమెరికా హర్షిస్తుంది కాని అభ్యుదయాన్ని మాత్రం హర్షించదని ఈ సంఘటన నిరూపిస్తున్నది.

కృతజ్ఞత

శ్రీమతి జొన్నలగడ్డ కామేశ్వరమ్మగారు ఆంధ్ర మహిళాసభకు నూరు రూపాయలు విరాళంగా ఇచ్చి యావజ్జీవ సభ్యురాలుగా ఎన్నుకోబడ్డారు. వారికి మా కృతజ్ఞత.

కస్తూరీబాయి గాంధీ

శ్రీమతి కె. రామలక్ష్మి

సూర్యకాంతిలా సహజకాంతి కాకుండా చంద్ర కాంతిలా ప్రతిబింబితమైన కీర్తి ప్రతి పత్తులు ప్రవహించే పథం కష్ట పథం. ఆ పథాన బలిదానాలనేకం. తొలి నుండి తుది వరకూ,



ఈ ఎగువ రోడ్డు తప్ప కస్తూరిబాయికి వేరు రోడ్డు కనిపించలేదు. జీవిత కాలంలో గాంధీజీ కూడా గర్వపడేటట్లు, మానసిక ఔన్నత్యాన్ని ఏమాత్రం కోల్పోకుండానే శిఖరాగ్రాన్ని అందుకో కల్గింది.

ఆమె ఉన్నతాశయాలు భర్తకి ప్రతిబింబంగా వుండడంలో కించత్వం పొందినట్లుగాని, ఆత్మ గౌరవం తగ్గినట్లుగాని భావించలేదు. అతని ఆశయాల శిద్ధత్వమే తన ఆశయంగా భావించింది కస్తూరీబాయి. గాంధీజీ ప్రారంభించే కార్యక్రమాలు ఆమెకు నిజమైన సపత్నులు! కాని పాతకాలపు వారు చెప్పినట్లు పట్టమహిషిగా యితర కళత్రాలని హృదయపూర్వకంగా ఆహ్వానించి తీసుకు వచ్చేది కస్తూరీబాయి. హిందూ శాస్త్రాలు చెప్తూన్నట్లు భర్త గుణ గుణాలు అనుభూతులు తనవిగా చేసుకొని గాంధీకి "సహధర్మిణి" "సహకర్మిణి" అయింది కస్తూరీబాయి.

మానవత్వపు సహజ స్వార్థం తను ప్రేమించిన వ్యక్తి తనకి స్వంతం కావాలని అనడం. తనకు సన్నిహితులైనవారి మధ్య ప్రశాంతంగా కాలం గడపాలని అనుకోవడం. ప్రతి స్త్రీ హృదయం పగలల్లా ఎదురు చూసే క్షణం-తన భర్తని ప్రపంచపు దృష్టినుండి, తన యింటినుండి తన ఏకాంత వాసంలోకి తీసుకుపోయేక్షణం. మనస్తత్వ శాస్త్ర రీత్యా చూస్తే ప్రతి స్త్రీ లోనూ వుండే లక్షణమే యిది. కాని, గాంధీ గృహంలో వివాహ జీవితపు చివరి 41 సంవత్సరాలలో ఏవిధమైన ఏకాంతానికీ తావులేదు.

ఆగ్రహం అసంఖ్యాకులైన అనేక అపరిచితులకి ఆశ్రయం అయింది. స్త్రీ సహజమైన కోర్కెల సఫలతకి, ఆయింట్లో కస్తూరీబాయికి అవకాశమే లేకుండాపోయింది. కాని వీటన్నిటికీ మించిన ఆనందం ఒకటి ఆమెకి కల్గేది: యింతమందికి పితృసమానుడైన తన భర్తని అందరితోపాటు తనూ పంచుకొంది. ఈ ఆలోచన ఆమెను గర్వంతో పులకరింపజేసేది. అతని ఔన్నత్యాన్ని ఘనతని వ్యక్తిగత జీవితపు గాడులలో అరికట్టడం అసహజం అని ఆమె తెలుసుకొంది. ఈవిధంగా వారి వ్యక్తిగత జీవిత వృత్తమే విస్తరించి బాహ్య ప్రపంచపు ప్రజాజీవిత వృత్తాలలో లీనమైంది. ఇప్పుడు వారిలో వ్యక్తులకీ తమ వ్యక్తిత్వానికీ మధ్య తేడాలేదు. వారి జీవితానికీ పరుల జీవితానికీ మధ్య గోడలు లేవు. కొత్తవారు కానీ, కాకపోనీ ఆమె అందరినీ యీ తలిదండ్రుల ఇంటికి ఆహ్వానించేది.

ఎంత చెప్పినా, ఆమె ఎత్తినది మానవజన్మ. ఈ ప్రపంచంలో పూర్తిగా కాలూని నిలచిన వ్యక్తి. ఇలా స్వార్థమనేదాన్నే తుడిచివేసి తన సర్వహక్కులనీ ఒక్కవ్యక్తి పాదాలముందు అర్పణం చేయడంలో ఆమె మానసికంగా పడ్డ సంక్షోభం అతి గంభీరమైనదై వుండాలి. ఈ సంక్షోభ చిహ్నాలు ఆమెలో ఛాయలు నదలేవెళ్ళాయి. ఆమె ఆత్మను ప్రవేశించిన కాలేఋనుము, దానిని రాచిరాచి తుదకు స్వార్థం అనేదానిని పూర్తిగా సేవగా మార్చేసింది. ఆమె ముఖంపై యేర్పడ్డ అనేక ముడతలు యీ ఆంతర్యంలో జరిగిన సంక్షోభ చిహ్నాలే. ఈ ముడుతలే ఆంతర్యపు ఔన్నత్యాన్నీ సౌందర్యాన్నీ చాటుతాయి. కాలం వదలిన చిహ్నాలే అవి. ఆమె విజయవంతంగా కొనసాగించిన మానసిక సంక్షోభ చిహ్నాలు కూడా అవి.

గాంధీజీ కస్తూరీబాయీ- యిద్దరూ ఒకే యీడు వారు. హిందూదేశ చరిత్రలో బాల్య వివాహాలు, పరదా, వర్ణభేదాలు దారుణంగా అమలులో వున్న రోజులకు చెందినవారు. పదమూడు సంవత్సరాల పసి వయస్సులోనే వారికి వివాహం జరిగింది. వివాహం అంటే ఒక విధమైన సాహస యాత్రగా భావించిన గాంధీ ఆ చిన్న వయస్సులోనే భర్తగా ఆమె మీద అజమాయిషీ ప్రారంభించాడు. అతని దృష్టిలో ఏకపత్నీత్వం అత్యున్నత సద్గుణం. ఇదే అతనిని అనుమానా స్పదునిగానూ అసూయిష్టిగానూ తయారుచేసింది. అనేక సమయాల్లో, యిది, ఆత్మౌన్నత్యం అందమైన ఆకృతి కల్గిన కస్తూరీబాయికి బాధగా పరిణమించేది.

తాను ఏంచేసినా తన భార్యకూడా అందులో వుండాలని గాంధీ కోరిక. దానికోసం ఆమెను అక్షరాస్యను చేయవలసిన అవసరం వుంది. మొదట్లో కస్తూరీబాయి యిందుకు సుముఖురాలిగా లేదు. దానితో అతనికి ప్రాణం విసగడమూ, ఆమెను బలవంతం చేసేనా ఆమెను సుముఖురాలిని చేయడమూ జరిగేది. అతనెంత బలవంతం చేస్తే తానంతగా స్వాతంత్రేచ్ఛను ప్రస్ఫుటంచేయ ప్రయత్నించేది కస్తూరీబాయి. ఇదంతా కల్మష రహితమైనదే. ఈ కృషి అంతా గాంధీజీకి వున్న ప్రబలమైన కోరిక- తన భార్య ఒక ఆదర్శ మహిళ గృహిణి కావాలని- ఒలాన్ని మాత్రమే చాటుతుంది. ఆమె అంటే అతి ప్రేమ. ఆమె అతన్ని మిగతా అన్నివిషయాలూ మరిచేలా చేసేది.

గాంధీజీ తన పద్దెనిమిదవయేట యింగ్లాండు వెళ్ళేడు. ఆనాటికే కస్తూరీబాయి చేతులలో ఒక పసి బిడ్డ. భర్త కోసం ఎదురుచూస్తూ యింటి పనులలో తాను ప్రముఖపాత్ర వహిస్తూ

కాలం గడిపేది. అతను లేని సమయంలో ఎన్నో మార్పులు వచ్చాయి. పెద్ద దిక్కయిన అత్తగారు మరణించింది. కాని యిల్లు మటుకు సాఫీగానే గడిచిపోయింది. గాంధీ తిరిగి వచ్చాడు. గృహంలో తిరిగి సంచలనం బయలుదేరింది. అతని రాకతోపాటే, అతను తనవాడనే స్వార్థం ఆమెలో తిరిగి రేకెత్తింది. అతనుకూడా యీ మాటో దృఢ నిశ్చయం చేసుకొని వచ్చాడు. తన భార్యను అక్షరాస్యను చేయాలని. కాని ఆమె కొనసాగించలేక పోయింది. దానికి కారణం గాంధీజీ ముక్కోపమూ ప్రేమాయే. ఒకసారి కోపంవచ్చి యింటినుండి పంపించేశాడు. ఆమె పూర్తిగా పశ్చాత్తాప పడేదాకా తీసుకు రాకూడదని నిశ్చయించుకొన్నాడు. కాని యిందువల్ల వారి మధ్య అనురాగం సన్నగిల లేదు సరికదా ద్విగుణీకృతం అయింది.

గాంధీజీ రెండోసారి దక్షిణ ఆఫ్రికా వెళ్ళినప్పుడు కస్తూరీబాయినీ పిల్లలనూ తీసుకొనే వెళ్ళాడు. జీవిత పరిపూర్ణతలోనున్న గాంధీజీకి, దేశప్రజల గతి ఎలా మారుతుందోనని ఆందోళనతో, కొత్త వుత్సాహంతో నున్న గాంధీజీకి-కుటుంబాపేక్ష మెండే. అలాగే, కస్తూరీబాయి తొలిసారిగా సముద్రయానం చేసేముందు-ఇంతవరకూ ఏమీలేని పాదాలకు బూట్లు, సాక్సు, వేసుకొని, ఆకాలంలో నవనవీన పద్ధతి అనుకొనే పార్సీ పద్ధతిని చీర కట్టుకొని భర్త వెంట సాగింది. ఇదంతా ఆమెకి యిష్టంలేదు. కష్టంగా కూడా వుంది. కాని ఆ రోజులలో గాంధీకూడా పాశ్చాత్య నాగరికతా వ్యామోహం నుండి బయట పడలేదు. అందుకే యిష్టం వున్నా లేకున్నా ఆమె అతని కోర్కెలకి తల వగ్గింది.

ప్రశాంతం లేని కష్ట కాలంగా రోజులు గడుస్తున్న రోజులలో, గాంధీజీ అంతరాత్మ ఒక రకమైన పరిణామావస్థలో వుంది. గూడుకట్టు కొన్న గొంగళీ పురుగు సీతాకోక చిలుకలా బయటికి వస్తుంది. అలాగే గాంధీజీ ఒక ఏకమైన వ్యక్తిత్వం గూడు కట్టుకొని లోపల్లోపల తనకే తెలియని ఏవేవో మార్పులు చెందుతూంది. ఈ అవసర కాలంలో కస్తూరీబా తన భర్తకి కావలసిన మనశ్శాంతిని యివ్వగలిగింది. దక్షిణాఫ్రికా భారతీయుల బాధలు తనవి చేసుకొంటున్న గాంధీ గృహంలో ఏమాత్రం తుఫానూ లేకుండా కస్తూరీబాయి చూచుకొంది. పరిణామవస్థదాటి గాంధీ ఆత్మ కొత్త జన్మ నెత్తింది. ఈ కొత్త వెలుగుకి చేయూతనిచ్చి దానికి కొంచంలో కొంచం కారణ భూతురాలు కస్తూరీబాయే నంటే తప్పేముంది? నిందలనూ జైలు శిక్షలనూ కొని తెచ్చుకున్నప్పుడూ, ప్రజల బాధ తనదిగా బాధపడుతున్నప్పుడూ ఆమె అతనికి అండ దండలై నిలిచింది. అహింసా సూత్రపు ఆవశ్యకతను గాంధీ గుర్తించడానికి ముఖ్యంగా కస్తూరీబాయి స్థిరచిత్తమే కారణం. అదే అతనికి ఆశ్రయం. ఆశయాలు బూడిద పాలై తల్లడిల్లుతున్నప్పుడు ఆమె అతని ప్రక్కను వుండి కొత్త ఆశయాలని కొత్త అనురాగాలని సృష్టించడానికి ఉత్సాహాన్ని యిచ్చింది. మన దేశంలో ఉత్తమోత్తముడైన వ్యక్తి జీవితంలో ఎటువంటి పాత్ర యీమె వహించిందో ఎక్కడా వ్రాసిలేదు. అయినా, ఆమె వహించిన పాత్ర అంత స్వల్పం కాదని అంటరం ఎరుగుదుం.

గాంధీజీ తన జీవిత గమ్యాన్ని తెలుసుకున్న క్షణాన్నే కస్తూరీబా అతన్ని కోల్పోయింది-అతని ప్రేమ దేశ ప్రజనంతా అలముకొంటే ఆమె దానిలోనే తన ప్రేమనూ లీనం చేయ గలిగింది. అయినాకూడా ఒక విధంగా ఆమె అతన్ని కోల్పోయింది. ఇప్పటి మోహన్‌దాస్

గాంధీ ఆమె భర్త ఒక్కడే కాదు. ఇప్పటి గాంధీ-మహాత్ముడు, దేశపిత- కొద్దిలో చెప్పాలంటే దేశానికి తనను తాను ధారపోసుకున్నాడు గాంధీజీ. అందుకే నాటినుండీ గాంధీ హిందూ దేశానికి చెందాడు. కస్తూరీబాయి ఒక్కర్తెకే కాదు.

ఎవరో ఒక సందర్భంలో అన్నట్లు, కీర్తివంతుని వివాహం చేసుకోవడం, తాజ్ మహాల్‌ని వివాహం వంటిది! ఈమాటలలో హాస్యం ఎలా ధ్వనించినా, దానిలో ఎంతో నిజంవుంది. కస్తూరీబాయి యీ నిజాన్ని బాగా గుర్తించింది. తన భర్త ఏకాంతం దేశ ప్రజలే కాకుండా పబ్లిసిటీ కూడా భంగపరచిందన్న సంగతి కస్తూరీబాయికి తెలుసు. భర్తతో పాటే వుంటూ, అతన్నే వెన్నంటివుండే పబ్లిసిటీని జాగ్రత్తగా తప్పుకొంది కస్తూరీబాయి. అతను ఏం చేసినా, ఏమన్నా అది అందరిదీని. తనదీ తన పిల్లలదీ కాదు, అన్న నిజాన్ని స్వీకరించే ధైర్యం అలవడింది కస్తూరీబాయికి. అతని కీర్తి కాంతులలో తనూ ప్రకాశించింది. కాని ప్రతి స్త్రీ లాగే ఆమెకూడా, ఎవ్వరికంటా పడని కన్నీటిని కార్చే వుంటుంది. మరి ఆమె కోల్పోయిన వాస్తవ సుఖాల సంఖ్య అంతది. విలువ అంతది.

తన భర్త శీలాన్ని శంకించేవారిపై కస్తూరీబాయి కోపం యింతా అంతా కాదు. అతని శత్రువులీవిధంగా అతన్ని నిందించినా, తనకి తోచిన సమాధానం చెప్తూ గాంధీ, ఏ భర్త ఏ భార్యకు యివ్వనంతటి గౌరవ స్థానాన్ని ఆమెకు యిచ్చాడు. "నేను 1906 లో బ్రహ్మచర్య వ్రతం తీసుకొన్నాను. అప్పుడే దేశసేవకి పూర్తి అవకాశం చిక్కుతుందని. నాభార్య స్వేచ్ఛా జీవి. ఆమెకు నేను యజమానిని దైవాన్ని ... కాని నా భార్య నన్ను ఆకర్షించినట్లు యింకే యితర స్త్రీ నన్నంతగా ఆకర్షించలేదు. భర్తగా ఆమె విశ్వాసాన్ని నేనెప్పుడూ కోల్పోలేదు. ఇంకే యితర స్త్రీకీ ఎప్పుడూ బానిసను కానని నేను నా తల్లివద్ద చేసిన ప్రతిజ్ఞ నేను మరిచి పోలేను" అంటాడు గాంధీ. ఏభార్య మటుకు యింతకంటె ఎక్కువ కోరుతుంది ?

నెటాల్‌లో వుండే తొలి రోజులలో అతని కార్యక్రమాలు కొనసాగడంకోసం దేశీయులు అసంఖ్యాకంగా నగలు కుప్పించారు. అందులో ఒక ప్రత్యేక హారం కస్తూరి బాయికై పంపబడింది. కాని అందుకు గాంధీ ఒప్పుకోలేదు. కుర్రవాళ్ళ పెళ్ళి అయితే కోడలికి పెట్టవచ్చని కస్తూరీబాయి అంటే "కుర్రవాళ్ళు పెద్దవాళ్ళయి పెళ్ళి చేసుకొంటే, నగలను అధికంగా చూసే వారిని తెస్తారని అనుకోను. అలా అయితే, అప్పుడు వాటికోసం నువ్వు అడుగు." అన్నాడట గాంధీ. కస్తూరీబాయికి నిజంగా కోపమే వచ్చింది. "మిమ్మల్నెల్లా నేను అడగడం ? మీ సంగతి యీపాటికి నాకు బాగా తెలుసు. నాకు అభరణాలనేవే లేకుండా చేశారు. నాకు ప్రశాంతి కూడా వుండకుండా చేశారు. అలాంటిది మీరు కోడళ్ళకి నగలు చేయిస్తాననిఅంటే ఆశ్చర్యంగా వుంది" అంది. ఫలితం : గాంధీ నగలన్నీ ట్రస్టుగా చేశాడు. తన కార్యక్రమాలకి కావలసిన సొమ్ము ఆ ట్రస్టు నుండే తీసుకొంటూ వుండేవాడు. ఒకసారి హరిజన ఫండు కోసం ఎవరో యిచ్చిన నాలుగణాలు కట్టడం మరిచి పోయింది కస్తూరీబా. గాంధీజీ దీనిని దారుణంగా భావించి తగిన ప్రాయిశ్చిత్తం చేసుకోనున్నాడు. కొందరు హరిజనులు సత్యాగ్రహ నిమిత్తం సెగాన్ వచ్చినప్పుడు వారిని యింటికి పంపిస్తూ "వారికి అన్నీ సమకూర్చు. నీ పిల్లలలాగే చూచుకో" అని గాంధీ కబురం

పేదు. కస్తూరీబాయి అప్పటికే తానున్న భాగాన్ని వారికి యిచ్చేసింది. అన్ని అవసరాలూ తీర్చింది. అయినా "నా చేతనయినంత వరకు అన్నీ చేస్తాను. ఇక వారిని నా పిల్లలలా చూసు కోడం సంగతా, ఆ భాగం మీరు చూసు కోండి." అంటూ కబురు పంపింది. భార్యా భర్తల మధ్య అంత సామరస్యం వుండేది. బహుశా ఆజవాటు చూసి గాంధీ నవ్వుకొని వుంటాడు.

దక్షిణాఫ్రికా నుండి వచ్చి, దేశ విషయా లలో అత్యుత్సాహంగా పనిచేస్తున్న రోజులలో అన్నివిధాలా గాంధీకి అండమై సహకరించింది. రాజ్ కోట ఉద్యమంలో తానూ పాల్గొంది. (1939) ఖైదు వేశారు. అప్పుడే గాంధీ మళ్ళీ యింకో నిరశన వ్రతం ప్రారంభించాడని వింది. వయస్సు ముదురుతున్నా ఆయన పట్టిన పట్టు ఎటువంటిదో కస్తూరీబాయికి తెలుసు. ఎన్నో సమయాల్లో హృదయం పగిలేటట్లు ఏడ్వాలని అనిపించినా అతని చేతులలో తన రాత ఎలాగ వుందో అలాగే జరుగుతుందనే మొండిధైర్యం తో వుండ కల్గింది. ఆమెకు ఒక నమ్మకం: తానే ముందు చనిపోతానని. తన హృదయ దౌర్బల్యాన్ని కనుపించకుండా ధైర్యంగా భర్త కార్యక్రమాలలో పాలు పంచుకొంది.

దరిదాపు అరవై సంవత్సరాల జీవిత ప్రవాహంలో అక్కడక్కడ అడ్డు తగిలే జ్ఞాపకాల శిలలతో కస్తూరీబాయి తన స్వకీయ వ్యక్తిత్వాన్ని రూపు మాపుతూనే గడిపేసింది. లోలోన ఎన్ని తుపానులు రేగినా పైకి మాత్రం సుకుమారమైన దేహంతో అద్భుతమైన ఆత్మ శక్తితో అందరిని ఆదరిస్తూ కాలం గడిపింది.

కస్తూరిబాయిని గురించి మనం వినేదీ తక్కువ. రాసి వున్నదీ తక్కువ. అయినా సెగాన్‌లో ప్రజా జీవితం అంతా ఆమె చుట్టూనే అల్లుకొని వుండేది. దేశానికి భర్త అందించిన ఘనతలో ఆమెకూడా భాగం పంచు కొంటుంది. అతను ప్రారంభించిన ప్రతి కార్య క్రమంలోనూ తానూ నిశ్శబ్దంగా పనిచేసింది. ఆమె చేసిన ఎంతటి ఘనకార్యమైనా నిశ్శబ్ద పూరిత వాతావరణంలో వుండి పోయింది. మానవ మాతృత ప్రశంశా వాక్యాలకి అతీతంగా ఆమె చేతలు నిలిచాయి.

1942 లో జైలులో వుండగా జబ్బుచేసింది కస్తూరిబాయికి. 1943 లో ఎక్కువ అయింది. 1944 ఫిబ్రవరి 22 తేదీ- ఆనాడు శివరాత్రి- ఆరోజున కస్తూరిబాయి శాశ్వతంగా కన్ను మూసింది. ఆమె అంతరాత్మకి అతి సన్నిహితు లైన భర్తా, కుమారుడు చెంతనుండగా, ప్రశాంతంగా ఆమె కన్ను మూసింది.

ఈనాడు ఆమె స్మృతి చిహ్నంగా దేశం అంతటా సేవా సంస్థలు వున్నాయి. దరిదాపు 80 లక్షల రూపాయలు ప్రోగుచేసి, శిశు మాతా సంరక్షణకై వినియోగించుతున్నారు. అటువంటి గంభీరమైన వ్యక్తికి యింతకు మించిన స్మృతి చిహ్నం మానవ మాత్రులు ఏమి యీయగలరు ?

ఇది కస్తూరిబా చరిత్ర ఒక సాధారణ స్త్రీ దృష్టిలో ఒక సాధారణ స్త్రీని చూస్తే ఎలా వుంటుందో- అదే యీ చిత్రించిన కస్తూరీబాయి చిత్రం. కస్తూరిబా మహాత్ముని భార్యే కావచ్చు. కాని ముఖ్యంగా ఆమె సామాన్య స్త్రీ. ఒక సామాన్యస్త్రీ ఒక మహాత్ముని అలా కట్టేసిందంటే నారీలోకానికి గర్వకారణం. తామేమీ చేయలేమనుకొనేవారికి ధైర్యం నిగర్వ ఫలానికి నిరూపణ. కస్తూరీబాయి—అవధులు లేని ఓర్పుకి, ఎనలేని హృదయపు లోతులను మనోనేత్రాలతో చూసి అర్థం చేసుకోడానికి- ఒక చిహ్నం.



కోమలాంగీ....!

శ్రీ బాబా

బృందావనంబులో
మందార పుష్పాలు
కొమ్మకొమ్మావంచి
కోయలేదని నేను
కోమలాంగీ నీకు
కోపమొచ్చిందా ?
కోమలాంగీ నీకు
కోపమొచ్చిందా ?

సంజకెంజాయలో
సంప్రతీకమునందు
తెల్లగవ్వలు నేను
తెచ్చివ్వలేదనీ
కోమలాంగీ నీకు
కోపమొచ్చిందా ?
కోమలాంగీ నీకు
కోపమొచ్చిందా ?

గోదారి తీరాన
గంగరావిపూలు
తేలివస్తుంటేను
తీయలేదని నేను
కోమలాంగీ నీకు
కోపమొచ్చిందా ?
కోమలాంగీ నీకు
కోపమొచ్చిందా ?

కోవెలకు ముందున్న
కొలనులోదిగి నేను
సిరికలువలు తీసి
సికీయలేదనీ
కోమలాంగీ నీకు
కోపమొచ్చిందా ?
కోమలాంగీ నీకు
కోపమొచ్చిందా ?

నీరూప చిత్రంబు
నీవుకోరినయట్లు
చిత్రపటములలో
చిత్రించలేదనీ
కోమలాంగీ నీకు
కోపమొచ్చిందా ?
కోమలాంగీ నీకు
కోపమొచ్చిందా ?

నీపాపట తిలకంబు
నాకుంచెతో సరిగ
దోసగించాలాగ
దిద్దలేదని నేను
కోమలాంగీ నీకు
కోపమొచ్చిందా ?
కోమలాంగీ నీకు
కోపమొచ్చిందా ?

భారతజాతీయ మహాసభ సేవలుగావిస్తూ అరవయ్యావ యేట ప్రవేశించింది. ఈమహాసభ వార్షిక సమావేశం ఈ నెల 21, 22, 23 తేదీలలో ఆవడిలో జరిగింది. భారత స్వాతంత్ర్య సముపార్జన సమరానికి కాంగ్రెసును మహత్తర శక్తివంతమైన దానిగా నిర్మించిన యోధుని జీవితకధ ఈ సంచికలో ప్రకటిస్తున్నాం.



దేశంకోసం ఆత్మార్పణ కావించిన యోధునకు
ఆంధ్రమహిళ జోహారులర్పిస్తుంది.

సర్దార్ జీకి జోహార్లు

శ్రీ పి. వి. పేర్రాజు

మనదేశ చరిత్రలో రక్తాక్షరాలతో లిఖించవలసిన ఘట్టాలు అనేకంవున్నాయి. వాటిలో ముఖ్యమైనది మూడు సంవత్సరాల క్రితం, 1950 డిసెంబరు 15 వ తేదీని జరిగింది ఆ విషాదగాథ. నాటి ఉదయం 9-37 గంటలకు నవభారత నిర్మాత సర్దార్ వల్లభాయి పటేల్ అస్తమించాడు. మరుక్షణంలో యావద్భారతదేశమునకూ చీకట్లు అలుముకుపోయాయి. ఆబాలగోపాలము తల్లడిల్లిపోయారు ఇది సాధ్యమేనా అని. మహాత్ముడు మరణించిన మాట మరిచిపోలేక, ప్రవహిస్తున్న కన్నీటి ధారలను తుడుచుకుంటున్న భారతీయులకు తిరిగి మరొక బ్రహ్మాండమైన గొడ్డలిపెట్టా! 'భారతదేశపు ఉక్కుమనిషి'యని దేశదేశాలలో పొగడ్తలుబడసిన ధీరుడు, రాజ్యాంగ తంత్రాన్ని అత్యంతనైపుణ్యంతో నడపించి అపరచాణక్యుడు అనిపించుకున్న చతురుడు, నిష్కర్షగా నిజమాడకల్గిన సత్యప్రియుడు, తలవని తలంపుగా అస్తమించాడా! కొన్ని శతాబ్దాలుగా చిన్నభిన్నమైన భారతదేశాన్ని మారుమనిషికి తెలియకుండా తిరిగి ఏకఖండంగా మార్చివేసిన మహనీయుడు, స్వాతంత్ర్య సముపార్జనతో నిర్వాణమొందిన మహాత్మునివలె దేశ ఐక్యతతో తన విధికృతముకూడా సంపూర్తి అయినదనుకున్నాడు కాబోలు! ఆ రాజకీయ దురంధరుని, ఆ స్వతంత్రసమరయోధుని కళ్ళార చూడగల భాగ్యం మనకు మాత్రం లభించింది. మహనీయుల జీవిత గాథలను స్మరించుకుని, వారి ఆదర్శాలను అనుసరించడమే మనం చేయగల కర్తవ్యం.

"చిన్నబ్బాయికి వేసిన ఉడుకు గడ్డ ఇంకా తగ్గలేదు. ఆబాధ వాడెలా భరిస్తున్నాడోకాని నాకు చూట్టానికే కష్టంగా వుంది" అంది తల్లి. "పోనీ మంగల వైద్యుడిని పిలిపించక పోయావా" అన్నాడు తండ్రి. మర్నాడు వైద్యుడు వచ్చి పరీకించాడు. తన సిద్ధాంతం ప్రకారం ఒకటేమందు- శస్త్రచికిత్స. మత్తుమందులు, వాడి కత్తులు లేవు ఆకాలంలో. కొలిమిలో కాల్చిన ఇనుప వూచతో వాత బెట్టడమే శస్త్ర చికిత్స. వైద్యుడు కళపెళా కాల్చిన వూచ తెచ్చాడు. కాని ఇంతటి మోటవైద్యమా అని సందేహించాడు. అది చూచిన వల్లభాయి "ఏమి సంకోచం- ధైర్యం లేకపోతే నాచేతికియ్యి" అంటూ ఆ నిప్పులు కక్కుతున్న వూచతో ఒక్కవాత పెట్టాడు కురుపుమీద. చుట్టూవున్నవారంతా కెవ్వుమన్నారుకాని అతను మాత్రం చీమంత చలించలేదు. సంతత ధారలుగా ప్రవహిస్తున్న రక్తాన్ని జాగ్రత్తగా తుడిచివేస్తు కూర్చున్నాడు. పిన్న వయస్సులో అంతటి మనోనిగ్రహం మరెవరు చూపించగలరు. శారీరక కష్టాలకు లెక్కచేయడన్న ప్రతీతి ఆనాడే సంపాదించాడు వల్లభాయి.

అక్రమాన్ని ఏమాత్రం సహించలేకపోవడం వల్లభాయికి చిన్నతనంనుండే సహజస్వభావమైంది. ఇతరుల మనస్సు నొచ్చుకుంటుందని సందేహించకుండా న్యాయం కోసం ఎల్లప్పుడు పోరాడేవాడు. స్కూల్లో చదువుకునే రోజుల్లో ఒక పార్సీ మేష్టారు వుండేవారు. తనంత క్రమశిక్షణా దక్షులు వేరే లేరని ఆయన మూఢ విశ్వాసం. ఆ దురభిప్రాయ ఫలితంగా చీటికి మాటికి పిల్లలపై ఖడిత ప్రయోగం కావించేవాడు. ఒకనాడు ఒక బాలుడు జరిమానా సొమ్ము చెల్లించలేకపోయినందుకు అతన్ని కొట్టి క్లాసునుంచి తరిమివేశాడు. ఈ ఉదంతం వల్లభాయి భరింపశక్యం కాకపోయింది. వెంటనే తోటి విద్యార్థుల నందరను కూడదీసి క్లాసునుంచి బైటకు వచ్చివేశాడు. పిమ్మట స్కూలు యావన్మందీకూడ క్లాసులు బహిష్కరించేటట్లు ఏర్పాటయింది. సమీపంలోవున్న ధర్మశాలలో వారికి విడిది ఏర్పాటుచేయడం, ఒక్క పిట్టకూడా స్కూలు దరిదాపులకు రాకుండా చేయడం హెడ్ మేష్టరు చూచి వల్లభాయిని మంచి చేసుకుంటేనేకాని లాభంలేదని గ్రహించాడు. అదే అతనికి ఉద్యమాలు సాగించడంలో ప్రథమ యత్నం.

ఇంగ్లండులో బారిష్టరు చదువు పూర్తిచేసి రాగానే అనేక ప్రభుత్వోద్యోగాలు వచ్చాయి వల్లభాయి పటేలుకు. కాని వాటన్నింటిని నిరాకరించి అహమ్మదాబాద్‌లో ప్రాక్టీసు ప్రారంభించాడు. అప్పటికే ఆ వూరిలో 5-6 గురు బారిష్టర్లు వున్నప్పటికీ, ఈ నిగర్వి, మితభాషి, తీవ్రవర్చస్సుగల ఈ కొత్త బారిష్టరు అనేకుల్ని ఆకర్షింపగలిగి త్వరలోనే మంచి ప్రఖ్యాతి సంపాదించాడు. పార్టీలకు, పోలీసులకు తుదకు జడ్జీలకుకూడ భయమే. నిష్కర్షగా ఉన్నదున్నట్లు పదిమందిలోను పలకడం అలవాటు. అది అందర్నీ హడలెత్తించేది. ఒకనాడు తన ముద్దాయిలకు బెయిలు ఇవ్వమని వల్లభాయి కోరగా పనికిరాదని పోలీసు ప్లీడరు అభ్యంతర పెట్టాడు. సందేహిస్తున్న జడ్జీవైపు తిరిగి "ఈ కోర్టులో న్యాయానికి స్థానంలేదనుకుంటాను" అని గర్జించాడు ఆక్రోశాపరుడైన పటేల్. ఒక అరగంట

పోయిన పిమ్మట జడ్జీ బేషరతుగా బెయిలు ఇచ్చాడు. పిమ్మట నేరం కూడా కొట్టివేయబడింది.

ఈనాడు భారతదేశం ఇంతటి ఉన్నత స్థానాన్ని సంపాదించగల్గిందంటే రథసారధ్యాన్ని వహించిన పటేల్‌కు సహజంగాగల కార్యదీక్ష మనోనిబ్బరమే ముఖ్యకారణం. తన పరిసరాలలో ఎంతటి తుఫాను చెలరేగినా అతని మనస్సు ఈషన్మాత్రం చెలించేదికాదు. దేశంలో వ్యతిరేకశక్తులు వేర్వేరు పంథాలలో ప్రవహిస్తున్నా తాను నిశ్చలంగా తన కార్యక్రమాన్ని కొనసాగించేవాడు.

కోర్టులో ఒకనాడు కేసు వాదన జరుపుతుండగా టెలిగ్రాము ఒకటి వచ్చింది. అందరూ ఆందోళనతో చూడటం ప్రారంభించారు. ఏకీడు వాటిల్లిందోనని జడ్జీ కూడా పటేలు మాటకు ఎదురుచూస్తున్నాడు. పటేల్ టెలిగ్రాం చదువుకుని, దానిని మడిచి జేబులో పెట్టుకొని తిరిగి యధాప్రకారంగా కేసు వాదన ప్రారంభించాడు. అంత చెప్పతగ్గ విషయం కాదుకాబోలునని చుట్టూవున్న వారంతా ఊరుకున్నారు. వాదన పూర్తి అయిన పిమ్మట అవచ్చిన టెలిగ్రాము తన భార్య దుర్మరణవార్త అని అప్పుడు వెల్లడి చేశాడు. అంతటి దుఃఖ సమయంలో అతను చూపిన మనోనిబ్బరము కార్యదీక్ష యావన్మందికి ఆశ్చర్యం కల్గించింది.

పటేల్ దేశసేవా కార్యక్రమం అహమ్మదాబాద్ మునిసిపాలిటీలో ప్రారంభమైంది. 1917 లో మునిసిపల్ కౌన్సిలర్‌గా పోటీ లేకుండా ఎన్నుకోబడ్డాడు. నగర పారిశుధ్యం పట్ల ప్రత్యేకశ్రద్ధ వహించిమునిసిపల్ ఉద్యోగులకు, పౌరులకు వారివారి కర్తవ్యాలను తెలియజెప్పి త్వరలోనే నగరాన్ని ఎంతో అభివృద్ధి చేయగల్గాడు.

అహమ్మదాబాద్‌లో 1916 లో కాంగ్రెస్‌మహాసభ జరిగింది. దానికి బాలగంగాధర తిలక్ మున్నగు నాయకులంతా హాజరైనారు. కాని ఈ సభకు వల్లభాయి వెళ్ళలేదు. ఆరోజుల్లో కాంగ్రెస్ అంటే పదిమంది పెద్దలుచేరి తీర్మానాలు ఆమోదించటం తప్ప జరిగేదేమీ లేదని ఆయనకు తెలుసు. కాని కొద్ది కాలానికే గాంధీజీ ఆఫ్రికా నుంచి భారతదేశానికి తిరిగివచ్చి, బీహారులోని చాంపరాన్ జిల్లాలో సత్యాగ్రహం ప్రారంభించాడు. ఈ విషయం పటేల్‌ని ఆకర్షించింది. కాంగ్రెస్‌లో వాగ్వాదులే గాక కార్యవాదులు కూడా వున్నారని గ్రహించి గుజరాత్ రాజకీయ సభకు గాంధీజీని అధ్యక్షుడుగా వుండమని కోరడం జరిగింది. ఆఏడు రాజకీయ మహాసభ గోధ్రాలో ఏర్పాటయింది. గాంధీజీని అధ్యక్షుడుగాను పటేల్‌ని కార్యదర్శిగాను ఎన్నుకోవడంలో పటేల్ రాజకీయ రంగంలో గట్టిగా జోక్యం కలుగజేసుకోవటం ప్రారంభమైంది. కొద్ది కాలంలోనే అధిక వర్షాలవల్ల గుజరాత్‌లోని కొన్ని ప్రదేశాలలో పంటలు నాశనమయ్యాయి పన్ను వసూలు వాయిదావేయవలసిందిగా రైతుల తరఫున గాంధీజీ, పటేలు ప్రభుత్వాన్ని కోరుతూ రైతు ఉద్యమం లేవదీసి వారికి సహాయపడ్డారు.

జీవితంలో క్రమశిక్షణకు పటేల్ ప్రథమస్థానమిచ్చేవాడు. పట్టుదల, వెరపులేని కార్య సూరత ఆయన ముఖ్య లక్షణాలు. బాగాయోచించందే ఏపనికి పూనుకునేవాడుకాడు. ప్రారంభించాక అది కొనసాగితీరవలసిందే. ఈ అచంచల కార్యదీక్ష బోర్డోల్ సత్యాగ్రహంలో బాగా విశదమైంది.

1928 లో బ్రిటిష్ ప్రభుత్వం గుజరాత్‌లోని రైతులకు పన్ను నూటికి 25 వంతులు హెచ్చుచేశారు. అసలే దుర్భిక్షంతో బాధపడుతున్న పేద రైతులకు ఇది గొడ్డలిపెట్టుగా భావించి ప్రాణం పోయినా ఆపన్ను చెల్లించవని రైతు సోదరులకు పటేల్ ఉద్బోధించాడు. 17 వేలమంది రైతులు పటేల్ నాయకత్వం క్రింద ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం ఈ పదిహేనువేల మందిని, వారికి వున్న 40 వేల పశువులను నిర్బంధించారు. అయినా ఉద్యమం ఆగలేదు. బ్రిటిష్ ప్రభుత్వానికి గత్యంతరం లేక పటేలుతో సంప్రతింపులకును దిగవలసివచ్చింది. పటేల్ మొదట నిరాకరించినా తుదకు గాంధీజీ సలహాపై ఉద్యమాన్ని విరమింపజేశాడు. ఈ సాహససంఘటనతోనే ఆయనకు మహాత్ముడు "బోర్డోల్ సర్దార్" బిరుదు ప్రదానం చేసింది, "వల్లభాయి బోర్డోలీలో తన వల్లభుని కలుసుకున్నాడు" అనేవాడు మహాత్ముడు చలోక్తిగా.

సర్దార్ పటేల్ కాంగ్రెస్ అధ్యక్షుడుగా 1931 లో ఎన్నుకో బడ్డప్పుడు ప్రతి పౌరునికి ప్రాథమిక హక్కులు వుండాలన్న తీర్మానాన్ని కాంగ్రెసులో ఆమోదింపజేశాడు. దాని సారమే ఈనాడు మన రాజ్యాంగ చట్టంలో కూడా వక్కాణించబడింది.

వ్యక్తిగత లాభాల కాశించిన స్వార్థపరులను, క్రమశిక్షణకు విరుద్ధంగా నడచిన వారిని ఆయన ఎన్నడు సహించలేదు. 1937 లో కాంగ్రెస్, ప్రభుత్వ అధికారాల్ని వహించడానికి అంగీకరించినప్పుడు పార్లమెంటరీ బోర్డుకు పటేల్ అధ్యక్షుడుగా నియమింపబడ్డాడు. దేశంలోని ఏడు


సర్దార్ జీకి జోహార్లు

రాష్ట్రాల ప్రభుత్వాలు తమ పరిపాలన కాంగ్రెసు ఆదర్శాల ననుసరించి నడిపిస్తున్నదీ లేనిదీ ఈయన జాగ్రత్తగా పరిశీలించేవాడు. నారిమన్, డాక్టర్ కారే, సుభాష్‌చంద్రబోస్ మొదలైన పెద్దలంతా కూడా పెడత్రోవలు తొక్కినప్పుడు పటేల్ చేత వాతలుతిన్నవాళ్ళే.

బ్రిటిష్‌వారు భారతదేశాన్ని వదలివేసిన పిమ్మట దేశంలో కుక్కగొడుగులులాగ లేచిన వందలాది స్వదేశ సంస్థానాలను రద్దుచేసి సమైక్య నవభారతాన్ని ఏవిధంగా నిర్మించాడో వందలాది సంవత్సరాలుగా దేశ-ఐక్యతను నాశనం చేస్తున్న సంస్థానాధీసులను ఒక్క పెట్టున తుడిచి పెట్టి ఎంతటి రాజకీయనైపుణ్యాన్ని ప్రదర్శించి అపర చాణుక్యుడనిపించుకున్నాడో మనదేశం అటువంటి మహనీయుణ్ణి స్వాతంత్ర్యం సిద్ధించిన కొద్ది కాలానికే కోల్పోవడం మన దురదృష్టమే.

సర్దార్‌పటేల్ జీవిత చరిత్ర ఒకపెద్ద గాథ, భారత స్వాతంత్ర్య సమర చరిత్రలోని ముఖ్యభాగమంతా తిరిగి చెప్పవలసి వస్తుంది. ఒక రైతు కుటుంబంలో జన్మించిన వల్లభాయి నవభారత నిర్మాత అయ్యాడంటే దానికి ముఖ్య కారణం ఆయన అద్వితీయ గుణగణాలే. ఆ మహనీయుని జీవితాన్ని జ్ఞప్తికి తెచ్చుకోవటం వల్ల ఆయన సుగుణ సంపదలో కొంతైనా మనకు అలవడితే మన జీవితం ధన్యమవుతుంది. ★





అద్దము మీద నీడలు

పంచకర్ల 'శ్రీమతిదేవి'

ఇక ఆదివారం వచ్చిందంటే ఈయన ఇంటిలోంచి కదలనే కదలరు, నిద్రనుంచి లేవడమంటారా ఎనిమిది గంటలకు తక్కువకాదు. "ఏమండీ లేవండి ఎంతపొద్దెక్కిందో, ఏమండీ లేవండీ ఎంత పొద్దెక్కిందో" అని కనీసం ఒక వందసార్లు అంటేగాని వినిపించుకోరు. నా శృతి మించిన కొద్దీ ఆయన ముసుగ తీసికోవటం మరీ ఎక్కువయింది. చివరకు ఆయన కప్పుకున్న దుప్పటి లాగిపార వేసాను. ఆయన ఒకసారి నాకండ్లలోనికి చూచి మళ్ళీ కళ్ళు మూసుకున్నారు. నాకు ఇక మహాకోపం వచ్చింది. కాఫీ, ఫలహారం చల్లారిపోతున్నాయి. ఇంటిలో కాయగూరలు కూడా ఏమీలేవు. తెచ్చేవాళ్ళు ఎవరూ కనబడలేదు. ఇకచేయునది ఏమీలేక చెవిలో కొద్దిగా నీళ్ళు పోసాను. మీరు అనుకుంటారు ఇదేమిటీ భర్తపట్ల ఈమె ఇంత అన్యాయంగా ప్రవర్తించుతూ ఉందేమాఅని. కాని ఈయన నాకు భర్తగాక పూర్వము మా ఇద్దరి మధ్య ఒక సంబంధం ఉంది, అదే బావా మరదలు సంబంధం. అది ఒక అనుబంధంగాను చివరకు విడలేని ప్రేమ బంధంగాను మారింది. మా బావకు చిన్నప్పటినుంచి నాపై అనురాగము అధికము. నాకు మా బావమీద భక్తి, ప్రేమ అభిమానం ఎక్కువ. మా బావకు చలోక్తులు విసరడం అంటే మహా సరదా. కాని కొంత కాలానికి మా కుటుంబాలమధ్య ఒక తుఫాను చెలరేగింది. బావామరదలు మాట్లాడు కోవడము గాని కంట బడడముగాని కష్టతర మయిపోయింది. మా బావకు పెండ్లి సంబంధాలు వస్తున్నాయి. నా మనస్సు ఉయ్యాలలాగ ఊగిసలాడింది. ఒక రోజున బిందిపుచ్చుకుని మంచినీళ్ళ భావిదగ్గరకు వెళ్ళాను. మధ్యాహ్నమవటంచేత అక్కడ ఎవ్వరూలేరు. మా బావ నాదగ్గరకువచ్చి "అనూ ! నీమీద నాకెంత అనురాగమో నేను చెప్పాలా. నానుండి నీవు ఎప్పుడూ వేరుకాలేవు. మనలను ఎవ్వరూ ఎడబాటు చేయలేరు" అని ఓదార్చిన తరువాత ఆయన మొండి పట్టు బట్టి నన్నే వివాహమాడారు. మా మామ గారు మామీద మొదట ఎంతగానో ఈర్ష్య, ద్వేషాలు చూపించారు గాని ఇప్పుడిప్పుడు మా ఇంటికి రావడం రెండు మూడు రోజులుండి పోవటము జరుగుతూ ఉంది. చిన్ననాటి నుంచి ఆయన, నేను ఎంతో చనువుగా, సరసంగా ఉండేవాళ్ళము. భార్యా భర్తలయిన తరువాతకూడా నేను ఆ చనువునే తీసికుంటున్నాను. ఆయన అంత సరసంగానే ఉంటున్నారు. ఆదివారం వచ్చిందంటే ఆయనకు నాకు ఏదో చిన్న పోట్లాట తప్పటంలేదు. "ఎందు కండీ నాతో పోట్లాడుతారని ఏపడక గదిదగ్గరో, భోజనం దగ్గరో అడిగితే "ఊసుబోవకలేపే అనూ" అంటారు. నిజంగా ఆయనతో పోట్లాడాలని నాకు అంతగా ఉండదు. ఆయనే నన్ను ఏదో ఒకటి అని కయ్యానికి కాలు దువ్వుతారు.

"భర్త అంటే కొంచమయినా భయముంటేనా? ఏమిటా కొంటె పనులు" అంటూ కళ్ళు నలుపు కుంటూ లేచారు. "తొమ్మిది కావచ్చింది కదా కాఫీ ఫలహారం వేడిగా ఎట్లా ఉంటాయండి. పెందలకాడే లేచి ముఖం కడుక్కొని ఆ కాఫీ ఫలహారాలు తీసికోకూడదూ" అంటూ వంటగదిలోకి వెళ్ళాను. లేచినవారు ముఖం కడుక్కో వచ్చా? అట్లాగే మంచంమీద మఠమేసుకొని కూర్చున్నారు. "ఏమండీ ముఖం కడుక్కోండి. ఏమండీ ముఖం కడుక్కోండి" అంటూ ఒక వందసార్లు వాగాలి. అట్లావాగాను కూడా. ఇక ముఖం కడుక్కొని నే నిచ్చిన టవలుతో ముఖం తుడుచుకో వచ్చా. నెమ్మదిగా వంటగదిలోకి వచ్చి నా పమిట చెంగుతో తుడుచు కున్నారు. పోనీలే, ఎందుకులే ఇక ఏమైనా అంటే పోట్లాడుతారని నవ్వి ఊరుకున్నాను. ఆదివారంగా మరి ఆఫీసుపని ఏమీ లేదు ఇక ఇంటిదగ్గర కూర్చుని ఇదీవరస. ఉప్మాతింటూ "అరవీశెడు పచ్చిమిరపకాయలు తరిగిపోసిందని" సణుకొంటున్నారు. మాట్లాడకుండడమే అన్నిటికి మంచిదని ఊరుకున్నాను మెదలకుండా. కాఫీపొడి అయిపోయింది. నిన్న చెప్పటం మరచిపోయాను. అందుకని ఒకపూటకు ఫరవాలేదని టీ కాచాను. ఆయనకు టీ నిచ్చాను. సగం వరకు త్రాగి "కాఫీ పెట్ట లేదే అనూ ? టీ ఇచ్చేవేంటి సాయిబ్బులు లాగా ?" అన్నారు. ఎక్కువగా మాట్లాడకుండా "కాఫీపొడి అయిపోయిందండీ" అన్నాను. "ఎట్లా అయిపోయింది?" అన్నారు తడుము కోకుండా కొంచెం కటువుగా. నాలోని సహనం సన్నిగిల్లింది. ఎట్లా ఆయిపోవటం ఏమిటి? కాచుకుంటే అయిపోతుంది" "అరపౌను కాఫీపొడి ఐదురోజులు రాకుంటే సంసారం ఎట్లా ఏడ్చేది. చెప్పు"

"ఏమండీ కాఫీపొడి ఏమన్నా నేను త్రాగుతానా అండీ"

"కాఫీపొడి నీవు త్రాగుతున్నావని నేనన్నానా? జాగ్రత్తగా వాడమన్నాను గాని"

"నేనూ మీతోసాటే ఒక అరకప్పు త్రాగుతున్నాను. అంతేకదండి. ఇంకా ఎట్లాతగ్గించేది? పోనీ అదికూడా మీరు ఖర్చు అనుకుంటే నేను రేపటినుంచి మానుకుంటా లెండి"

"ఖర్చు తగ్గించ మన్నాను గాని నిన్ను కాఫీమానుకో మన్నానా? ఇట్లాంటిపెడ అర్థాలు బాగాతీయటంచేతనవును"

"ఎందుకొచ్చిన వాదనండీ నాతో. మీకు పుణ్యముంటుంది. నా పని నన్ను కొంచెంసేపు చూచుకోనీయండి"

"నామాట అంటే అంతనిర్లక్ష్య మన్నమాట. చదువుకున్నదానివి. ఆమాత్రం ఆదాయం వ్యయం తెలియక పోతే ఎట్లా?"

"ఆదాయం, వ్యయం తెలియక ఏమిఖర్చు పెట్టుతున్నానండీ. చదువు కున్నదానిని కాబట్టే ఇచ్చారు నాకు స్వాతంత్ర్యం. కాఫీపొడి అయిపోతే ఏంచేస్తావు? ఎట్లా అయిపోయిందని ఏమిటీ పిచ్చి ప్రశ్నలు?"

"నీకు ఒక పిచ్చివాడిలా కనబడుతున్నా నన్నమాట. అవును. ఇంకేమైనా కూడా అంటావు. స్వాతంత్ర్యము ఈయక మునుపే "పిచ్చిపశ్నలు" "పిచ్చివాడంటున్నావు అదికాస్త కూడా ఇస్తే నీవు వంటచేయి నేను ఆఫీసుకు వెళ్ళతానంటావు"

"అవునండి. చదువుకున్నదానినే. ఇంతకన్నా ఖర్చు తగ్గించటం నాచేతకాదు. ఇంకా కావాలంటె నేను కూడా ఉద్యోగంచేసి నెలకు ఒక ఎనభై రూపాయలు తెస్తా. అప్పుడు మన ఖర్చుకు సంపాదనకు సరిపోతుంది"

"సరిపోయింది. ఓరిభగవంతుడా! ఇట్లాంటి గయ్యాళి దానిని మెడకు కట్టావేమయ్యా!"

"ఆయన కట్టిందేముందండి. మీరేఏరికోరి చేసుకున్నారుగాని"

"అవునవును. నేనే చేసుకున్నాను. అందుకు తగిన ప్రతిఫలం అనుభవిస్తున్నాను.

అత్తమామల పోరులేదు ఎవరిపోరూలేదూ. మీ పోరు మాత్రం నాకు తప్పటంలేదు. అయినా నిజంగా నాకండ్లలో కండ్లుపెట్టి చెప్పండి. అటుకాదు ఇటు. నానుంచి ఎట్లాంటి ప్రతిఫలము అనుభవిసున్నారు.

"తగిన ప్రతిఫలం"

"అదేఏమిటి అని?"

"అదిఏదోలే, నీకోసం నే పగలస్తమానం బండచాకిరి చేసి వస్తున్నాను కదా? నేనంటే అభిమానం ఉందా? ఖర్చు తగ్గించమంటే ఎవరికోసం అని నీవేమైనా తెలిసి కున్నావా?

"అబ్బబ్బ. ఖర్చుఖర్చు అంటారు ఏం ఖర్చండీ? అనవసరంగా ఏం ఖర్చు పెట్టుతున్నామని"

"ఐదు రోజులకు అరవీశెడు కాఫీపొడి, తగినంత పంచదార, పౌడరులు, స్నోలు, సెంట్లు, సినిమాలు ఇవన్నీ అవసరాలా, లేక అనవసరాలా? ఈనాటి విలాసాలు రేపటి అవసరాలవుతాయి. ,వచ్చే జీతం అంతా పెట్టినా వీటికి సరిపోతుందా?

"కాఫీ మీరు తాగుతున్నారు, నేనూ త్రాగుతున్నాను. ఈ స్నో, పౌడరులు అసలు మిమ్ములను ఎవరు తెమ్మన్నారు? ఖర్చు ఖర్చు అని ఎవరు వాగమన్నారు?"

"నేనే బుద్ధి తక్కువయి తెచ్చాననుకో. ఇకనుంచి అటువంటివి ఏమీ తేనులే"

"లేకపోతే మరి ఏమీ ఫరవాలేదు లెండి. నా అందం ఏమీ తరిగిపోదు. నాకు ఇంక పెండ్లి అయ్యే అవసరం ఏమీలేదు. అయినా భార్యకు చీరెలు, నగలు, పౌడరు. స్నోలు ఇవ్వలేనివాడు ఏరికోరి నన్నే ఎందుకు చేసికోవాలి?"

"ఏదో ఉద్ధరిస్తావని"


"నేనేమి ఉద్ధరిస్తానులెండి ఆడదానిని. మీరు ఉద్ధరిస్తున్నారుగా నన్ను. చీటికిమాటికి అది ఎట్లా అయింది, ఇది ఎట్లా అయిందని. అయినా ఈ పౌడరు స్నోలు ఎవరి కోసమో చెప్పండి. నా అందం మీ ఆనందంకోసమునే గా నేనీ అలంకారమంతా సాగించేది. లేకపోతే ఏమాసిన పాతగుడ్డో కట్టుకొని-" ఇక నాకు కండ్లనిండా నీళ్ళు తిరిగాయి. ఏడ్పు ఆగలేదు. ఇట్లాంటి చిన్నకయ్యాలు చిలికి చిలికి చివరకు గాలీవానలాగున తయ్యారవుతాయేమోనన్న భయంకూడా నాకు కలిగింది. వెక్కి వెక్కి ఏడుస్తున్నాను. ఇక ఆయనకు ఏమీ తోచలేదు. ఇక ఆయన నా దగ్గరకువచ్చి "అప్పుడే ఏడుపా అను రాధా?" అన్నారు జాలిగా. "సరేలెండి, మీసరసం. ఇక అవతలకి వెళ్ళండి" అన్నాను కోపంగా విసుగుతో.

అద్దముమీద నీడలు

ఇంతలో ప్రక్కింటివారబ్బాయి మధు "రాధక్కయ్యా, రాధక్కయ్యా" అంటూ కేకలువేసుకుంటూ మాదగ్గరికి వచ్చాడు. "ఏరా మధూ" అంటూ దగ్గరకు వెళ్ళా. మధు నా ముఖం వంకా ఆయన ముఖం వంక వక్కసారి చూచాడు "ఎందుకక్కయ్య ఏడుస్తున్నావు? మరే. మొన్నేమామయ్య గ్లాసుడు కాఫీపొడి బదులు ఇచ్చాడు. ఇదుగో అమ్మ ఇచ్చిరమ్మంద"ని పొట్లమిచ్చాడు. నాకు ఎక్కడలేని కోపం వచ్చింది ఈయనమీద. పాలబుగ్గల పసిపాపను గిల్లి ఏడ్పించి సంతోషించేది కొందరు. ప్రజలిని ఏడ్పించి సంతోషించేది కొందరు. "ఇదిగోనండీ మీ కాఫీపొడి" అంటూ కోపంతో ఈయనదగ్గరకు విసిరి వైచా. "అంత కోపమైతే ఎట్లా అనూ! మొన్న నీవు స్నాన జపాదులలో వుండగా మధువచ్చి అడిగాడు. అప్పుడు నేను ఇచ్చాను. అయినా నీకైనా తెలియ నక్కరలా కాఫీపొడి ఏమైపోయిందని" అని నవ్వు తున్నారు. "ఎవరి సాధింపులేకపోయినా మీతోవచ్చి పడింది నాకు. మీసరసం చాలుగాని అవతలకు వెళ్ళండి" అని ఆయననుంచి తప్పుకున్నాను. "ఏదో అయి పోయిందిగా అనూ! నన్ను క్షమించు" అని ఈయన నన్ను కదలనీయడంలేదు. ఇక ఈయన నన్ను వదలి పెట్టరురా బాబూ అనుకొని "సరేలెండి" అన్నాను. "సరే అంటేకాదు. క్షమించానంటే"—అని అన్నారు. నాకు మహాకోపంవచ్చింది చెప్పొద్దూ! అనవసరంగా ఈపోట్లాట దేనికి? తరువాత క్షమించమనటందేనికి? "ఏమండీ, ఎందుకండీ ఈగొడవంతా?" అన్నాను. ఆయన ఒక్క చిరునవ్వు నవ్వినా కండ్లలోకి చూసారు. అది ఆయనకు ఒక బ్రహ్మాస్త్రం నన్ను వశంచేసికోవటానికి. అందుకనీ నేను అప్పుడప్పుడూ ఆయన దొంగమాటలు చెప్పుతున్నా రని తోస్తే "ఏమండి ఇటు చూడండి నా కండ్లలోకి చూచి చెప్పండి" అంటాను. అట్లా ఆయన అస్త్రాన్ని ఆయన మీదే ప్రయోగిస్తా. నావంకచూసి చెప్పటం అంటే ఆయన నానుండి ఏమీదాయలేరు. ఇప్పుడు నేను ఆయనవశమై పోయా. "క్షమించానండి బావగారు" అంటూ బుగ్గమీద ఒక చిటికివేసాను, మగదలురాణి మహాసపసురాలే అంటూ నన్ను దగ్గరకు తీసుకున్నారు. మధుమేమిద్దరమూ పోట్లాడుకుంటూ ఉన్నామని వాళ్ళ అమ్మ విమలమ్మను తీసుకువచ్చాడు. విమలమ్మగారు అప్పుడప్పుడూ మామంచి చెడ్డలు చూస్తూ పెద్దదిక్కుగా ఉంటూఉన్నారు. మా ఈ పరిస్థితిని ఆమె కళ్ళారా చూచి "ఒరే మధూ! ఆలూ మగడి పోట్లాటలు అద్దంలో నీడవంటివి మనకెందుకు రారా అని మధూ చేయిపట్టుకు తీసుకువెళ్ళింది. మధు బిక్కముఖం వేసి ఏమీ తెలియక ఆమెను అనుసరించాడు. సిగ్గుచే నాముఖం కందిపోయింది. ఎదుటనిలువుటద్దములో పడుతున్న మా నీడలు వేరయ్యాయి.

మద్రాసు కాంగ్రెసు సభ ముఖద్వారము

భక్తులు - కాంగ్రెసు నాయకులు.



స్వప్న తోరణం

—శ్రీ గోరా శాస్త్రి.

(జనవరి సంచిక తరువాయి)

రా : గోపాల్ ఎలా వున్నాడు?

సుం : నవరత్న ఖచితంగా ఉన్నాడు. అతనికేం? వచ్చే ఆదివారం ఏదో పిక్నిక్ పార్టీ ఎరేంజి చేస్తున్నాడు. నేను రాక తప్పదంటున్నాడు

రా : వెళుతున్నావా?

సుం : నువ్వు సలహా చెప్పు- నువ్వు ఏంచేయమంటే అది చేస్తాను అదిసరేగాని- యీ చీర చూశావా? ఈ బోర్డరు డిజైను బాగుందా? నేనే ప్రింట్ చేశాను.

రా : చాలా బాగుంది. నువ్వు క్రమంగా ఇండియాలో కల్లా పెద్ద ఫ్యాషన్ ఎక్స్‌పర్ట్‌వి అయిపోతున్నావు.

సుం : అలా అంటేనే నాకు ఒళ్ళు మండుతుంది. అంత ఓర్వలేనితనం ఉండకూడదు. నేనేం నగలు పెట్టుకో లేను, రంగురంగుల చీరలు ఎప్పుడూ కట్టుకోను. సరిగ్గా జడ వేసుకుందికి కూడా బద్దకమే...అయినా నీలాంటి వాళ్ళు మాటలంటూనే వుంటారు. అనుకోండి నాకేం.

సుం : నువ్వలా బెల్లంకొట్టిన రాయిలా నుంచున్నావేం పార్వతీ? ముత్యాలొలికే నాలుగు మాటలేమైనా చెప్ప కూడదూ?

పా : చెప్పడానికేముంది సుందరీ?

సుం : అంతా లోపలస్వయంపాకం, ఏం?

పా : నీ దయ.

సుం : నాదయా నీ కెందుకులే మధ్య. మనకందరికీ యీ రామారావుగారి దయ ఉండాలి. అదిసరేగాని అక్కయ్యా నిన్నోసారి కనబడి వెళ్ళమంచండోయ్! ఆపైన నీ యిష్టం.

రా : సరే. పద. ఓసారి అలా వెళ్ళొస్తాను పార్వతీ. అన్న య్యొస్తే చెప్పు. ఖైమెంతైంది సుందరీ?

సుం : ఎంతో అవలేదులే. ఎనిమిదింపావు. పద.

రా : అలా దారితియ్యి ముందు.

సుం : స్పష్టంగా కనపడే దారికూడా నీకు తెలియకుండా ఉందాయె ఖర్మ.

(రోడ్డుమీద మోటార్ల పీపీ ధ్వనులు)

రా : జాగ్రత్త సుందరీ రోడ్డుప్రక్కగా నడువు.

సుం : మరేం భయంలేదు. నా దారిన నేను జాగ్రత్తగా నడవగలను. నువ్వే కాస్త ఒళ్ళు దగ్గర పెట్టుకొని మరీ నడువు. నడుస్తూ నడుస్తూ కలలు కనేరకం నువ్వు.

రా : ఇంత అర్జంటుగా రాధ కబురు పంపించటం దేనికి?

సుం : ఊరికేనే. కాకిచేత కబురంపితే నువ్వు రెక్కలు కట్టుకువచ్చి అక్కడ వాల్తావో వాలవో పరీక్షిద్దామని.

రా : నువ్వు కాకివి కావుగా?

సుం : రక్షించావు. పోనీ అంతవరకైనా ఒప్పుకున్నావు. మరేవన్నంటావు?

రా : రాజహంసవి.

సుం : అయ్యబాబోయ్! తీసికెళ్ళి మానస సరోవరంలో పడెయ్యకేం? చస్తాను- చలీ-మంచూ——

రా : ఆ దీపాలు చూడు సుందరీ! రాత్రి వేళల్లో అంతా ఎలా మారిపోతుందో చూశావా? ఇన్నివేల దీపాలు. ఇన్నివేల మనుషులు... వెయ్యి రంగుల వెయ్యి కాంతుల మహానగరం!

సుం : వల్లకాడు మహానగరం అదలా ఉంచుగాని-పార్వతి పెళ్ళెప్పుడు రామారావ్?

రా : ఏమిటో సుందరీ! దాన్ని చూస్తూంటేనే కడుపు తరుక్కు పోతూంటుంది.

సుం : పార్వతికేం? దిగ్గజాలలాంటి మేనమామలు కంటికి రెప్పలాగ కాపాడుతున్నారుగా?

రా : ఆం. మా బావ బతికిన్నన్నాళ్ళు పాపం అల్లారు ముద్దుగా పెరిగింది. మహారాజ భోగంగా పెంచాడు_ డబ్బులేకపోయినా, అమృతహృదయుడు పాపం బతికున్నన్నాళ్ళు అజ్ఞాంచు ప్రతికాని యితరులమీదే ఋర్చు పెట్టాడు. ఇప్పుడో పుట్టెడు దుఃఖంతో అక్కయ్య, దీనవదనంతో పార్వతి!

సుం : ఇంటర్‌తోనే చదువెందుకు మానిపించేశారు మరి?

రా : పెళ్ళి పెళ్ళి! ఆ మహాభాగ్యంకోసం. మా బావ ఆకరినిముషాల్లోకూడా మాచేత వాగ్దానం చేయించుకున్నాడు_ఆయన అక్క కొడుక్కిచ్చి పార్వతికి పెళ్ళి చేస్తామని.

సుం : బాగుంది దానికి చదువుకీ సంబంధం ఏమిటి?

రా : వాళ్ళ మేనత్త ఆజ్ఞాపత్రం పపించింది. అమ్మాయికి యింక పై చదువులు అక్కర్లేదని.

సుం : అది చూసి మీరు కాలేజీ మానిపించేరా? మీ అన్నయ్యా సరే, నువ్వు అంత మూర్ఖుడివి ఎలా అయిపోయావ్?

రా : ఏంచేయ్యను సుందరి? ఆ విషయంలో నా యిష్టం ఒక్కటే ఎలా చెల్లుతుంది? ఇప్పుడీ గమ్మత్తు చూడు. వాళ్ళ మేనత్త గతం అంతా మరిచిపోయింది. చచ్చిపోయిన తమ్ముణ్ణి మరిచిపోయింది. ఇప్పుడు పదివేల రూపాయల కట్నం కావాలని పేచి పెడుతోంది.

సుం : ఇస్తారా?

రా : బాగుంది నీ వ్యంగ్యం. పదివేల రూపాయలు! యీడ్చితంతే యీవాళ మా దగ్గర పది దమ్మిడీలు లేవు. గుడ్డిలో మెల్ల ఏమిటంటే_ కుర్రవాడు కాస్త ఎదురు తిరిగి కట్నం అక్కరలేకండ పెళ్ళాడేట్లున్నాడు. అదొక్కటి కాస్త ఆశగా వుంది. ఇవన్నీ తలుచుకుంటూ వుంటే ఏదో చెప్పలేని బెంగ గుండెల్లో కళుక్కుమంటూంది.

సుం : నువ్వేం బెంగపడకు రామారావ్! వీటన్నిటికి ఏదో మార్గం ఉండకపోదు. అంతగా అయితే మానాన్నగారి మెడలు వంచి నీకు కావలసిని డబ్బు అప్పగా ఇప్పిస్తాను. _సరేనా! ఉహూ! నేనే మీ కుటుంబంలో మనిషినయితేనా! _ ఈ సమస్యలన్ని క్షణంలో విడగొట్టేదును!

రా : మంచిది సుందరి! ఆ మాత్రందయుంచు. అంతేచాలు, ఇదిగో కబుర్లతో యిట్టే ఇల్లు చేరుకున్నాం. అదిగో రాధ. హల్లో రాధా!

రాధ : హాల్లో వచ్చావ్ ఎలాగయితేనేం!

సుం : రావడమేమిటి! ముక్కుకి తాడుగట్టి లాక్కొస్తేను.

రాధ : అవును రాధ పుట్టినరోజు పార్టీ_అన్నా మొహం చూపించనివాడు. అంతేనా?

రా : అడుగు పెట్టగానే ఆశీర్వాదంలా. సారీరాధా! నీ పుట్టినరోజు పండిక్కి బహుమతీ ఏదీ తీసుకురాలేకపోయాను.

రాధ : నువ్వు ఎలాగైతేనేం ఇప్పుడైనా మొహం చూపించావు. అంతేచాలులే. కులాసాగా వున్నావా?

రా : ఏదో నీదయవల్ల. పుట్టిన రోజు అలంకరణా ఏమిటిది దేదీప్యమానంగా వెలిగిపోతూ ఉన్నావ్!

రాధ : తథాస్తు నీ మాట ఎందుకు కాదనాలి.

సుం : రాధా నాకు కొంచెం లోపల పనుంది. మీ రిద్దరూ మాటాడుకుంటూ వుండండి.

రాధ : వెళ్ళిరా. రామారావ్ ఒసారలా విమలగారింటికి వెళ్ళొద్దామా! దగ్గిరేకదూ! నాలుగడుగులు. పాపం. వాళ్ళ నాన్నకి తీవ్రంగా జబ్బుగా ఉందట.

రా : అయ్యో పాపం. తప్పకుండా వెళ్ళొద్దాం. పద. అలాగే వస్తావా?

రాధ : ఏం? ఈ డ్రెస్ బాగులేదా? మార్చుకురానా?

రా : దొరికి పోయావ్ _ చూశావా? వెళుతున్నది రోగి దగ్గిరకు. ఊరడింపుకోసం. అయినా డ్రెస్సూ - -

రాధ : నువ్వో వింతరకం జంతువ్వి. పద.

(వీధిలో కారుధ్వనీ అవీ వినబడతాయి)

రాధ : యీ వెధవగొడవా ! అందుకే కారు లేనిదే నడిచి ఎక్కడికేనా వెళ్లడమంటే నాకసహ్యం. అయినా ఎన్ని వేల గుండెలులే-మా నాన్నగారి పేరు చెపితే యీ ట్రాఫిక్కంతా నిలిచి పోతుంది తెలుసా? సింహ స్వప్నం. ఏమనుకున్నావో? అది సరేగాని రామారావ్ ! నీతో కొన్ని విషయాలు మాటాడాలి. అందుకే నిన్ను పిలిపించింది. చాలా అవసరం.

రా : విమలని ఊరడించడానికి కాదా : నన్ను పిలిపించింది

రాధ : ఈ వూరడింపులకి అంతెక్కడలే. ఎవరికష్టాలు వారివి. సాయంత్రం పార్టీకి రానంది విమల. వస్తేగాని వీలులేదని కబురు పెట్టాను. మన చేతికింద పని చేసే తాబేదార్ల కూతుర్లకి కూడా ఎంత అహంభావమో చూడు!

రా : విమలతండ్రి నీ చేతికింద తాబేదారా ?

రాధ : మా నాన్నదగ్గిర చేస్తే నా గగ్గిర చేసినట్లే లెక్క. అది సరేగాని రామారావ్ ! మా నాన్నగారు వచ్చే నెలలో రిటైరై పోతున్నారు తెలుసా ?

రా : అంచేత?

రాధ : ఈ లోపుగా నిర్ణయించి ఒక నిశ్చయానికి రావలసిన విషయాలు చాలా ఉన్నాయి. నిన్న రాత్రి పన్నెండూ ఒంటిగంటదాకా చాలా సంగతులు మాటాడాం, నేనూ మా నాన్నగారు...నీ ప్రసక్తి కూడా వచ్చింది. నువ్వు వారం పదిరోజుల నుండి కనబడ్డం లేదేం అని అడిగారు. నాకు చెడ్డభయం వేసిందనుకో !

రా : భయం దేనికి ?

రాధ : ఆయన సంగతి నీకు తెలీదు. మహామహులే ఆయనకి భయపడతారు. నువ్వొకసారి ఆయన్ని కలుసుకొని మాటాడకూడదూ?

రా : నాకూ ఆయన్ను కలుసుకోవాలని వుంది. మా పార్వతికి పెళ్ళి చెయ్యాలి. మీ నాన్నగారితో చెప్పి ఓ పదివేల రూపాయలు అప్పిప్పిస్తావ్ ?

రాధ : పార్వతి పెళ్ళికి పదివేల రూపాయలు దేనికి? అంతగా ఎక్కడా మొగుడు దొరక్కపోతే ట్రెయినింగుచదివి మేష్టరీ చేసుకోమను. హాయిగా బతుకుతుంది.

రా : బాగా చెప్పావు.

రాధ : ఇంతకూ అసలు విషయం తప్పించేస్తున్నావ్ .... అదిగోమళ్లీ సిగరెట్టు వెలిగిస్తున్నావ్? ఇవేళ ఎన్ని సిగరెట్లు కాల్చావు చెప్పు ?

రా : నాలుగు పాకెట్లు.

రాధ : తక్షణం నువ్వు సిగరెట్లు మానెయ్యాలి. ఇలాంటివే నాన్నగారికి ఎక్కువ పట్టింపు.

రా : అలామరి నువ్వు పూర్తిగా నాన్నగారి భగవద్గీతకి టీకా తాత్పర్యం అయితే ఎలా చెప్పు?

రాధ : తను రిటైరయ్యే లోపుగా నా భవిష్యత్తేమిటో నిశ్చయం అయిపోవాలంటున్నారు.

రా : మరి సుందరి సంగతి.

రాధ : అన్నట్టు మరిచిపోయాను. నువ్వు సుందరితో అంత చనువుగా ఉండడం ఏమీ బాగాలేదు. అనవసరంగా దాని మనస్సు చెడకొట్టి పాడు చేస్తున్నావు.

రా : అది నువ్వనదగిన మాటకాదు.

రాధ : ఇలా ఎన్నాళ్ళో జరగడానికివీలులేదు రామారావ్ ఒక్కసారి నాన్నగారితో మాటాడు. నీ మంచికోసం చెపుతున్నాను.

రా : మంచిది అలాగే ఇదిగో విమలయిల్లు

రాధ : తలుపు తట్టు.

విమల : (తలుపు తీస్తూ) మిమ్మల్ని కిటికిలోంచి చూశాను. రండి రామారావుగారూ ! రా రాధా !

రా : ఎలాగుంది మీ నాన్నగారికి ! .

విమల : అలాగే ఉంది. అయాసం ఎక్కువగా ఉంది.

రా : మరేం ఫరవాలేదు విమలాగారూ మీరేం బెంగ పెట్టుకోకండి.

రాధ : బెంగపెట్టుకోకు విమలా. నయమవుతుందిలే. రామారావ్ మరి నే వెళ్ళిరానా? నాన్నగారొచ్చే వేళయింది.

రా : అదేమిటి ! విమల నాన్నగారిని కాస్త వెళ్ళిచూద్దాం!

రాధ : అమ్మో ! జబ్బుమనుషుల్ని చూస్తేనాకు చెడ్డభయం. వెళ్ళొస్తాను. రిక్షాలో పోతాలే,

రా : మంచిది ..ఆఁ...ఇప్పుడు చెప్పండి విమలగారూ?

స్వప్న తోరణం

విమల : మీకు తెలియంది ఏముంది? నాన్న జీతం ఎడ్వా 'న్సు కోసం అప్లికేషన్ పెడితే ఆఫీసరు ఇవ్వలేదు

రా : రాధా వాళ్ళ నాన్నే గా... పోనీలెండి. ఆ విషయం లోనూ మీరు భయపడవద్దు. కావలసిన మందు ఏమిటో చెప్పండి. నేను తీసుకు వస్తాను పొద్దున్నే పార్వతిని పంపుతాను... ఛా! ఏమిటది విమలగారూ! అలా కళ్ళనీళ్ళు కూడదు.

ఎన్నాళ్ళనుంచి నాకు తెలియలేదే!

విమల : నాలుగైదు రోజులైనదండీ! ఏమిటో ఏంతోచడం లేదు. కంగారుగా ఉంది మాట సహాయానికి కూడా ఎవరూ లేరు.

రా : అధైర్య పడకండి. నేను వెళ్ళి మా పార్వతిని పంపుతాను. దీనికి బెంగపెట్టుకోకండి. మందులూ అవీ కొంటున్నారా?

విమల : (దుఃఖం మళ్ళించుకుంటూ) ఏమిటో దుఃఖం వచ్చింది ఏవేమిటో జ్ఞాపకం వచ్చాయి. మా నాన్న ఆఫీసు, రాధగారూ! యీ జబ్బూ, ఇప్పుడిప్పుడు లోకం కొంచెం అర్ధం అవుతూంది. రామారావుగారూ! ఉన్నప్పుడల్లా యింటి చుట్టూ తిరిగి నన్నూ నాన్ననీ లక్షసార్లు సినిమాకి తీసికెళ్ళిన గోపాల్ యిపుడు యీ ప్రాంతానికే రావడంలేదు. ఇలాంటి పరిస్థితుల్లో .. మీరింత దయగా మాటాడితే దుఃఖం వచ్చింది...

రా : తప్పు, తప్పు, నిండింటిలో అలా కన్నీళ్ళు పెట్టుకోకండి. మనకందరకీ దేవుడే దిక్కు, పదండి. మీ నాన్నగార్ని చూద్దాం.

విమల : (ఏడుస్తూనే) పదండి.

(ఇక్కడినుంచి నేపధ్యలో ఆవేశికమైన సంగీతం అలా వినిపిస్తూనే ఉంటూంది.)

పా : అపుడే నిద్రపోతున్నావా మామయ్యా : పాలు తీసుకొచ్చాను. అంత అలిగి పోయావా మామయ్యా! సరే నిద్రపో. నిద్రలో మంచి మంచి కలలొస్తాయి. నీ స్వప్న సుందరిని ఒక్కసారి చూసుకురా! అపుడే నిజం తెలుస్తుంది. స్వప్నంలో కనబడే నిజాలు మేలుకుంటే కనబడవు. మామయ్యా! నిద్రపో!

(స్వప్న జగత్తు సూచించే సంగీతం)

రా : (పలవరిస్తున్నట్లు) ఓహో! రాధాదేవి! తమాలవృక్షచ్ఛాయల్లో - యమునానదీ సైకతాల్లో - రాధాదేవి! నైలాన్ చీరల శుభ్ర సౌందర్యాల రాధాదేవి! రండిరండి రాధాదేవి! ఈ పులీనతలంలో మీ పెట్రోలు కారు నడవదు ఈ రాగమయ జగత్తులో మీ రూపాయనోట్లు చెల్లవు. దివ్యమైన యీ మెత్తని మేఘజాలంలో మీ ఎలక్ట్రిక్ దీపాలు వెలగవు. ఈ లోకాల్లో మీ శ్రీకృష్ణుడు దొరకడు. రాధాదేవి! మీకు బాంకు మిగుల కృష్ణుడు ఆఫీసరు హోదా కృష్ణుడు కావాలి. కాని — కాని నేను ఆ కృష్ణుణ్ణి కాలేను రాధాదేవి! మన్నించండి. ఇన్నాళ్ళూ రూపతృష్ణకు లోబడి పోయాను. మీ బంగారు మేని ఛాయ వెనుక, నీలోత్పలాల నయనాల వెనుక-అంతకన్నా సుందరమైన అమృత హృదయం ఉంటుందనుకున్నాను.-కాని-కాని మీ హృదయం పాషాణం రాధాదేవి!

(సుందరి)

ఓహో! సుందరి! జగదైక సుందరి. నీకు కావలసిన నసందుణ్ణి నేను కాలేను, సుందరీ. నీకు కావలసింది నీ సౌందర్యాన్ని అనుక్షణం కీర్తించి అర్చించే పూజారి నీ కాటుక కళ్ళ నయనాల్లోకి చూస్తూ జీవితం గడిపివేసే ఆనందజీవి. నీ గాఢానురాగాని కొక అవధిలేదు సుందరీ. అదొక వృథా గమ్యరహితమైన సౌందర్య యాత్ర. నన్ను మన్నించు సుందరీ. నా జీవితాన్ని నీ స్వప్నాలతో ముడిపెట్టుకోగలడం అసంభవం, నీ జీవిత సహచరుణ్ణి నిస్సంశయంగా సుఖపెట్టగలవు. కాని — అలాంటి సుఖం నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తుంది. ఆ స్వప్న సముద్రంలో మునిగి పోవడంకాదు సుందరీ. శీతల నదీజలంతో పుణ్యస్నానం.

(విమల)

అభాగ్యురాలివి విమలా! కాని భయపడకు. నాకు చెల్లెలు లేనిలోటు నువ్వు తీర్చగలవు. అమాయకురాలివి__నడి సముద్రంలో నిలువీత యీదుతున్నావు కాని__ధైర్యం తెచ్చుకో. ఏనాడో కోల్పోయిన

చెల్లెల్ని మళ్ళీ నీరూపంలో సంపాదించుకున్నాను. రామమ్మా... విమలా ! మీ అన్న రాము వచ్చాడు. ఇంక నీకేం భయం. గోపాల్ వంటి తోడేళ్ళ బారినుండి నిన్ను రక్షిస్తాను. నీకు తగిన వరుణ్ణి నేను వెతుక్కొస్తాను.

విమలా ! దీర్ఘసుమంగలీ భవ !

(అలౌకిక సంగీతం ఆగిపోతుంది

ఉషః కాలాన్ని సూచించే ధ్వనులు)

పా: (నవ్వుతూ) అదేమిటి మామయ్యాయ్. ఎవరినీ "దీవనలు?

రా: (బద్ధకంగా) దీవనలేమిటి ...... తెల్లారిందా?

పా: ఆఁ...... ఇంక చాలులే నిద్ర లే ఏమిటా పలవరింతలూ? ఎవరిని దీర్ఘసుమంగలీభవా అని దీవిస్తున్నావు? కలొచ్చిందా?

పా: ఆఁ. ఈవాళ మార్గశిర లక్ష్మివారం మావయ్యా. కాని ఏమిటో అమ్మ వంటింట్లో కన్నీళ్ళు పెట్టుకుంటోంది. ఎందుకో? తెలీదు.

రా: నాకు తెలుసు. రాత్రి అన్నయ్య చెప్పాడు మీ మేనత్త దగ్గిరనుండి ఉత్తరం వచ్చింది. అంతటితో మరణించిన వారి వాగ్దానాలూ మరపించాయి. అమ్మని నేను మళ్ళీ నవ్విస్తాలే. కాని...పార్వతీ ! ఇలారా. ఇన్నాళ్ళూ నిన్నెందుకు పోల్చుకో లేకపోయాను. ఇంట్లోఉన్న వరసువేని మరిచిపోయి గాజుముక్కల కోసం తిరిగాను. పార్వతీ ! ఇలారా ! ఈ క్షణంనుంచీ నీహుందా మారిపోయింది. ఇక నన్ను నువ్వు మీరు అని పిలవాలి తెలిసిందా పార్వతీ? ...చా ! అదేమిటి పార్వతీ? పురోహితుడు లేనిదే నమస్కారం పెట్టకూడదు. నీకిష్టమేనా పార్వతి ! చెప్పవేం?

పా: (అర్ధోంగా) అలా అడక్క మామయ్యా. ఇన్నాళ్ళూ పార్వతి ఏమిటో తెలియలేదా నీకు?

రా: అ ఆలవాటే మాన్పుకోవాలన్నాను. మీరూ అని పిలవలేవ్రూ?

పా: (నవ్వుతూ) ఇప్పుడే అంత అధికారం కూడదండీ...

★

జన్మ దినపు బహుమతి

చక్రవర్తి శకుంతల, దర్బాన్, దక్షిణ ఆఫ్రికా

కమలకు తన పెనిమిటి అంటే ఎంతో ప్రేమ: అతడు ఎన్నడూ ఆమె పుట్టిన దినం మరిచిపోడు. ఆమె స్నేహితురాండ్రు ఎందరో ఉన్నారు. కాని వారల భర్తలు వాళ్ళ వయసు మాత్రమే జ్ఞాపకం పెట్టుకుంటారు. జన్మ దినం మాట తలపనేతలవరు.

ఆనాడు ప్రొద్దున్నే కాఫీ పుచ్చుకోడానికి ఇద్దరూ టేబిలుమీద కూచున్నప్పుడు, కమల తన ప్లేటుక్రింద తెల్లనికవరులో కొత్త నూరు రూపాయీలనోటు పెట్టి ఉండడం చూసుకుంది. దాన్ని తీసుకొని ఆమెలేచి అతని ప్రక్కకుపోయి అప్పుడప్పుడే కొంచెం పలచ బడుతూవున్న అతని శిరస్సుపైన తనప్రేమ చిహ్నంగా తన పెదవులు అద్దింది.

"అదుగో, అదుగో, వాసన వస్తూంది మాడిపోయి నట్టు" అని జగన్నాథరావు మృదువుగా ఆమెకు పెనం మీద పెసరట్టుమాట జ్ఞాపకం చేశాడు. కమలకు బాగా తెలుసును. కొంచెం మాడువాసన వస్తే జగన్నాథరావుకు సహించదని.

"అయ్యో. నాకు బొత్తిగా మతి ఉండడంలేదు ఈ మధ్యన" అంటూ కమల దాన్ని తిరగేసి మళ్ళీ వచ్చి కూర్చుంది.

"ఈచిన్న బహుమతిని ఎలా ఖర్చు పెట్టడానికి ఆలోచిస్తున్నావు?" అని జగన్నాథరావు అడిగాడు. ఆమెకు ఎన్నో తలంపులు ఉండవచ్చును అని అతనికి తెలుసును.

రెండు నిమిషాలదాకా ఆమె నిశ్శబ్దంగా ఉండి ఏదో ఆలోచించుకొని "టౌనుకు పోయి నాలుగు అంగళ్ళూ చూసి, మంచి....మంచి...." అంటూనే కమల నిలిచి పోయి, అలాంటి ఖర్చులకు జగన్నాథరావు ఒప్పుకుంటాడా అని జంకింది. అయితే అంతకుముందే ఆగుడ్డలకు అడ్వాన్సు ఇచ్చివచ్చింది, ఈ బహుమతి ఎలాగావస్తుంది కదా అని.

"మంచిది, ఏం కొంటావు కమలా? నీ యిష్టం ఏమైనా కొనుక్కో, దానికేమీ నాకు దమ్మిడీలతో లెక్క చెప్పనక్కరలేదు" అంటూ చిరునవ్వుతో ఆమె మానసిక వ్యగ్రతను మాన్పించాడు జగన్నాథరావు.

తాను అతనిని నమ్మలేదన్న భావం కనపడిందని కలుగుతూన్న చిరునవ్వును అణుచుకుంటూ కమల - మీకు నాయందు అంతప్రేమ ఉన్నది కనుక నేను చాలా అదృష్టవంతురాలను" అని పరధ్యానంగానే అన్నది. ఇద్దరూ ఇంకా ఏవో మాటలు అక్కడ కూచున్నంత సేపూ మాట్లాడుకుంటూనే ఉన్నారు.

"తలుపులు భద్రంగా తాళం పెట్టడం మరచిపోవద్దు కమలా," అంటూ బయటి గేటు దగ్గరకు పోయికేక వేశాడు. "నాకంటే ముందు నీవే యింటికి చేరుతావను కుంటాను."

"Oh yes" అని ఇంటిగుమ్మంలోంచి కమల కేక వేసింది "Good-bye."

ప్రొద్దుటి కాఫీ కప్పులు కడిగిపెట్టుకోడం, మిగిలిన యింటిపని, అంతా నిమిషాలమీద ముగించుకుంది. టౌనుకు పోవడానికి గుడ్డలు వేసుకొని తయారైంది.

తన తలంపులన్నీ, తాను ఎలాంటిగుడ్డలు కొనవలెనో అనీ, ఆ గుడ్డలు కొనే అంగళ్ళలో ఉండేనౌకరులు తను ఈ వయస్సులో, చిన్నయువతులకు ఉపయోగించే, ఇలాంటి గుడ్డలు కొంటూవుంటే నవ్వుకోరా అనీ, ఈ ఆలోచనలమీదనే కేంద్రీకరించుకొని ఉన్నాయి.

తలుపులు భద్రంగా తాళాలు పెట్టుకొని స్టేషనుకు చేరింది. కొంచెంసేపట్లో రైలుబండి వచ్చింది. ప్రయాణం కులాసాగా ఉండేందుకని, ఇంకో స్త్రీమాత్రమే కూర్చొని ఉన్న సెకండుక్లాసు పెట్టెలో ఎక్కికూచుంది.

తనకు ఎదురుసీటులో కూచోని ఉన్న స్త్రీ ఆకుపచ్చ రంగు బనారసు చీరె కట్టుకొనివుంది. అయితే చూపులకు

ధనవంతుల కుటుంబంలోనిదే అన్నట్టు కనబడుతూ వుంది. ఆమెను చూడగానే ఏమోగాని కమల మనస్సులో ఆమెయందు ప్రేమగాని మంచి తలంపుగాని కలగలేదు. కమల చూపులనుబట్టి ఆమె మనస్సు గ్రహించినదానిలాగ ఆ స్త్రీకూడా పెడమొహం పెట్టుకొనే కూచుంది. ఆమె తన నల్లనిపెద్ద చేతి సంచిలోంచి సిగరెట్టు తీసి వెలిగించి బయటి వైపు దృశ్యాలు చూస్తున్నట్టుగా కూచుంది.

బండి టౌనుకు చేరటానికి రమారమి ఒక గంట కాలం పడుతుంది. తాళగతిలోవున్న రైలు చక్రాల చప్పుడు కమలకు కొంచెం మాగన్ను కలిగేట్టుగాచేసింది. అందులోనే ఆలోచన; "అప్పుడే ఒక సంవత్సరం ఎలాగ గిర్రున తిరిగిపోయిందో" ఆచక్రాల చప్పుడు "నీకు వయసు పెరుగుతూంది; నీకు వయసు పెరుగుతూంది" అంటూ పాడుతూన్నట్టుగా కమల మాగన్నుగా ఉండే తలచుకుంటూంది. అది బాగా లేదని కష్టంమీద ఎలాగో ఆ తాళగతిని "పచ్చ నోటు ఖర్చు పెట్టు; పచ్చ నోటు ఖర్చు పెట్టు" అనే మాటలుగా మార్చుకొని మనస్సుకు ఉత్సాహం తెచ్చుకుంది.

బహుశా, యీతలంపే ఆమె హృదయంలో నూతన చైతన్యం కలిగించి, ఆ నిద్రమగతను పోగొట్టింది. అంతలోనే బండి ఒక సొరంగంలోంచి పోతూవున్నందున అంతా చీకటి అయిపోయింది. ఆ చీకట్లో తన మోకాళ్ళకు రాసుకుంటూ ఎవరో నడిచినట్టుతోచింది. కమల ఉలికిపడి లేచి సరిగాకూచోని, పగటివేళ తనకు ఈ నిద్రమగత కలిగినందుకు తనను తానే నిందించుకొని కుదుటపడింది. ఆ ఎదురుసీటులో కూచున్న ఆడది ఆ మూల దూరంగా కూచోని కిటికీవైపు మొహం పెట్టుకొని కళ్ళుమూసుకొనివుంది.

మనస్సులో కలిగిన చిన్న ఆందోళన కుదురుపాటు చేసుకోడానికీ, తన పచ్చనోటు ఉందో లేదో అని చూసు కోడానికీ కమల hand bag తెరిచి చూచుకుంది. పౌడరు Compact పక్కనే అద్దం వెనుక తాను పెట్టిన కవరు ఉంది.... అయితే కవరు చిరిగిపోయివుంది. గుండెలలో గతుక్కుమంది....కంగారుగా వణకుతూన్న వ్రేళ్ళతో కవరు ఎత్తిచూచింది. ఉత్త కవరు....లోపల నూరు రూపాయలనోటులేదు. ఇంకా కంగారుగా ఆప్రక్కను, ఈప్రక్కను, Bag అంతటా వెతికింది. మధ్యనువున్న Zipతో బిగించివున్న పర్సులో ఉందేమోనని అదీ తెరిచి చూచింది. అక్కడాలేదు పచ్చనోటు. ఆమె జన్మదినపు బహుమతిపోయింది.

కమలకు కండ్లలో నీరు గిర్రునతిరిగింది; ఆమెగుండెలు వేగంగా కొట్టుకోనారంభించినవి. ఎలాగ?.... ఎందుకని?.... ఎక్కడ?.... ఒకవేళ— ఆ భయంకరమైన తలంపు ఆమెకు కలిగింది— ఆ ఎదురుసీటులో కూచోని, నోరు సగం తెరుచుకొని, కండ్లు మూతలుపడి, గాఢ నిద్రపోతూన్నట్లున్న ఆ ఆడది ఎవరు?

కమల తనస్థితిని చూసుకొని తానే భయపడిపోయింది. ఈరోజుల్లో రైలుబళ్ళల్లో ఇంకా ఇంతకంటే ఘోరమైన విషయాలు జరుగుతున్నాయి. మగపిల్లలు ఆడపిల్లల్లాగ వేషాలు వేసుకొని ఒంటరిగాపోతూన్న మగవాళ్ళను మోసగించి, దోచుకొనిపోవడం ఇలాంటివి ఎన్నెన్నో జరుగుతున్నాయి. తన కళ్ళముందే, ఎంతో మర్యాదగా ఉన్నట్టు పైకి అగపడుతూన్న ఆ స్త్రీ ఇంత బందిపోటు దొంగ అయిపోయిందా అని తనలో తాను అనుకుంది. ఆమె వైపు క్రీగంట చూచింది. ఆ స్త్రీ మళ్ళీ కళ్ళు మూసుకొని ఏదో పరిధ్యానం చూపించింది. సిగరెట్టు కాల్చి కాల్చి, అసహ్యంగా మరకలెక్కిపోయిన తన పొడుగాటి వ్రేళ్ళు పెదవులమీద పెట్టుకుంది. తన నల్లని పెద్ద చేతిసంచీ (Hand bag) మోకాళ్ళమీదనుంచి వ్రేలాడేట్టు ఒకచేత్తో పట్టుకుంది. అది రైలు ఊపులకు ఊగిసలాడుతూవుంది. మళ్ళీ ఆ ఆడది కమల వేపు ఒక వింత చూపుచూసి, నిర్లక్ష్యంగా "పొగత్రాగరాదు" అని రాసివున్న బండిలోనే సిగరెట్టు కాల్చడం మొదలెట్టింది.

ఈవింత నడతయే కమలకు ఈభావికార్యానికి మనస్సులో నిశ్చయం చేసుకోడానికి ఆధారమైంది.

"నేను నిద్రపోతూ ఉండగా ఈ ఆడదే నా నోటు అపహరించివుంటుంది మంచిది:—ఇప్పుడు కథ అడ్డం తిరుగుతుంది. కన్నగాని ఇంటికే దొంగలు పడతారు." అనుకుంటూ వణకుతూన్న చేతులతో — ఒకవేళ ఉన్నట్టుండి ఆ ఆడది మేలుకుంటే—ఒకవేళ బండి స్టేషను చేరుకొంటే—కమల నెమ్మదిగా ఆ ఆడదాని నల్లని, పెద్ద చేతిసంచికొక్కెం తొలగించింది. ఒకవేళ తనదే పొరబాటయితే— అయినా తప్పేముంది? నెమ్మదిగా.... అదుగో నెమ్మదిగా.... అదేమిటి? చురుకుగా కమల వేళ్ళు మాసిపోయిన Chiffon చేతి

రుమాలులో చుట్టపెట్టి, పౌడరు అద్దుకొనే కుంచెపక్కనే, పెళపెళలాడుతూన్న ఏదో వస్తువును తాకింది. చాలా జాగ్రత్తగా, నేర్పుతో—ఎన్నో ఏండ్లనుంచి ఈవృత్తి చేస్తున్నట్టు—కమల దానిని పైకి లాగింది. చూచిఉలిక్కిపడింది. అది వందరూపాయల నోటు; తన వంద రూపాయల నోటు.

ఇలా దొంగిలించడానికి ఆ ఆడదానికి ఎంత ధైర్యం? ఎంతో సంతోషంతో గడుపుకొందామనుకున్న రోజును ఇలాగ నాశనం చెయ్యడానికి సమకట్టిందే ?

కమల ఆనోటును భద్రంగా తన చేతిసంచిలో Zipతో బంధించిన పర్సులో పెట్టి బిగించి, కొట్టుకుంటూన్న గుండెలతో కళ్ళుమూసుకొని తనసీటులో పదిలంగా కూర్చుంది. రైలుపక్కన దృశ్యాలు చూడటానికి ఆమెకు మనస్సుపోలేదు. పోనీ, ఆ ఆడదాన్ని నలుగురిలోకి యీడ్చి బుద్ధి చెప్పవచ్చునా అంటే, అది సాధ్యంకాని పని కాదు. ఏమీ ఎరగనట్టు నోరుమూసుకొని కూచోడమే మంచిది. ఆ ఆడది నీచత్వానికి పాల్పడి ఈవిధంగా దొంగిలించిందే, అన్న కోపం ఊరికే పొంగివస్తూంది. ఇదే నాకు ఈలోకంలో ఆఖరినోటు అయివుంటే—దీంతో నేను తిండికి మొహంవాచే స్థితిలోవుంటే—ఇది ఎంతకాలంనుంచో కడుపుకట్టుకొనికూడ బెట్టిన సొమ్ము అయివుంటేకూడా ఈ ఆడది ఇలాగే చేసేదికదా.

ఇంతలో స్టేషను రావడంతోనే కమల మనస్సులోని ఈ తలంపులకు భంగం కలిగింది. తలుపులు తీయడం, మూయడం, కూలీలకేకలు, మామూలుగానే గందరగోళం కలిగించినవి. ఎదురుసీటులో కూచున్న ఆడది వెంటనేలేచి, కంగారుగా తలుపుతెరుచుకొని బయటకు దూకింది. ఒకే పరుగున వెళ్ళిపోయింది.

కమల, అలాగే నోరుమూసుకొని కూచుంది. "అది మంచిదే అయింది. ఇద్దరూ, ఒకే స్టేషనులో దిగటం వస్తే, టిక్కెట్టుకోసం చేతిసంచి ఇద్దరూ ఒకేచోట తెరిస్తే, తను దొంగిలించిన నోటు లేకపోయినందుకు ఆ ఆడదీ నామీద నేరంమోపి ఉండేదేమో.

టౌనుకు చేరినతరవాతకూడా ఈవిచిత్ర సంఘటనవల్ల కమల హృదయం కొట్టుకుంటూనే ఉంది. ఎవరితోనైనా చెప్పుకొందామంటేకూడా ఎవరూలేరు. సాయంత్రం వరకూ తనలోనే దాచిపెట్టుకోవాలె. కొందరికిమల్లే, దారే పోయేవాళ్ళతోనూ, కూరలమ్మడానికి వచ్చేవాళ్ళతోనూ సోదిపెట్టుకోడానికి కమలకు యిష్టంలేదు. భగవంతుడు తనను ఈవిధంగా కాపాడినందుకు కృతజ్ఞతవహించి, ఆ ఉద్వేగాన్ని తొలగించుకోడానికి, ఒక కప్పు కాఫీ త్రాగడానికి, ఒక Cafe లోకి పోయింది.

మిగిలిన దినం అంతా కులాసాగానే గడిచిపోయింది. కావలసిన సరుకులన్నీ కొనుక్కుంది. ముఖం మేకప్ చేయించుకుంది. తలకు నొక్కులన్నీ సరిగావచ్చేట్టు దువ్వించుకుంది. చేతులగోళ్ళు కత్తిరింపించుకోడం రంగు వేయించుకోడం వగైరా అంతా చేసుకుంది. తనుకోరిన దుస్తులు ధరించుకొని ముస్తాబై ఇంటిముఖం పట్టింది.

మళ్ళీ రైలులో ఎక్కినప్పుడే తనకు ఆ ప్రొద్దుటి సంఘటన జ్ఞప్తికి వచ్చింది. ఇంటికి చేరింది. ఈసంగతంతా జగన్నాధరావుకు చెప్పేవరకూ ఓపిక చాలటంలేదు. మేడపైకిపోయింది. కొని తెచ్చిన సరుకులన్నీ అక్కడ పెట్టేసింది. నిలువుటద్దంలో తనను చూసుకొని తనలో తాను మెచ్చుకుంది. కిందికి వచ్చి వంటమొదలుపెట్టింది. బంగాళాదుంపల వేపుడుకూర, ఉల్లిపాయల పులుసు చేసి అప్పడాలు వేచింది. భోజనానంతరం అల్పాహారానికి ఐస్‌క్రీమ్, ఫ్రూట్ సెలాడ్ తయారుగా పెట్టింది.

ఇంతలో జగన్నాధరావు వచ్చి తలుపు తాళంలో తాళం చేయితిప్పిన శబ్దం వినిపించింది. తిన్నగా పంపుదగ్గరకు పోయి చేతులు మొహం కడుక్కొని, మామూలుప్రకారం డైనింగు రూములో టేబిలు, కుర్చీలు సర్దుతూన్నాడు. కమల భోజన సామగ్రి అంతా "ట్రాలీ"మీద అమర్చి డైనింగు రూములోకి నెట్టుకుంటూ వస్తూ "ఏమండీ ఎలాగున్నాను? ఇవేళ ఏమన్నా తేడాగా కనపడుతున్నానా?" అని అడిగింది.

జగన్నాధరావు ఆమెవంక తేరిపార చూస్తూ, "Oh yes. చాలా బాగున్నావు. అయితే ఆ తల దువ్వటంలో కొంచెం నొక్కులు మరీ అంతలోతుగా లేకపోతే, ఇంకా బాగుండును. అదిసరేకాని, నాకిదేమీ అర్థంకావడంలేదు." అంటూ తన చేతివేళ్ళసందున ఏదో పెళపెళలాడిస్తూ, "డబ్బు చేతిలో ఏమీ తీసుకుపోకుండా, ఇదంతా ఎలాగ సమర్థించుకొని వచ్చావో, నాకు అర్థంకావడంలేదు. ఇదిగో, టేబిలుక్రింద పడివున్న పొద్దుటి వందరూపాయల నోటు ఇప్పుడే ఎత్తాను."

సంక్షేమం



"సంఘసంక్షేమ కార్యక్రమం విజయవంతమైనదే మనరాష్ట్రాభివృద్ధి ఆధారపడి వుంది"
మద్రాసు, ఆంధ్ర, మైసూర్, తిరువాన్కూర్ కొచ్చిన్, కూర్గ్, ప్రాంతాల రాష్ట్ర సంక్షేమ
సంఘాధ్యక్షుల సంవాదముల సభాధ్యక్షత వహించిన శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్

"ఇప్పుడేంచేస్తున్నావు విజయా ?"

"సంఘసేవ !"

పేపర్లమ్మే విజయ

చూడడానికి గంభీరమైన విగ్రహం కలవాడు విజయ. ఎప్పుడూ సంతోషంగా నవ్వుతూ, చిలిపిగా వుండేవాడు. తోటి విద్యార్థులనీ యితరులనీ అస్తమానూ వేళాకోళాలు చేస్తుండేవాడు. అయినా అతనంటే నాకెంతో యిష్టం. మేం చాలా దగ్గరి స్నేహితులంగా కూడా వున్నాం. నాకు అప్పుడు పన్నెండేళ్ళు. విజయ నాకంటె ఆర్నెల్లు చిన్న. అప్పుడే, హఠాత్తుగా విజయ తండ్రి కలరావ్యాధికి గురిఅయ్యాడు. విజయ తనతల్లితో కలిసి మేనమామ వూరికి వెళ్ళిపోయాడు. అతనితో నేను ఏడ్వడం తప్ప వేరేమీ చేయలేకపోయాను. వయస్సుకు మించిన విషాదభావాలు ముఖాన క్రమ్ముకొని వుండగా అతను వెళ్ళిపోయాడు.

ఆతరువాత చాలా కాలం వరకూ నేను అతన్ని కలుసుకోలేదు.

నేను ఎం. ఏ. సాంఘిక సేవలో ఉత్తీర్ణుడనై ఒకనాడు ఉద్యోగపు ఇంటర్వ్యూ కోసం వెడుతున్నాను. నా చిన్నపెట్టెతోటీ బెడ్డింగుతోటీ స్టేషను వదలి బయటికి వచ్చాను. పొద్దుట తొమ్మిది గంటలవేళ. దగ్గరలో వున్న 'అఖబర్ వాలా' ని పిలిచాను. నా చేతికి హిందుస్తాన్ టైమ్సు' అందించిన వ్యక్తి బలిష్ఠంగా వున్నాడు. అతని ముఖంమీద వింత భావం తాండవిస్తున్నది. మెరుపు తీగలా ఒక ఆలోచన నా మనోఫలకంపై మెరిసింది. ఇతడే విజయ. తక్షణమే అతని గడచిన జీవితాన్ని గురించి ప్రశ్నలు కురిపించాను. ఇన్ని సంవత్సరాలు అతని జీవితం ఎలా గడిచిందో అని ఆలోచించాను అతనిస్థితికి రావడానికి కారణం అతని తల్లి సరిగా చదివించలేకపోయి వుంటుందని వూహించుకొన్నాను.

"ఇప్పుడేం చేస్తున్నావు విజయా ?''అడిగాను అతనిచ్చిన సమాధానం నన్ను స్తబ్దుణ్ణి చేసింది. "సంఘసేవ" అన్నాడు. నేను నవ్వేసి అసలు నిజం చెప్పమన్నాను. అతను చెప్పాడు "పేద విద్యార్థుల నిధి"ని ప్రారంభించి చదువుకొనేందుకు ఆర్థిక స్తోమతు లేని విద్యార్థులకి ధనసహాయం చేస్తున్నానని. వుండబట్టక నేను అడిగాను. "మరి నీ చదువు సంగతి.?"

"నా ఎం.ఏ. పూర్తి చేశాను" అని ప్రశాంతంగా సమాధానం చెప్పాడు, విజయ

నేనతని మాటలు నమ్మలేకపోయాను. 'అదికూడా ప్రథమశ్రేణిలో'అంటూ సగర్వంగా చెప్పాడు విజయ. "మాకో న్యూసుపేపరు ఏజెన్సీ, ఒక కోఅపరేటివ్ స్టోర్సూ వున్నాయి. వాటివల్ల వచ్చే ఆదాయం ఆ నిధికి వెడుతుంది. ప్రస్తుతానికి మేం ఐదుగురు విద్యార్థులకి సహాయం చేయగల్గుతున్నాం.

అది విన్నాక నాలో తెలియని చైతన్యమేదో ప్రవేశించింది. అయినా వెళ్ళవలసిన తొందర. "అవును నువ్వే సంఘసేవకుడివి" అని ఉత్సాహంతో అంటూ బయలుదేరిపోయాను. మళ్ళీ అతన్ని చూశాను. ఆ పాతకాలపు చిరునవ్వు ముఖంతో చేతిమీద పేపర్ల దొంతరతో...నేటాంగాలో వెళ్ళిపోతూంటే... అలా నాకేసి చూస్తూన్న విజయని నేను చూశాను. ★

రచన: సుందర్‌లాల్.

తర్జుమా: కె. రామలక్ష్మి.

దేశంలో నెలకొనియున్న స్వచ్ఛంద సేవాసంస్థలకు ఆర్థిక సహాయముచేయుటకు మాత్రమే యీ కేంద్ర సంఘసంక్షేమ సంస్థ నెలకొల్పబడిందని వూహించుట పొరబాటు. సంఘసౌభాగ్యానికి పునాదియైన నిర్మాణ కార్యక్రమమును దేశమంతటా నిర్వహించుటే యీసంస్థయొక్క ముఖ్యోద్దేశం. జనవరిలో మద్రాసులో సమావేశమైన ప్రాంతీయ సంఘసంక్షేమ కార్యకర్తల సభకధ్యక్షత వహించిన శ్రీమతిదుర్గాబాయిదేశ్‌ముఖ్ గారుయీవిషయమునేపునరుద్ఘాటించారు.

సేవాకార్యక్రమంలో నూతనాధ్యాయం

శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్‌గారి
అధ్యక్షోపన్యాసంలోని ముఖ్యాంశాలు

సేవాసంస్థలకు ధనసహాయం

స్వచ్ఛంద సేవా సంస్థలకు సాంకేతిక ఆర్థిక సహాయము చేయుట కేంద్ర సంక్షేమ సంస్థ నిర్వర్తించే విధులలో ముఖ్యమైనదయినా, తన లక్ష్య సాధనలో ఇది ఒక భాగము మాత్రమే! ఇంత మాత్రమున ఇది కేవలము అన్ని సంస్థలకూ డబ్బు పంచిపెట్టే ఏజన్సీ అనే అపోహ పడకూడదు. తొలి పంచవర్ష ప్రణాళికలో దేశములోని 4000 స్వచ్ఛంద సంక్షేమ సంస్థలకు సహాయార్థము 81 లక్షల రూపాయలు కేటాయించబడినది. ఈ మొత్తములో ఇప్పటివరకూ దాదాపు 32 లక్షల రూపాయలు 1000 స్వచ్ఛంద సంస్థలకు మంజూరు చేయబడినది.

గ్రామసీమలో సంక్షేమ కార్యక్రమం

ఇంతవరకూ ఈ సంక్షేమ సంస్థలు నెలకొల్పబడని ప్రాంతములలో వాటిని ప్రారంభించుటకు కేంద్ర సంస్థ అనేక విధములుగా తోడ్పడుచున్నది. నేడు గ్రామీణ ప్రాంతములలో కేంద్ర సంస్థచే నిర్వహింపబడుచున్న 155 సంక్షేమ విస్తరణ ప్రణాళిక ప్రాంతాలలో స్త్రీల పిల్లల సంక్షేమానికై దాదాపు 750 సంక్షేమ కేంద్రాలు పనిచేయుచున్నవి. ఈ కేంద్రాలు 30 వేల గ్రామములలో దాదాపు 30 లక్షల ప్రజలకు పైగా సేవచేయుచున్నవి. ఈ కేంద్రముల ద్వారా దాదాపు 1500 మందికి ఉద్యోగములు లభించినవి. ఇప్పుడు వీటికి సహాయార్థము కేటాయింపబడిన 81 లక్షల రూపాయలే కాక, సంక్షేమ విస్తరణ ప్రణాళిక ఆధ్వర్యమున నడుపబడే క్రొత్త సంస్థలకు ఇంకొక కోటీ యాభై లక్షల రూపాయలు కేటాయింపబడినవి. గ్రామీణ ప్రాంతములలోనే ముఖ్యముగా ఇవి నిర్మింపబడటం గమనార్హమైన విషయం.

మధ్యతరగతి కుటుంబాలశ్రేయస్సు

ఇంతేకాకుండా పట్టణ ప్రాంతాలలోని క్రింది మధ్య తరగతి కుటుంబాల సంక్షేమానికి ఒక సహాయ ప్రణాళిక సిద్ధము చేయబడినది. దీని ద్వారా వికేంద్రీ కరణ సిద్ధాంతముపై నెలకొల్పబడే చిన్న పరిశ్రమల ద్వారా ఈతరగతి కుటుంబములలోని స్త్రీలకు పని లభించి తద్వారా వారి రాబడి వృద్ధి కాగలదు.

కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖామంత్రి సహకారముద్వారా ఢిల్లీలో ఒక అగ్గి పెట్టెల

సేవాకార్యక్రమంలో నూతనాధ్యాయం

కర్మాగారము స్థాపింపబడినది. కేంద్ర సంక్షేమ సంస్థచే నిర్వహింపబడు "ప్రజా సహకార సంస్థ" ఈ అగ్గిపెట్టెల కర్మాగారమును నిర్వహింపగలదు. దీనికి సంబంధించిన సాంఘిక ఆర్థిక సమస్యలను మాత్రమే కాక దీనిలో పని చేయు స్త్రీల, పిల్లల సంక్షేమ బాధ్యత కూడ కేంద్ర సంక్షేమ సంస్థయే వహింప గలదు. ఢిల్లీలో ఇది జయప్రదముగా నిర్వహింపబడుట యేకాక, ఇట్టి ప్రణాళికలు 15 రాష్ట్రములలో నెలకొల్పబడుటకు సన్నాహములు జరుగుచున్నవి.

ప్రభుత్వ సంస్థలుగాని, ప్రభుత్వేతర సంస్థలుగాని నిర్వహించే పనులే అదనముగా ఈ కేంద్ర సంక్షేమ సంస్థ ద్వారా జరుగుచున్నవనుట భావ్యముకాదు. పట్టణ ప్రాంతాలలో ప్రజావసరాలను తీర్చే ఏ సంస్థకు కాని ఇది పోటీగా నెలకొల్పబడలేదు; ప్రభుత్వ తదితర సంస్థలు నిర్వహిస్తూన్న పనులనీ, అవి ప్రజావసరాలను ఎంతవరకూ తీర్చగలుగుతూన్నవనే విషయాన్ని సాకల్యంగా చర్చించి, ఆయా రంగములకందని ప్రజావసరములను తీర్చుటకే ముఖ్యముగా ఈ సంస్థ కృషి సల్పుచున్నది. అందువల్లనే కమ్యూనిటీ ప్రాజక్టులకూ జాతీయ విస్తరణ ప్రణాళిక ప్రాంతములకూ అతీతముగానే ఈ సంస్థ గ్రామీణ ప్రాంతములలో పని చేస్తూ వుంది.

సంక్షేమ కార్య క్రమాలకు సంబంధించిన వివిధ మంత్రిత్వ శాఖల సహకారముతో భారత ప్రభుత్వ స్థాయిలో ప్రారంభించి ఈ సంస్థ వివిధ స్వచ్ఛంద సంస్థలనుంచి ధనసహాయమునకై వచ్చిన దరఖాస్తులను సమిష్టిగా పరీక్షించి, ఒకే సంస్థ ఒక కార్యము కొరకు ఒకే పర్యాయము వివిధ ప్రభుత్వ శాఖలనుండి ధన సహాయము పొరపాటున రెండు పర్యాయములు పొందకుండా; న్యాయముగా ఈ సంస్థ ద్వారానే ధన సహాయము చేయుచు ధనము పొదుపు చేయుచున్నది.

సుశిక్షితులైన కార్యనిర్వాహకులు

ఈ విధముగా కేంద్ర సంక్షేమ నిధినుండి సహాయము పొందిన స్వచ్ఛంద సంస్థల ప్రమాణము (Sfandard)ను గూర్చి కొందరు ప్రశ్నిస్తున్నారు: కేంద్ర నిధి నుండి సహాయము పొందిన ప్రతి సంస్థలోనూ శిక్షితులైనవారు పని చేయవలెననీ ఒకవేళ ఆ విధముగా శిక్షితులైనవారు దొరకని పక్షములో సహాయము పొందిన మొత్తములో కొంత భాగం సుశిక్షితులైన అభ్యర్థులను నియమించుటకై వ్యయము చేయవలెనని నిబంధనగలదు. వాస్తవముగా వివిధ సాంఘిక రంగములలో పనిచేయుటకై సంఘసేవకులుగా శిక్షణ పొందుటకు అయ్యే ఖర్చులో కొంతభాగము సహాయరూపకముగా ఇచ్చుటకు కేంద్ర సంస్థ నిర్ణయించినది. దీనికయ్యే ఖర్చు, తదితర వివరములను తెలియజేయవలసినదిగా రాష్ట్రసంక్షేమ సంస్థలను కేంద్ర సంస్థ అపేక్షించినదని చెప్పారు. ఇంత వరకూ కేంద్రమునుండి సహాయము పొందిన సంస్థలు రిజిస్టరుకాని పక్షంలో తక్షణమే రిజిస్టరు కావలసినదిగా ఆదేశించడమైనది.

కార్యక్రమపరివేక్షణ


ఈవిధంగా ధనసహాయం చేసేముందు ఆయా సంస్థలు స్థాపింపబడి ఎంతకాలమైనదీ, వాటి ఆర్థికస్తోమత, ఆర్థిక సహాయము పొందిన తరువాత, తలపెట్ట బడ్డిన ప్రణాళికలను పూర్తిచేయుటకు ఆ సంస్థలో స్వచ్ఛందముగా పని చేయుటకు ఎంతమంది లభించ గలరు అనే ప్రశ్నలు పూర్తిగా చర్చించి, సంతృప్తి చెందిన

సేవాకార్యక్రమంలో నూతనాధ్యాయం

మొదటనే కేంద్రసంస్థ ధనసహాయము చేయగలదు. మొట్టమొదట నిపుణులైన సంఘసేవకులు ఆయాస్వచ్ఛంద సంస్థలను దర్శించి, వాటి అవసరములను తెలుసుకుని ధనసహాయమునకు కేంద్రసంస్థకు సిఫారసు చేసెడివారు. ఇప్పుడు వీటిస్థానే రాష్ట్రసాంఘిక సంక్షేమ సలహా సంఘాలు స్థాపింప బడినవి. వీటిలో ఆయా ప్రాంతముల సంక్షేమ కార్యకర్తలూ, సంఘసేవకులు సభ్యులుగ వుంటారు. వీరు ధనసహాయమునకు దరఖాస్తు చేసిన ఆయా సంస్థలను దర్శించి, తమ అభిప్రాయములను కేంద్రసంఘసంక్షేమసంస్థకు తెలియ జేస్తారు.

నూతనప్రణాళిక

ఈ పదిహేను మాసముల అనుభవము ద్వారా కేంద్రసంక్షేమ సంస్థ ఇంతవరకూ పని చేయుచున్న సంక్షేమ సంఘాలద్వారా పరిష్కారముకాని ప్రజావసరములు కొన్ని కలవని తెలిసి కొన్నది. అందుచేతనే ఆయాసంస్థల నెలకొల్పుటకు, ధనసహాయము చేయుటకు కేంద్రసంస్థ నిశ్చయించినది. - పనిచేసే తల్లుల పిల్లలకై బాలమందిరాలు, ముసలులకీ, దుర్బలులకీ ఆవాసాలు, శిక్షణ పొందే వారికి వసతి గృహాలు, బాలనేరస్థులనీ, ఖైదీలకీ, సాంఘికంగా, శారీరకంగా వెనుకబడ్డవారి రక్షణార్థం పునరావాస శిబిరాలూ - ఇవి ఈ పథకంక్రింద వచ్చేవాటిలో కొన్ని - ఈ పని ప్రారంభించే ముందు ప్రస్తుత పరిస్థితులను సాకల్యంగా పర్యవేక్షించ వలసివుంది. అందుచేతనే ఈ పునరావాస కార్యక్రమాలు ప్రారంభించడానికి సూచనలు చేయవలసిందిగా ఒక సుశిక్షిత సంఘాన్ని కేంద్రసంక్షేమ సంస్థ నియమించింది. అదే విధముగా నేటి నంఘములో వుండే దురాచారాలనీ, వ్యభిచార జాడ్యమునూ నిర్మూలన చేయడానికి వారి పరిస్థితులను గురించి వివరముగా తెలియపరచవలసిందిగా శ్రీమతి ధనవంతీ రామారావు అధ్యక్షతను ఒక కమిటీ ఏర్పాటు చేయబడింది. ఈ కమిటీ సూచనలు ఈ సంవత్సర మధ్యలోగా లభించ గలవు. దీనివలన ఈ ప్రణాళిక గడువులోగా ఈ సూచనలలో ముఖ్యమైనవాటిని అమలు పరచుటకు గడువు లభించగలదు.



శిశు విహార్

ప్రారంభోత్సవం

కేంద్ర సంక్షేమ సంఘము వారిచే ఇటీవల ఆదేశింపబడిన నూతన సంక్షేమ ప్రణాళికను అనుసరించి చెన్నపట్నములో "శిశు విహార సమితి" అను పేర ఒక సంస్థ యిటీవలనే రిజిస్టరు చేయబడినది. ఈ సమితియొక్క ఆదర్శము ముఖ్యముగా మిల్లులలోను, కార్పొరేషను లోను, ఇతర సంస్థలలోను పనిచేసుకొని జీవించే తల్లుల యొక్క చిన్నారి బాలల సంక్షేమ కేంద్రములను మదరాసులో స్థాపించి, పిల్లలకు విజ్ఞాన - వినోద సదుపాయములు కల్పించుట. ఇట్టి కేంద్రమును ప్రప్రథమం మదరాసులో ఆంజనేయనగర్‌లో జనవరి 14 వ తేదీని (సంక్రాంతి రోజున) మదరాసు కార్పొరేషను మేయరు శ్రీ ఎం. ఏ. చిదంబరం చెట్టియారుగారిచే ఆరంభింపబడినది.

ఆరోజు మధ్యాహ్నం సరిగా 3 గంటలకు భారతదేశ ఆర్థిక మంత్రి శ్రీ చింతామణి దేశ్‌ముఖ్‌గారు, కేంద్ర సంక్షేమ సంఘాధ్యక్షురాలు శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ గారు, తదితర ప్రముఖులు ఆంజనేయనగర్‌కు వచ్చిరి.

వచ్చిన ప్రముఖులకు సమితి అధ్యక్షురాలు శ్రీమతి న్యాపతి కామేశ్వరమ్మగారు ఆహ్వానించి శిశు విహార కేంద్రమును జూపిరి. శ్రీ దేశ్‌ముఖ్ దంపతుల సమక్షాన శ్రీ చిదంబరం చెట్టియారుగారు కేంద్ర ప్రారంభ సూచకముగా జ్యోతినివెలిగించిరి. పిమ్మట ప్రక్కనేవున్న కార్పొరేషను బడి ఆవరణలో ఏర్పరుచబడిన సభావేదికనుండి సభాసదులకు శ్రీమతి కామేశ్వరమ్మగారు స్వాగతం చెప్పారు.

ఈ పట్టణములో అనేక వేల స్త్రీలు వృత్తి పనులు, కూలి పనులు చేసుకొనుచు జీవనోపాధి గడుపుచున్నారు. అట్టి స్త్రీలు ఉదయముననే పనులకు పోవునప్పుడు. తమ శిశువులను తమ వెంట తీసుకొన వీలుపడదుకదా! అట్టి బిడ్డలను ఇంట్లో వదిలి వెళ్ళు సమయములో ఆ బిడ్డలకు దక్షతలేని కుటుంబములు ఎన్నో గలవు. అట్టి చిన్నారి బాల బాలికలను చేరదీసి వారికి క్రీడా వినోదములు కల్పించి శుభ్రమైన వాతావరణములో ఆటపాటలను నేర్పి తిరిగి సాయంత్రము తలిదండ్రులకు అప్పగించు కేంద్రములు మనదేశములో చాల అరుదు. ఆ కొరతను తీర్చుటకే మదరాసులో ఆంధ్ర మహిళాసభ, ఆంధ్ర బాలానంద సంఘము, చిల్డ్రన్ గార్డెన్ స్కూలు సంస్థలను కొందరు ప్రముఖులు కలిసి "శిశు విహారసమితి" అనుపేర ఈ క్రొత్త సంస్థను నెలకొల్పాము. మేము ఈ సంస్థను ప్రారంభించుటకు ప్రోత్సాహము కేంద్ర సంక్షేమ సంఘమువారు నూతనముగా ఆదేశించిన ప్రణాళికే కారణము.

ఈ ఆంజనేయనగర్‌లో ఇప్పుడు ప్రారంభించినది మా మొదటి కేంద్రము. ఈ కేంద్రమునకు ప్రస్తుతం ఎంతో కష్టముపై ఒక అద్దె గృహమును సంపాదించ గలిగితిమి. ప్రస్తుతం ఈ చిన్న యింట్లో 12 గురు పిల్లలకు మాత్రమే సంక్షేమ వసతి కలుగజేస్తున్నాం. తగిన వసతులు వున్నచో ఈ ప్రాంతములో కనీసం 100 గురు పిల్లలకు అవకాశమున్నది. మేము ఇంత తక్కువ సంఖ్యతో ఎందుకు ప్రారంభించామంటే, ఇక్కడే కార్పొరేషనువారి ఖాళీ స్థలము ఎదురుగావున్నది. ఆ స్థలమును మా కేంద్రము నకు కార్పొరేషనువారు బహూకరించినచో ఇక్కడ ఒక గొప్ప శిశు సంక్షేమ కేంద్రమును ఏర్పాటుచేయవచ్చును. కార్పొరేషనువారు సహజముగ చేయవలసిన పనిని సంఘ సంక్షేమ సేవకులము మేము పూనుకొని చేస్తున్నమాట గ్రహించి కార్పొరేషనువారు ఈ స్థలమును మాకిచ్చెదరని నమ్ముచున్నాము.

మేము ఈ కేంద్రమును సున్న ఆస్తితో ప్రారంభించాము. అడిగిన వెంటనే ఈ దిగువ నుదహరించిన వారు వస్తు రూపంగాను, ధన రూపంగాను ఈ విరాళములను ఇచ్చారు.

శ్రీమతి లక్ష్మి రఘురాంగారు మూడు మాసములకు పిల్లలకు అల్పాహారము, శ్రీమతి లక్ష్మిపార్వతిగారు రు 100 లు, సి. ధనలక్ష్మిగారు బాయిలరు, బక్కెట్లు. శ్రీ యస్.జి. చెట్టిదంపతులు గంగాళం, శ్రీమతి లీలమ్మగారు ఒక పాత్ర, శ్రీమతి శివలెంక కామాక్షమ్మగారు వలయు పాత్రలకై రూ 25/-

ఇంకొక గొప్ప సంతోష కరమైన విషయం ఏమిటంటే ఈ సంక్రాంతి దినము మన ఆర్థిక మంత్రి చింతామణి దేశ్‌ముఖ్‌గారి పుట్టినరోజు. ఈ శుభదినమున శ్రీ దేశ్‌ముఖ్‌గారు ఈ శిశు విహారసమితి బాలలకు క్రొత్త దుస్తులను బహూకరించారు.

ఇటు కార్పొరేషనువారు, అటుమదరాసు ప్రభుత్వము, కేంద్ర ప్రభుత్వమువారు సహకరిస్తే మేము ఇంకా ఎక్కువమంది పిల్లలకు సంక్షేమ వసతులు కలుగజేయ గలము."


శ్రీ దేశ్‌ముఖ్ గారి ప్రసంగం.

శ్రీ దేశ్‌ముఖ్‌గారు "శిశు విహార సమితి" యొక్క కృషిని కొనియాడుతూ ఇలా అన్నారు: "దేశంలో ఫ్యాక్టరీలలో పనిచేసే స్త్రీల బిడ్డలకు సంక్షేమ వసతులు ఏర్పరచాలని నిబంధనవుంది. కాని ఇప్పుడు అనేక స్త్రీలు అనేక ఇతర సంస్థలలోను, ఆఫీసులలోను, ఇండ్లలోను పనులు చేస్తున్నారు. అట్టివారి బిడ్డలకు యీ సంక్షేమ వసతులు కలుగజేసే పనిని పూనుకొనుట కార్పొరేషనులు, మునిసిపాలిటీలదై యుంది. అయితే కార్పొరేషను వారికి ఈ ఒక్కపనే కాకుండా ఎన్నో బాధ్యతలున్నవి. వారికి తగినంత ధనముకూడా వుండక పోవచ్చును. అలాగునే రాష్ట్ర ప్రభుత్వమువారు, కేంద్ర ప్రభుత్వము వారు, ఎన్నో ఇంకా ఇతర బాధ్యతలు గలవారగుచున్నారు. అంచేత ఈ సంక్షేమ కార్యక్రమాలన్నీ మీవంటి సంఘసేవకులు పూనుకొనవలసివస్తోంది.

"మీ సమితిలో ఉదారతగల సభ్యులుచేరి సహాయము చేయుచున్నందులకు నాకు చాల సంతోషము. మీ ప్రయత్నములు జయప్రదముగా కొనసాగుటకు కేంద్రముకూడా ఏదో విధాన సహాయం చేయగలదని నమ్ముతున్నాను."

మేయరు శ్రీ చిదంబరం చెట్టియారుగారు మాట్లాడుతూ మదరాసు కార్పొరేషనువారు, మదరాసులో అనేక బడులు స్థాపించుటలో ఎక్కువ ధనమును వినియోగించుచున్నారనియు, ఇట్టి కేంద్రములు సంక్షేమ సంస్థలు పూనుకోడం చాలా సమంజసమనిన్నీ, ఈ శిశు విహారసమితికి ఇంకా ఎక్కువ మంది పిల్లలను చేర్చుకొనుటకు కావలసిన అవకాశాలు కల్పించుటలో కార్పొరేషను తోడ్పడగలదని సూచించారు.

శిశు విహారసమితి కార్యదర్శి శ్రీ రామ్మూలుగారి వందన సమర్పణముతో సభ ముగిసెను.



శిశు విహార్ ప్రాంగణమున దేశ్‌ముఖ్ దంపతులు.

SISU VIHAR SAMITHI, MADRAS.


: Objects :

a) To provide recreational and educational facilities for children of working mothers in slums or neglected areas of Madras and suburbs.
b) To start homes for looking after such children when their mothers go out for work.
c) To collect funds by donations, subscriptions and other methods, and also to acquire Properties movable and immovable for the purpose of the furtherance of the aforesaid objects, and
d) To do all such things as are incidental or conducive to the attainment of the above objects.

The activities of the Society for the above objects are generally defined as follows:

In view of the increasing number of women taking to gainful employment it has been found necessary to provide Creches wherein children of working mothers could be taken care of during the working hours. Hitherto, it is only in the factories that makes it compulsory to have Creches. There is at present no provision either voluntary or of legal obligation to provide creches for the children of Women employed in other workplaces. It is with a view to meet this need that this Samithi is formed to make efforts to provide Creches facilities for children of working mothers in localities where such facilities do not exist at present. The Samithi may also undertake to provide education through recreation and play to such children and also supplement it with a modicum of nutrition, medical and health services.

It is noticed in Madras and suburbs a large number of waifs and strays i. e., young boys and girls wander around the public places doing ostensibly nothing. They are a source of potential mischief and are themselves likely to be exploited for beggary, crime and immoral purposes. Some of these do have their parents and homes, but lack schooling and proper educational influence at home. As these children are deprived of any kind of educational infulence, the Homes as proposed in the foregoing paragraph will provide facilities not only for healthy and disciplined living but also for training in a craft or trade which can later on help them to earn their living.



మన పూర్వీకులు కోతులా!

శ్రీ కె. తా. బా. జయంతీదేవి B.Sc., (Hons.)

మానవుడు జంతు జాతిలోకెల్ల మిక్కిలి యున్నత స్థాయి నందుకొనినాడని లోగడ తెలిసికొంటిమి. ఈ మానవుడు కోతులనుండి పుట్టినాడని ఛార్లెసు డార్విను అను గొప్ప శాస్త్రవేత్త చెప్పిరి. ఈ సిద్ధాంతమునకే డార్విన్ సిద్ధాంతము అనుపేరు వచ్చినది. కాని మరికొందరు శాస్త్రకారులు మనకు కోతులకు మధ్య వేరొక జాతి యున్నదనియు అది కోతి—మనిషి దశ అని చెప్పుదురు. ఇంకనూ మరికొందరు అసలు మనకు వానరజాతికి యే మాత్రము సంబంధము లేదని నొక్కి వక్కాణించుదురు.

మనము చిన్న చిన్న జంతువులనుండియే పుట్టినామని నిరూపించుటకు కొన్ని తార్కాణములు కలవు. ఉదా. $\frac{1}{3}$ అంగుళము పొడవుగానున్న పిండమునకు 1/18 అంగుళము పొడవుగల తోకయున్నది కాలక్రమేణా ఈ తోక ముడుచుకొని పోవును. కాని ఈ తోకను ఆడించు కండరములు మన శరీరములో నామకార్థముగా ఇంకనువున్నవి. చెట్లమీద నివసించునప్పుడును. నాల్గుకాళ్ళమీద నడచు దశలోను తోకయొక్క ఆవశ్యకత యుండెను. కాని రెండు కాళ్ళతో నడచుట అలవర్చుకొనిన పిమ్మట మానవునకు తోకతో అవసరము లేకపోయెను.

లనూగో (పుట్టుటకు పూర్వము బిడ్డల వీపుమీద నుండు రోమములు) వీపుమీద యెక్కువగా నున్నవి. ఇట్టి రోమములే కుక్కలు కోతులు మున్నగు జంతువులమీద కూడా నున్నవి. కుక్కలు మున్నగు వాని వెంట్రుకలు అవి అపాయము పసికట్టిన వెంటనే లేచి నిలబడును. అట్లే మనకు కూడ యుద్రేకము కల్గినను, మిక్కిలి చలిగానున్నను ఈ రోమములన్నియు నిటారుగా నిలబడును.

కొన్ని గుఱ్ఱములు, ఆవులు మున్నగు జంతువులు తమను కీటకములు చీకాకు పరచినపుడు చెవులను కదల్చును. ఇట్లే కొంతమంది మానవులు కూడ తమ చెవులను కొలదిగా కదల్చగలరు. మనకు చేతులుండుటచే కీటకములను తోలుకొన గలుగుచున్నాము. కాని ఈ జంతువులకు చేతులు లేకపోవుటవలన తోక నాడించియు చెవులను కదలించియు కీటకముల బారినుండి తప్పించుకొనుచున్నవి. మనకు చెవులను కదలించు అవసరము లేదు కనుక ఈ చెవులను కదలింపచేయు కండరములు పేరుకు మాత్రమే యున్నవి. వీని వలననే కొందరు మానవులు చెవులను కదల్చగలరు.

కప్ప, మొదలగు వానికి మూడవ కనురెప్ప కలదు. మానవుని కంటిలోకూడ దీనికి సరిపోల్చగల ఒక చర్మపు పొరయున్నది.

ఈ విధముగా పోల్చి చూచినచో మనకు మన పూర్వీకులకు అనేక సంబంధములు కనుపించుచున్నవి. ఈ

మన పూర్వీకులు కోతులా !

జంతువులన్నిటిలో కోతులకు మనకు చాల సన్నిహిత సామీప్యమున్నదని ఛార్లెసుడార్విను వాదము. జంతువులన్నిటిలో మనకును, కోతులకును చేతి బొటనవ్రేలు చాల వుపయోగపడును. అది లేనిదే మనము ఏ పని చేయజాలము. అట్లే కోతులకు చెట్లమీద నివసించుటకు కొమ్మలు పట్టుకొని వ్రేలాడుటకు బొటనవ్రేలు అవశ్యకము. ఈ సంబంధము ఒకవేళ నిజము కాదేమో. మనకును కోతులకు వాస్తవముగానున్న సామీప్యము బహుకొద్ది. ఏలన కోతులకు మనవలె బుద్ధి వికాసము లేదు.

భూగర్భ శాస్త్రవేత్తల అంచనాలో మానవజాతి, వానర జాతి పుట్టి ఒక మిలియను సంవత్సరములు మాత్రమే. కాని ఇంత కొద్ది కాలములో మానవుడెంతయో పురోగమించినాడు. కాని కోతులు పుట్టినపుడెట్లున్నవో అట్లే మనోవికాసములేక యున్నవి. కనుక మరి కొందరు మనకు కోతులకు నేమాత్రము సంబంధము లేదనియు మానవజాతి, వానరజాతి దాదాపు ఒకేసారి పుట్టినవనియు చెప్పుదురు. ఒకే వాతావరణములో పెరిగినందువలన ఈ రెండు జాతులు కొన్ని సమాన ధర్మములు కలిగి యున్నవట. అంతేకాని మన పూర్వీకులు కోతులు కారట కాని కోతుల పూర్వీకులు మన పూర్వీకులు ఒకరేనేమో అని కొందరి అభిప్రాయము.



పరమ భక్తులు :-

కుబ్జ

శ్రీమతి కె. సీతాదేవి.

జ్ఞానమార్గం యోగ మార్గం భక్తిమార్గం మొదలైన వానిలో భక్తిమార్గం సులువుగా మోక్ష సంపాదనకు దారి చూపిస్తుంది. దీనికి ఆచార వ్యవహారాలతో పనిలేదు. నిశ్చలమైన మనస్సుతో భగవంతుని సేవించడమే భక్తి యని చెప్పాలి. భక్తి మార్గం ఏ యుగాల్లోను సరిపోతుంది. కృతయుగ, త్రేతాయుగ, ద్వాపరయుగాల్లో తపస్సు చేసిన మునీశ్వరులకంటే కలియుగంలో నిశ్చలమైన మనస్సుతో భగవంతుని ఒకసారి స్మరిస్తే చాలన్నారు. "కలియుగేస్మరణాన్ ముక్తిః" అన్నారు పెద్దలు. అలాటిం భక్తితో ధ్యానించగలిగిన వారే అరుదుగా వుంటారు కాబట్టి.

ఒకప్పుడు నారదమహర్షి విష్ణు సందర్శనార్థం వైకుంఠానికి వెళ్ళుచూ వేపచెట్టుక్రింద, చింతచెట్టుక్రింద తపస్సు చేస్తున్న మునీశ్వరులను చూచాడట. వారు నారదునితో తమ కెన్ని జన్మలకు మోక్షమున్నదో వైకుంఠ వాసుని కనుగొనిరమ్మ అనిచెప్పారట. తపోధనుడువిష్ణు సందర్శన మాచరించి వస్తూ వేపచెట్టుక్రింద మునీశ్వరునికి పదిజన్మలకు, చింత క్రిందవానికి చింతచెట్టు ఆకులన్ని జన్మలకు మోక్షమున్నదని చెప్పారుట. అప్పటిలో తపస్సు అందరకు పరిపాటై పోయిందన్నమాట. కాని భక్తి అలాంటిదికాదు. "భక్తి లేని నర జన్మమెందుకన్నారు" త్యాగరాజు పరమ భక్తులంతా భక్తితోనే తరించారు. భగవంతుని ధ్యానించుటకు డంబమవసరములేదు. భక్తుల కోర్కెలు తీర్చుటయే వానివిధి. "పత్రం పుష్పం ఫలం తోయం" భక్తితో యేమిచ్చినా వానికి తృప్తియే. చేరెడు అటుకులు తిని కుచేలుని సంపన్నుని చేసాడు కృష్ణపరమాత్ముడు భక్తితో స్మరించగనే తానీషా బాకీ తీర్చి కారాగార విముక్తుని చేసాడు రామదాసును శ్రీరాముడు. ఎంగిలిపండ్లు తిని శబరికి మోక్షమిచ్చాడు శ్రీరాముడు. సక్కుబాయి భక్తికి మెచ్చి కొన్ని రోజులామె అత్తవద్ద కోడలరికం చేసాడు భక్త పరాధీనుడైన శ్రీకృష్ణుడు భక్తిపరుల మనసు ఇతరులు మార్చవలెనని యత్నించినను సాధ్యము కాదు. ప్రహ్లాదుని తండ్రియైన హిరణ్యకశిపుడు శ్రీకృష్ణుని తలంచవలదని తనకు వైరి యని చెప్పినపుడు.

అంబుజోదర దివ్య పాదారవింద చింతనామృ
త పాన విశేషమత్త చిత్తమేరీతి నితరంబు జేరనేర్చు

అన్నాడు ప్రహ్లాదుడు. కమలముల వంటి భగవంతుని పాదములమీద ధ్యానముగల్గిన వారి మనస్సు వేరుగా పోదని చెప్పాడు. అట్టి స్థిరత్వము కలవారికే భగవంతుడు కోరిన కోర్కెలు తీర్చాడు. "గోవు వెంట తిరుగు కోడి భంగి, ఆవు వెంట వెళ్ళు లేగవలె" భక్తులవెంట తిరుగుచు వారెచ్చట కావాలంటే అచ్చటనే దర్శనమిచ్చాడు. స్థంభంలో ప్రత్యక్షం కాలేదా? ప్రహ్లాదుని కొరకు కృష్ణరాయబారమప్పుడు సామ్రాట్టైన దుర్యోధనుని యింటిలో నీరైన తీసుకొనక భక్తి పరుడైన విదురునింట విందారగించాడు కృష్ణుడు. అందుకనే సంపదలనడుగుటకు కుచేలుని ధర్మపత్ని తన భర్తను పంపుతూ "వరదుడు సాధుజన్మ వత్సలుడు అన్నది. కుబ్జయిచ్చిన సుగంధలేపనమునకు సంతృప్తుడై ఆమె వాంఛితము నెరవేర్చి ఆమె ఇంటికి వెళ్ళాడు. లీలామానుష విగ్రహుడైన శ్రీకృష్ణుడు.

కుబ్జ యనగా పొట్టిది. అందవికారమని మనకర్థమవుతుంది. ఆమె కంసునిదాసి. ప్రతిరోజు కంసునికి సుగంధలేపనము తీసుకొని వెళ్ళేదట. కంస ధనుర్యాగమునకుగాను అక్రూరుడు రామకృష్ణులను మధురానగరికి తీసుకొని వెళ్ళుతూవుంటాడు. ఊరి సమీపానికి రాగానే కొందరు పరమభక్తులు కనిపిస్తారు. వారందరు కంసునికి నౌకరులే. కాని బలరామ కృష్ణులు భగవత్స్వరూపులని తెలుసుకొనగలిగినవారు. వారు తొలుత ఒక రజకుని యింటికి వెళ్ళగా వాడు వారికి మంచి వస్త్రములిస్తాడు. వాని భక్తికి మెచ్చి సారూప్యము, లక్ష్మినొసంగి సుదాముడను మాలాకారు గృహంబునకు వెళ్ళగా వాడు బలరామ రామకృష్ణుల కర్ఘ్యపాద్యములిచ్చి,

పావనమయ్యె నాకులముపండె తపంబు గృహంబు
లక్ష్మికిన్.

కుబ్జ పరమ భక్తురాలు

సేవితమయ్యె నిష్టములు సేకూరె విశ్వనిదానమూర్తులై
భూవలయంబుగావనిటు పుట్టిన మీరలు రాకజేసినే
నేవిధమాచరింతు పనులెయ్యవిబంట నెరుంగజెప్పరే.

అని కొనియాడగ నామాలాకారునికి సంపద, ఆరోగ్యము, అనుగ్రహించి, వెళ్ళుచూవుండగా కుబ్జ కనబడుతుంది. ఆమెను నీవెవరని కృష్ణుడడుగ తన వికార స్వరూపాన్ని తలచుకొంటూ విసుగుజెందిన దానివలె

చక్కనివాడవైదు సరంబులు నొంపకు మెల్లవారికిన్
జక్కదనంబులెక్కడివి చారుశరీర! త్రివక్రయండ్రునే
నిక్కము కంసుదాసిని వినిర్మలలేపన విద్యదాననన్
మిక్కిలి రాజుమెచ్చుతగ మీరువిలేపనముల్ ధరింపరే.

అని నర్మోక్తిగా సమాధానమిచ్చింది. ఆమె యిచ్చిన లేపనమును శరీరమున నలందుకొని, ఆమె కొరత దీర్చనెంచినవానివలె తన చేతితో నామె నెత్తగానే అహల్యాశాప విమోచన జరిగినట్లు కుబ్జరూపముపోయి జగన్మోహినియై

"చక్కనైన చిత్తజన్మనై బాణముక్రియ నొంపుసే
యతరుణి సుందరమూర్తియై కమలనయ
నుచూచి కాంక్షతోడ"
వేంచేయుము నాయింటికి బంచశరాకాయనుచు
చైకొంగాక
ర్షించిహరిదిగిచె గామిని పంచాశుగబాణజాలభగ్న
హృదయయై

అట్లు త్రిలోక మోహినియై శ్రీకృష్ణుని తన యింటికి ఆహ్వానించగ కృష్ణుడు రాముని చూచి గనుసు,

కామిని దిగిచిన కృష్ణుడు రాముని
వీక్షించి నగుచు రాజానన
నుత్కామితము దీర్చి పిదప నీమందిర
మునకు వత్తునేడలుగకుమీ

ఆయనకామితమనగా కంసస హార మనియే. భక్తులకు అలుకకలుగునని భగవంతునికి భీతి కాబోలు. అందుకనే ఆయనను భక్తపరాధీను డన్నారుకదా? కంససంహారానంతరము మధురాపురినుండి తిరిగి వచ్చునపుడు ఉద్ధవ సహితుడై వచ్చాడా నటనసూత్రధారుడైన శ్రీకృష్ణుడామె యింటికి.

సనకాదుల్ తలపోసి కాననివిభున్ సర్వప్రభున్ దుర్లభున్
మునుదానిచ్చిన యంగరాగసుకృతామోదంబునన్
గూడియున్
ఘననిర్యాణ విభూతి యిమ్మనకయాకంజాక్షయేబా
యజాల..................

నంటుంది. బ్రహ్మమానసపుత్రులైన సనకుడు మొదలైనవారు కూడా చర్చించుకొనలేని సర్వమయుని తానిచ్చిన యంగరాగముల ఫలితమువల్ల భగవంతుడు తన యింటికి వచ్చినను మోక్షప్రాప్తి కోరక ఆయన వియోగమునకు ఓర్వలేనంటుంది కుబ్జ. రామావతారంలో ఋషులను రాముడు వరమడుగు మనగా మోక్షమడుగక ఆ దివ్య మంగళ విగ్రహుని సౌందర్యమునకు పరవశులై ఆయన సహవాసం అడిగారని అమునులే కృష్ణావతారంలో గోపికలుగా పుట్టి ఆయన వియోగం కొంచెంకూడా ఓర్చుకోలేకపోయారని చెప్తారుకదా? అలాగే రామావతారంలో సీతా సహితులై రామలక్ష్మణులు పర్ణశాలలో నివసించుచున్నప్పుడు శూర్పణక కామరూపిణియై వచ్చి రాముని వివాహం చేసికొమ్మని కోరిన విషయం అందరకు తెలిసినదే. పరిపూర్ణావతారుడైన శ్రీరాముడు ఏక పత్నీ వ్రతుడైనందున ఆమె మనోవాంఛితము తీర్చలేకపోయారని, ఆ శూర్పణకయే కుబ్జగా జన్మించి అవతార పురుషుడైన భగవంతుని జూచి మోక్షమడుగక ఆ జగన్నాటక సూత్రధారుని తన యింటికి ఆహ్వానించిందని పురాణాంతర్గతమైన కథ ఒకటి చెప్తారు. ఏదో లేనిదే తక్కిన భక్తులంతా జన్మరాహిత్యమైన పదవిని కోరగా కుబ్జ పరమాత్మడే తనకు వశవదుడగునట్లు కోరుతుందా? "ఆకుమారుల తనువులు, నగవులు, వీక్షితంబులుమాటల్ తనచిత్తము కరగించిన" అందువల్లనే ఆమె వారికి లేపనము లిచ్చిందన్నారు పోతనగారు. ఇంతకు భగవంతుని దయకలిగినప్పుడు సర్వము కరతలామలకమై యుంటుంది. మొత్తంమీద కుబ్జ భగవంతుని భక్తియనెడి త్రాళ్ళతో కట్టివేసిందన్నమాట. కృష్ణపరమాత్ముడు కోరినవారలకు కోరినట్లు ప్రవర్తించాడు. "బ్రహ్మేంద్రాది దేవతలుకూడ చర్చించి నిర్ధారణ చేయలేని భగవంతుడు పాండవులకు చెలియై, మేనమరందియై, సచివుడై చిత్తప్రియుండైనాడని నారదు డొకసందర్భంలో ధర్మజునితో చెప్తాడు. అలాగే పరమభక్తురాలైన కుబ్జకు గూడా చిత్తప్రియుడైనాడా పరమాత్ముడు. కాన భక్తితో సమానమైంది మరొకటిలేదని తోస్తుంది. అట్టి భక్తిమార్గం సాధారుణులకు అర్థంకాదు. కుబ్జవంటి పరమభక్తులకు తప్ప.

(ఆలిండియా రేడియోవారి సౌజన్యంతో)

కనుపాపనీడలు శీర్షిక :

మణి

శ్రీ కవికొండల వెంకటరావు

"మణి" మా నాల్గవకుమార్తె. ఆమె కడచిన అక్టోబరు నెలలో స్కూలుఫైనలు పరీక్షకు వెళ్ళింది. కారణం మార్చి నెల పరీక్షలో ఇంగ్లీషు భాషను మూడుమార్కులు తక్కువైనాయట. ఆభాష అసలు మనకు వద్దు అనుకొనేవాళ్ళము అందులోనే పరీక్ష పట్టింపులా అని నేను ఆమె నోదార్చి మళ్ళీ పరీక్షకు చదివించేలో పెళ్ళి కుదిరింది. ఈ డిశంబరు 18 వ తేదీని పెళ్ళి అయింది. కాని ఇంకా పరీక్ష ఫలితం తెలియ నక్కఱ లేదని మావాళ్ళ వాదం- తెలిసినట్టే. పెళ్ళయింది. అదే ప్యాసంది-

ఇంతకూ ఆమె నత్తింటికి పంపించాము. ఒడి గట్టు బియ్యం అనీకట్టి. ఇంకా తిరుగరాలేదు. రేపో మాపో వస్తుంది. పరీక్షా ఫలితాలుకూడా అప్పుడే వచ్చేలాగున్నాయి. దేనిరాక ముందా అని యోచిస్తూ వ్రాస్తున్నాను.

"మణి" అనే మా అమ్మాయి పనిలో విశేషం ప్రకాశించే అమ్మాయి. తప్పితే చదువు దగ్గఱకూడా మిక్కిలి పట్టుదల గలపిల్ల. ఎంత సేపు లోలోపల చదుకోవడం ఆమె కలవాటు. పైకి చదవదు. పైకి చదివిందా ఎవరో "దొరసాని" చదివే కంఠంగా వినిపించేది నాకు. అయితే ఒకటి రెండు తప్పులు రాకమానేవి కావు. నేనుగా ఓపికను బట్టి దిద్దేవాణ్ణి. ఆమె మరీ ముద్దరాలై లోలోపల చదువు కొనేది. నాకున్న చదువంటే, అందులోనూ ఆడపిల్లల చదువంటే, బింకం సడలిన వాణ్ణి కావడంవల్ల, ఏలా చదివితే అదే నేర్పుగా భావిస్తూ ఊరుకునేవాణ్ణి! ఆమెకు వచ్చిన పెళ్ళివారు కూడా ఆమె చదువుమీద అంత పట్టింపు లేకుండా ఆమె పనిలోని నేర్పుమీదనే అంత పట్టింపు కలిగి వున్న వారుగా తోచేరు. అందుచేతనే ఆమెను తమ కోడలుగా చేసుకొన గలిగారు.

ఇలా వ్రాస్తూ వుండగా సాయంకాలం మెయిలు బంయిమంది. మెయిలుదిగి, ఇంటికి వచ్చేశారు వెళ్ళినవాళ్ళు "మణి" అహా అందరూ బిలబిల మంటూ!

నేనున్నా వాళ్ళను ఆహ్వానిస్తు వార్తా పత్రికను తిరగేశాను. "మణి" నెంబరు వుంది. ఆమె పరీక్షలో కృతార్థురాలైంది. మఱినాసంతోషానికి మేఱలేక పోయింది. "ఎందుకంత సంతోషం?" అంటారేమో! పరీక్షలో కృతార్థత గాంచడం అంత గొప్పా? అని ఎవరైనా ప్రశ్నిస్తారేమో! వారందఱకు నేరుగా నేనిచ్చే జవాబు ఒక్కటే! తండ్రి హృదయం మఱొకళ్ళకు తెలియదు అని.

చాలా మందికి తల్లి హృదయం తెలుసును గాని అనేక మందికి తండ్రి హృదయం తెలియదు. తండ్రి కసలు హృదయమే ఉండదని, వాని జీవనము ఒక మొండి జీవనము అని పెక్కురు వాదము, కాని నేను ఆ వాదంతో ఏకీభవించను. తండ్రికి కూడా తల్లి కున్నట్టే, ఓ హృదయం తనయొక్క పిల్లలపట్ల అల్లాడుతూ వుంటుంది. "పైకివస్తారా రారా?" అని

"మణి" - ఆమెపేరు ఈ పైనుండి స్కూలు ఫైనలు ఎలిజిబిల్ లిస్ట్‌లో వుండగలదు. అదే చాలు చంద్రునికో నూలుపోగన్న సామెతగా నాకామెయిచ్చే కానుక. ఈ నాచిన్న వూహ ఆమెకు తెలుసునో లేదో?

ఆమె అప్పుడే ఒక పెద్ద ఉత్తరము వాళ్ళ ఆయనకు వ్రాసిందట !- "పరీక్షపాసయినా" నని. ఆ శుభవార్త భర్తకు సరిపోవునా? ఆచంద్రార్కము వెలిసే కుటుంబాభివృద్ధి, కోమల తరగోష్టి, కుతుకము కోరికలు సమస్తము ఎప్పటి కప్పుడు తీరుతూ వుండడం, ఇలాంటి వన్నీ అతగాని ఆశయాలై యుండవచ్చు.

తిరుగ అతగాడు వ్రాసే జబాబు నాకు కన పరుస్తుందా మా "మణి"? కన పరచదను కుంటాను.

★

పరమార్థము

కవిరాజహంస కవికులాలంకార శ్రీ బాలాంత్రపు వేంకటరావు.

మట్టిలోనే పుట్టి, మానుగాగట్టి,
చిపురుగొమ్మల హెచ్చి పువుదావులిచ్చి.
పసరు పిందెల దేలి, ఫలములై రాలి,
బీజసంతతులచే పృథ్వినిండించి
మొలకయై మోకయై ఫలవృక్షమగుచు
విణ్ణు మన్నల రంగ విందుగావించు
జీవణ తతులకు సేవగావించు
చెట్టువదాన్యత చెప్పంగాదరమె ?—

తమిని బుట్టిన చుక్క తళతళ మెఱసి
తొంగిచూచుచు నుండు నింగినెందులకొ ?—
పగలుచూచిన తెల్లబారు నీచుక్క
చీకటిలోననే చిరునవ్వు నవ్వి
దారిచూపును బాటసారి కెందులకొ ?—
కంటిపాపకు తోడుగా గానవచ్చి
వెలుగిచ్చి చెలువిచ్చి కలకాలమిట్లు
తిరుగుచుక్క జగాల దివ్వెగాకున్నె ?—

తనకోసమే పుట్టు తానను మాట,
తనకోసమే గిట్టు తానను మాట,
అనోట నానోట ననుమాటగాక
మానవుండై యేల మహిపుట్టిగిట్టు ?—
జీవరక్షయె తన చిరకాంక్షయైన
ప్రాణిరక్షయె తన పరమార్థమైన
చన్నవాడే తాను జగములబాసి ?
ఉన్నవాడేకాదె యుభయ లోకముల !—

వారే మవు తారు ?

శ్రీమతి డాక్టరు. ఎన్. హనుమంతరావు
ఎం. ఎ. ఎం. ఎన్.

ఒక యువకుడు, ఒక స్త్రీ దారిలో పోవుచుండ ఒక వృద్ధురాలు వారిని అడ్డగించి

"వారేమవుతారు ?" అని ఆస్త్రీని ప్రశ్నించెను.

"మా మామను యితని మామ మామాయని పిలుచును" అనెను అయిన వారేమవుతారు ?

సూచన:—

"ఆంధ్ర మహిళ" పాఠకులు వారివారి మనస్తత్వాలు బాగుగా ఆలోచించి విపులముగా విశదీకరించి వారి వరుస ఏమవుతుందో ఆలోచించండి.

చిన్నకథ

★ "సలహా" ★

శ్రీమతి చంద్రావతి

కష్టించినదానికి తగిన ఫలం లభించిందనే సగర్వమైన ఆనందముతో ఇంటికి వచ్చాడు రైతైన రామయ్య. వెనుక బండ్లమీద వస్తున్నాయి వడ్లు పొలమునుండి. ఆ సంవత్సరం బాగా పొలివుంది అమితంగా రాలాయి వడ్లు. దాని వలన ఆనందంతో సుఖంగా నిద్రపోయాడు రామయ్య ఆ రాత్రి. తరువాత కొద్దిరోజులకె ప్రక్క గ్రామంలోని మిల్లుకు అమ్మివేశాడు వడ్లు. చేతికి డబ్బు పుష్కలంగా వచ్చింది. కొడుకులకు జీతాలు, పరీక్ష ఫీజులు చెల్లించాడు. రెండు మూడు చేబదులు బాకీలుంటే అవికూడ తీర్చివేశాడు. ఆ దగ్గరఉన్న బస్తీకి పోయి తనకు బట్టలు, భార్యకు పట్టుకోక, పిల్లలకు మంచి మంచి బట్టలు పట్టుకువచ్చాడు.

"ఏమండీ డబ్బు వచ్చిందిగదాయని ఖర్చుపెడితేఎలా?" అన్నది రామయ్య భార్య.

"ఉన్నపుడు కాకపోతె ఎప్పుడు ఖర్చుపెడతావే మరి" అన్నాడు రామయ్య.

"మరి నాలుగురాళ్ళైన వెనక వేసుకోపోతె ఎలాగండి ముందు ఏకాలం ఎలా ఉంటుందో! నేషనల్ సేవింగ్స ద్వారా ఎంతచిన్న మొత్తానైన దాచుకోవచ్చునట. మొన్న మహిళా సభలో చెప్పారు. అది దేశ సౌభాగ్యానికి కూడ ఉపయోగిస్తారట మనంకూడ దాచుకుంటే మనడబ్బు నిల్వ ఉంటుంది. అది ఇతరులకు కూడ ఉపయోగిస్తుంది గదా!" అంది అతని భార్య.

"మహా దేశాన్ని ఉద్ధరించే దానివి బయలుదేరావులే వంటింట్లో పెరిగే ఆడదానివి నీవుకూడ చెప్పొచ్చావు! సలహా" అన్నాడు రామయ్య.

అప్పటికి కొద్ది రోజుల క్రితమే "వాడంటరా పెళ్ళాం దగ్గర చెప్పుక్రింద తేలల్లె పడుంటాడురా! వీడి పెత్తనమే ముందిరా. వీడు ఒకవేళ బెజవాడ మనతోపాటు రావాలనుకున్న అమ్మగారి అనుజ్ఞ ముద్రపడొద్దు. కనుక మనం వస్తావట్రాఅని అడిగితె ఇపుడేమి చెపుతాడురా "అని పరిహసించారు. ఆమాటలు ఒక్కసారిగా చెవులో గింగురుమన్నాయి రామయ్యకు. భార్య మాటలు ఎందుకు వినకూడదు? ఆమె మాత్రం మనిషికాదా? ఆమెకి మనసు, భావాలు, ఊహలు, ఉపాయాలు లేవా? ఆమె మానవ సంఘములోని ఓజీవికాదా? ఆమెకన్న పురుషునికి ప్రకృతి ఇచ్చిన ఆధిక్యత ఏమిటి? అవయవ భేదం తప్ప మెదడు హృదయం ఆమెకి ఉన్నాయె! ఆమె ఊహాభావనా శక్తులను ప్రకృతి అరికట్టలేదే! ఆమె ఆలోచనలు తనకన్న ఉత్తమమైనవి కాగూడదు? ఎందుకు ఆమె మాటలను సలహాలను ఎందుకు పాటించగూడదు? అన్న ఆలోచనలన్న గాని, ఒక్కసారి మనసుతో ఆలోచించుటకైన, ఆ అమాయక రైతుకు ధైర్యం లేకపోయింది. తన జీవిత సుఖదుఃఖాలలో సహభాగినియైన భార్య మాటలు వినుటకే సాహసించలేకపోయాడు. అతనేకాదు ఈ ఆధునిక భారతదేశంలో ఇంకెందరున్నారో!

"మానసికాభివృద్ధికి భావాలకు వంటిల్లు అడ్డం వస్తుందా? మీరు మాత్రం మీ వృత్తి చెయ్యటం లేదటండి?" అంది. స్త్రీ కూడ తనలాంటిదేనని, విద్యావంతులు నాగరికులమనుకునే వారే, గ్రహించలేనపుడు పాపమా పేద రైతునకేమి తెలుస్తుంది?

"నోరుముయ్" అన్నాడు సమాధానం చెప్పలేక. తమపై ఆధారపడిన స్త్రీపై, పురుషులు వేసే కేకలలో కలసిపోయింది ఆ గద్ధింపుధ్వని. భావ ప్రకటనా స్వాతంత్ర్యం గల ఈ దేశములో స్త్రీ తన భర్తముందు తన ఉద్దేశాల్ని వెలిబుచ్చుటకు అవకాశము లేని నారీమణులలో ఒకతైంది అతని భార్య.

పంటలధికంగా పండుటవల్ల ఆ సంక్రాంతి పండుగ ఆనందంగా వుంది. వచ్చేపోయే బిచ్చగాళ్ళు, వచ్చేకూలీలు, గంగిరెద్లు, ఇంటిముందు జనం, చక్కగా తీర్చి దిద్దికట్టిన ధాన్యపు పురులు, ఇంటిముందు చేసే దానధర్మాలు, చూస్తూంటే ఉండే ఆనందం రైతుకు మరెపుడు లభిస్తుంది.

సంక్రాంతి పండుగేకదా రైతుల కానందదాయకమైన పండుగ.

* * *

కాలచక్రం తిరిగిపోతూవుంది. నాట్లు వేయటం కూడ జరిగిపోయింది. పైరు బాగానె పెరిగింది. చేనువంక చూచుకొని రామయ్య మురిసిపోయాడు. శ్రమకు తగిన ఫలం లభిస్తుందనుకొన్నాడు. వరికర్ర పొట్టవిచ్చుతోంది. కలలోనైన అనుకోని సంఘటన అకస్మాత్తుగా సంభవించింది. ప్రొద్దున్నె చేనువంక చూచేసరికి రామయ్య జీవాలు కృంగిపోయాయి. రెండు రోజులనుండి వీస్తున్న గాలివానవల్ల పైరు కనుపించి, కనుపించనట్లుగా ముంచివేసింది వర్షపు నీరు. నిరాశ వలని దుఃఖముతో కూడిన వదనముతో ఇంటికి చేరుకున్నాడు రామయ్య. ఆ కుటుంబమే కాదు ఆ గ్రామములో గల చిన్న రైతుల కుటుంబాలన్ని శోకానికి గురిఅయినాయి. కోతలు కోసి గడ్డికుప్పలేశాడు. కాని పంటతో కూడిన పైరుకాదు. రాలుబడి చాలా తగ్గిపోయి వడ్లు తప్పలేసి పోయాయి. ఈ సంవత్సరం పంటచాల దెబ్బతింది.

శిస్తు రోజులు వచ్చాయి. పంటలకు అపారనష్టం కలుగుట వల్ల శిస్తు మాపుచేయవలసిందిగా ప్రభుత్వము వారిని అర్థించారు కాని ఈ అభాగ్యుల ఆర్తనాదం వినేవారెవరు. తాసీలు చెల్లించేందుకు ఇంట్లో డబ్బులేదు. అమ్ముటకు గింజలేదు. పండిన ధాన్యం ఖర్చుకే చాలిచాలటంగానె ఉన్నాయి. గ్రామ మునసబు తాసీలు కట్టావా కట్టు. లేదా పశువులను తోలించుకు పోతానంటున్నాడు. ఏమి చేస్తాడు. ఆ అభాగ్యపు రైతు. రేపు సాయంకాలం లోపల శిస్తు చెల్లించాలి లేదా ముద్దు గిత్తలు కదలిపోతాయి పెరటి నుండి. ఏలాగాఅని ఆలోచించుకుంటూ ఇల్లుచేరుకున్నాడు రామయ్య. స్నానంచేసి భోజనానికి కూర్చున్నాడు కాని ముద్ద లోపలికి పోవటంలేదు.

"ఇపుడు విచారిస్తే ఏమిలాభం. నేషనల్ సేవింగ్సుసర్టిఫికెట్లు కొనమంటే విన్నారు" అంది భార్య.

"అవును" అన్నాడు రామయ్య తనలోపాన్ని గుర్తించి.

మరునాడు గ్రామోద్యోగి వచ్చాడు. ఎట్టివాడు విప్పుటకు రాకపోవుటచే గిత్తతాడు కోస్తున్నాడు. అప్యాయంగా మేపుకొన్న తెల్లగిత్తను చూడగానే రామయ్య హృదయం పరపర కోసినట్లనిపించింది. ఆ గిత్త తాడుకోత శబ్దం చెవులలో గింగురుమంటోంది, కాని ఏమిచేస్తాడు; శక్తిహీనుడు. ఇంతలో భార్య తన చేతికి డబ్బు అందించింది.

"ఎక్కడిది" అన్నాడు రామయ్య హృదయమునుండి వెల్లుబికిన ఆవేశంతో.

"తరువాత చెప్పుతా చెల్లించండి" అంది.

ఆనందంతో తొణికిసలాడె హృదయంతో ఇంట్లోకి తిరిగి వచ్చాడు రామయ్య,

"అది నేను స్త్రీల కొద్ది మొత్తాలు కూడబెట్టుకొనె సర్టిఫికెట్లవల్ల కూడబెట్టగలిగాను" అంది సగర్వముగా.

"అలాగా"అని స్త్రీ యొక్క భావిజీవితాన్ని గూర్చిన దూరదృష్టి—భార్య సలహాలను తీసుకొని అనుసరించుట వలన కలిగే లాభము-వచ్చిన డబ్బును దాచుకొనె విధానం తెలుసుకొన్నానన్న గర్వాన్ని వక్తపరుస్తున్నట్లు ఆమె వంక చూస్తూ నవ్వుతున్నాడు.



అన్నదమ్ములు

శ్రీమతి జయంతి వెంకటపుష్పావతి

అనగనగా ఒకవూళ్ళో రామూ, సోమూ అనే యిద్దరు అన్నదమ్ములు వుండిరి. వారికి తండ్రి యిచ్చిన భూమిలో యిద్దరూ కలిసి వ్యవసాయం చేసి బ్రతికేవారు. ఇలా వుండగా ఒకనాడు ఏదోమాటమీద తగవులాట వచ్చింది. అది చిలికి చిలికి గాలివానలా మారింది. అప్పుడు ఇంటిలోని సామానులూ, బట్టలూ అన్నీ భూమితో సహా చెరి సగమూ పంచుకుని విడిపోయిరి. రామూ, సోమూ ఆ యింటిలోనే చెరోవాటాలోనూ వేరేవేరే వుంటుండేవారు.

రామూ ప్రొద్దున్నే అయిదుగంటలకే లేచి పళ్ళుతోముకుని, స్నానంచేసి, చద్ది అన్నంతిని పనివాళ్ళతో కలిసి తోటలోకి వెళ్ళేవాడు. సోమూ తొమ్మిది గంటలకి లేచి. పళ్ళయినా తోమకుండా కాఫీత్రాగి. నీళ్ళు పోసుకోకుండానే బట్టలు వేసుకుని, పనివాళ్ళని తోటలోనికి పంపించి తాను బజారుకి షికారు వెళ్ళేవాడు. ఇలావుండగా కొన్నాళ్ళకు రామూ ధనవంతుడై ఇంకా భూమి కొన్నాడు. సోమూ వచ్చేడబ్బు చాలక, చిక్కుపడుతూ, వున్న భూమినే అమ్మాలని చూస్తున్నాడు. ఇంతలో ఒకనాడు అన్నదమ్ములిద్దరూ బజార్లో కలుసుకున్నారు. అప్పుడు రామూ సోమూని "బాగున్నావా" అని అడిగేడు. సోమూ సిగ్గుపడుతూ "అన్నయ్యా! ఏమీ అనుకోనంటే ఒక్కమాట అడుగుతాను, చెబుతావా" అన్నాడు.

రామూ "తప్పకుండా చెబుతాను. అడుగు" అన్నాడు. "అయితే అన్నయ్యా! మనమిద్దరం భూమీ అవీ సరిసమానంగా పంచుకున్నాంగదా, నేను డబ్బు చాలక యిలా వుంటే, నువ్వు ఇంకా భూమి ఎలా కొనగలిగేవు" అన్నాడు సోమూ. రామూ చిరునవ్వుతో యిలా చెప్పేడు "నువ్వు ప్రొద్దున్నే లేచి పనివాళ్ళని 'తోటలోకి పొండి' అంటావు. అందుకే నీదగ్గరినుంచి డబ్బువెళ్ళి పోతుంది. నేను వాళ్ళని 'తోటలోకి రండి' అని పిలుస్తాను. అందుకే డబ్బు నాదగ్గరికి వస్తుంది. అంతే"—

ఆమరునాటి నుంచీ సోమూకూడా వేగిరంలేచి రామూలాగ పనివాళ్ళతో కలిసి తోటలోకి వెళ్ళడం మొదలు పెట్టేడు.

లంచగొండికి దేవుని శిక్ష

శ్రీ సన్నాకుల సుందరరావు.

పూర్వం ఎలీషా అనే క్రైస్తవ భక్తుడుండేవాడు. ఇప్పటికి ఇంకా క్రీస్తు అవతారమెత్తలేదు. ఇతని తర్వాత సుమారు మూడు వేల సంవత్సరాలకు క్రీస్తు జన్మించాడు. ఆ కాలంలో దైవ మందిరమెంతో పరిశుభ్రంగా ఉండేది. పూజారి శుచియై, మైలఏమీ లేకుండా, పీఠం పద్దకువెళ్ళి దేవునికి నైవేద్యం అర్పించాలి. పూజారి అపరిశుభ్రుడుగా వెళ్ళాడంటే ఆ పీఠం బయటనే రక్తం కక్కి చనిపోయ్యేవాడు. ప్రజలెవరూ ఆ కారణంచేత దేవాలయంలోకి అడుగు పెట్టేవారుకాదు. యాజకుడు చనిపోయినదీ, లేనిది తెలుసుకోడాన్కి అతని నడుముకు తాడుకట్టి చుట్టూ గంటను కట్టేవారు. పూజారి బ్రతికే ఉన్నట్లయితే, పీఠం బయట ప్రదక్షణచేస్తుంటే, గంటలుగణగణా మ్రోగేయి. అంత పరిశుభ్రంగా ఆమందిరం ఉండేది. అంతేకాదు. సన్యాసం, స్వీకరించినవారు అబద్ధాలు ఆడకూడదు. దొంగతనాలు చేయకూడదు. ఇలా ప్రతి గ్రామంలో జరిగేది. గ్రామానికి ఒక్కొక్క రోజు చొప్పునవెళ్ళి. భక్తి మార్గం బోధించేవాడు, ఎలీషా.

ఒక గ్రామంలో ఇరువురు దంపతులుండేవారు వారికి సంతానం లేక ఎన్నో దానధర్మాలు చేశారు. దైవం యెడల భయభక్తులు చూపారు. ఆ ఊరికి బోధ చెయ్యటానికి ఎలీషా వచ్చినపుడల్లా, వారి ఇంట్లోనే ఆతిధ్యం ఇచ్చేవారు. ఇలా తనకు ఆతిధ్యం ఇస్తూన్న ఆ దంపతులను చూచి సంతోషించాడు. ఒకనాడు ఆ గ్రామాన్నుంచి వెళ్తూ వెళ్తూ ఆస్త్రీని పిలచి అమ్మా! నీ కోరిక ఏమిటో చెప్పు. నేను తీరుస్తానని అడిగాడు. అందుకు ఆ స్త్రీ ఏమీ బదులు చెప్పకుండా మౌనం వహించింది. నీవు చెప్పకపోయినా నేను నీయొక్క కోర్కె తీరుస్తాను. వచ్చే సంవత్సరం నేనిచ్చటకు వచ్చేసరికి నీవు ఒక కుమారునికని, ఆనందిస్తుంటావని అన్నాడు. అందుకామె అయ్యా! ముసలిదానికి సంతానమా? అని ప్రశ్నించింది. అందుకు అదంతా దేవుని ఇష్టం అని చెప్పి వెళ్ళిపోయాడు.

మరుసటి సంవత్సరం వచ్చేసరిక్కి, ఎలీషా మాట ప్రకారమే ఆ స్త్రీ నవమాసాలూ మోసి, ఒక శిశువును కన్నది. లేకలేక పుట్టినవాడవటం చేత అల్లారు ముద్దుగా పెంచసాగారు తలి తండ్రులు. ఎలీషా అచ్చటకు వెళ్ళగానే అతనికి నమస్కరించిందా స్త్రీ. మీయొక్క మాటలు నమ్మలేకపోయాను. క్షమించండి. అంటూ క్షమాపణ వేడుకొంది. అచట నాలుగు దినాలుండి, రాజధానియైన యెరూషలేము చేరాడు. ఆకాలంలో ఫిలిష్తీయులకూ, ఇశ్రాయేలీయులకు వైరం ఉండేది. దైవజనుడైన ఎలీషా ఉండటం చేత శత్రువులు దండెత్తి వచ్చారంటే, ఉరుములూ, మెరుపులూ కలగి త్రోవ తెలియక పారిపోయేవారు. ఫిలిష్తీయుల సైన్యాధిపతికి పక్షవాతం ఉంది. దాన్ని ఎలాగైనా నయం చేస్తేసరి. లేకపోతే యుద్ధానికి తయారు కమ్మని ఉత్తరువు పంపాడు ఫిలిష్తీయులరాజు. దాన్ని చూసి రాజు హడలెత్తి ఈ విషయం ఎలీషాకు తెల్పాడు. అందుకు ఎలీషా దేవుడు చేయని పనంటూ లేదు. ఆ సైన్యాధిపతిని పిలిపించండి అని చెప్పాడు.

రాజుగారి ఆజ్ఞ ప్రకారం సేవకులు వెళ్ళి సైన్యాధిపతిని తెచ్చారు. ఎలీషా అతనితో నీవు యొర్దాను నదిలో ఏడు సార్లు మునగమని చెప్పాడు. అతడలాగే చేసేసరిక్కి, పక్షవాతం పోయింది. అతడు కృతజ్ఞతగా వెయ్యి వరహాలు ఇవ్వబోగా దేవుని సేవకు లంచం అక్కరలేదని చెప్పాడు. అంతటితో సైన్యాధిపతి తన రాజ్యానికి ప్రయాణమైపోయేడు. ఎలీషా శిష్యుడైన ఒకడికి ఇది నచ్చలేదు. గురువుగారు వెయ్యి వరహాలు పోగొట్టుకున్నారని తలచి, అతనికి తెలియకుండా పరుగెత్తివెళ్ళి సైన్యాధిపతిని కలుసుకొని అయ్యా! మా గురువుగారి ఇంటికి పదిమంది అతిధులు వచ్చారు. రెండువందల వరహాలను అడిగి తెమ్మన్నారని అడిగాడు. అందుకు ఆ సైన్యాధిపతి వెయ్యి వరహాల సంచిని యివ్వగా దాన్ని తన యింట్లోదాచిశరీరంవైపు చూసుకునేసరిక్కి ఒళ్ళంతా పక్షవాతం ఏర్పడిఉంది. ఇంకేముంది గురువుగారి దగ్గరకువెళ్ళి గురూజీ, ఈ పక్షవాతం పోగొట్టండి అని ప్రార్థించాడు, అందుకాయన నవ్వుతూ భగవంతుని సేవ చేసేవాడు లంచం ఎప్పుడైతే తీసుకుంటాడో అప్పుడే భగవంతుడు శిక్షిస్తాడు. నీవు సైన్యాధిపతి వద్దకు వెళ్ళటం అతన్ని డబ్బులడగటం అన్నీ చూస్తూనేయున్నాను. ఇది దేవుని శిక్ష. దానికి నేనేమీ చెయ్యలేను అనిచెప్పాడు. ఆ శిష్యుడు ఆనాటినుంచీ బాధపడ్తూ మరణించాడు. చూశారా! లంచ గొండులకు దైవం వేసే శిక్ష మీరు లంచాలు పుచ్చుకోకండేం.... లంచాలు పుచ్చుకోవటంవల్ల మనకే ముప్పు వస్తుంది. ఇది మీరు మరువకండి.

భావములోని భగవంతుడు

శ్రీమతి దీనవాను బదరీనారాయణమ్మ

ముక్కోటి ఏకాదశి మూడువీధుల మొగలో మంటపముమీద పరమభాగవతోత్తముడని పించుకున్న హరిదాసుగారు హరికథా కాలక్షేపము చేస్తువున్నారు, ఆడియనులందరూకూడా అతిశ్రద్ధగా వింటూవున్నారు. హరికథమాటల్లో అందరి హృదయాలు లీనమైపోయాయి. నిర్జీవప్రతిమలకు మల్లే నిలబడి వింటూ వున్నారు.

మూడురోజుల నుండి పొట్టమాడుతున్న ఒక మహాదరిద్రుడు దొంగతనానికి బయలుదేరినాడు. ఆడవాళ్ళ వెనకాల అట్టే అణగిమణిగి కూర్చున్నాడు శ్రద్ధగాను దేనికో. రాత్రి పదకొండు ఘంటలైనది. హరికథ అంతా చెప్పిన తరువాత ఆఖరున యీలా అన్నాడు హరిదాసుగారు.

ఇట్లు హార, కటక, కేయూర, మణికంకణ, మంజీర, అంగుళ్యాభరణుడై, మొలనూలు, పులిగోరు, ముక్తామణి గండ భాగంబున, కర్ణ కుండల విరాజితుండై, మణిఖచిత స్వర్ణనూపురంబు కలవాడై, పీతాంబరధారియైన గోపాలబాల కృష్ణుడు యమునా విహారియైచనియెన్ (శ్రీమద్రమారమణ గోవిందోహరి) అని భాగవతానికి ఠ్రాడు చుట్టపెడుతూ మంగళహారతి యిచ్చినాడు. హారతి అందరూ కండ్లకద్దుకుని, అట్టే యిండ్లకు పోయారు. మన దొంగతప్ప. దొంగ హృదయములో భావనా పరంపరలు పెరిగిపోయాయి. భగవంతుడు ఏదిచేశినా మనమేలే చేస్తాడు, ఆడవాళ్ళమెడ తడుముతే అరకాసో, అర్ధణా ఎత్తు (బంగారం) వుంటుంది కాని, ఆకలి తీరినంత వుండదు. కొడితే యిటువంటి ఛాన్సే కొట్టాలి. కష్టపడి యమునాఘాట్ కాసుకుంటే కరువుతీరా సంపాదించుకొనవచ్చు. యీలా అనుకుని, రాయనకా రప్పనకా, గుట్టనకా, మెట్టనకా కంచనకా, కంపనకా, గొయ్యనకా, నుయ్యనకా, కృష్ణుని వెతకుచూ భావనలచే రెట్టించుకుంటూ బయలుదేరినాడు. మరచి పోకుండా మననముచేసుకుంటూ ముందుకు సాగినాడు. "చెలిమినైన, బలిమినైన, చెడ్డతనంబునైనా చిక్కి భగవంతుడు దొంగవాని భావములో దూరిపోయాడు. మనోలయం చేసుకున్న మూఢుడు, మతిభ్రమించిన వాడై అదిగో కృష్ణుడు యిదిగో మురళి, అవిగో ఆభరణాలు) అని పలవరింతలు మొదలు పెట్టినాడు. భక్తిభావంబే. భావంబు ముక్తికనుమ అనునట్టు, మూఢభక్తిలోను, అనురక్తిలోనూ కూడా వున్నానన్నాడు. క్రిష్ణపరమాత్మ. మనదొంగ మూఢభక్తికి మురళివాయించినాడు. కృష్ణపరమాత్మ వీనులకు సోకడంతోనే వింతగా తోచింది దొంగకు దృష్టులలో కృష్ణుడు. దొంగతనం చేయనుద్దేశముతో దవడమీద కొట్టబోతాడు దొంగ. చంద్రావళి చంపకాయకే చిరునవ్వు నవ్విన జగన్మోహనుడు, దొంగవాని దౌర్జనానికి దివ్యజ్ఞాన మిచ్చాడు. దొంగ జ్ఞానిక్రింద మారినాడు. కలికాలంలో భావములోనే భగవంతుడున్నాడు మూడునిమిషాల భావమునకు ముక్తి నిస్తానన్నాడు, మాకథలోని భావం, చదువరులకెరుక.

మహిళా సమాజము

దుగ్గిరాల

జనవరి 1 వ తేదీని దుగ్గిరాల మహిళా సమాజము ఆధ్వర్యమున ఒక ప్రసూతి చికిత్సాలయము ఆరంభింపబడెను. శ్రీమతి కె. లక్ష్మీరఘురామ్‌గారు ఆరంభోత్సవము జరిపిరి. శ్రీమతి కొండా పార్వతీదేవిగారు అధ్యక్షత వహించిరి.

ఈ మహిళా సమాజమును అఖిలభారత మహిళా సభకు అనుబంధశాఖగా చేర్చుకొనబడినది.

"ప్రథమ చికిత్స"

డాక్టరు ఎన్. హనుమంతరావు

"నోటినుండి రక్తము కారుట"

1. రక్తము సాధారణముగా నాలుకనుండిగాని చిగుళ్ళ నుండిగాని పండ్లూడదీసిన గాయమునుండిగాని కార వచ్చును.

2. ఊపిరితిత్తులనుండి రక్తము కారవచ్చును.

3. కడుపులోనుండి రక్తము కారవచ్చును.

"చికిత్స"

1. చప్పరించుటకు మంచు గడ్డనుగాని నోటిలో పట్టుటకు (పుక్కిలించుట)కు మంచి నీళ్ళనుగాని యిమ్ము.

2. ఒకవేళ నాలుకయొక్క కొననుండి రక్తము కారుచున్న ఎడల ఒకలింటు బట్టనువేసి వ్రేళ్ళ మధ్యను పెట్టి యొత్తము.

3. రక్తము పల్లూడదీసిన గాయమునుండి కారుచున్న ఎడల ఆగాయము దూదితోగాని శుభ్రమైన లింటులోగాని నింపుము. దానిపైనొక బెండుమూతనుగానిలేక తగు పరిమాణముగల దేనినైనను దానిపైనుంచి రోగిని కరువ మని చెప్పుము.

"ఊపిరితిత్తులనుండి రక్తము కారుట"

1. ఊపిరితిత్తులనుండి రక్తము దగ్గినప్పుడు పైకి వచ్చును. ఇది ఎఱ్ఱరంగు గలిగియుండి గాలితో కలిసి యుండుటవలన నురుగుకట్టియుండును.

"చికిత్స"

1. అనుభవము కలిగిన డాక్టరుకు చూపించడము. అవసరములేక యిట్టివ్యాధి క్షయమొదలగు చెడ్డ వ్యాధిగా మారును.

"అన్నకోశములనుండి రక్తము కారుట"

1. రక్తము జీర్ణకోశమునుండి కక్కబడును. ఈ రక్తము తరచుగానల్లగను కాఫీ నీళ్ళరంగున నిలుచు మట్టిరంగుగాను ఉండి యన్నముతో కలిసియుండును.

"చికిత్స"

1. తినుటకుగాని త్రాగుటకుగాని ఏమియునియ్యకుము. వెంటనే డాక్టరును పిలిపించుము.

"ముక్కునుండి రక్తము కారుట"

1. రోగిని కిటికీకెదురుగా గాలిలో తలవెనుకకు వేసి చేతులను తలపైనిపెట్టి కూర్చుండబెట్టుము.

2. మెడచుట్టును రొమ్ముచుట్టును నున్న బిగుతు బట్టలను దీసివేయుము.

3. ముక్కుమీదను కంఠముమీదను వెన్నుపూస పైనను చల్లనినీళ్ళతో తడిపినబట్టను వేసి పాదములను వేడినీళ్ళలో నుంచుము.

4. రోగిముక్కు ద్వారా గాలిని పీల్చకుండ నోరు తెరిచిపెట్టుము.

5. రోగిని చీదనీయవద్దు.

"చెవులనుండి రక్తము కారుట"

1. చెవులనుండి రక్తము కారుట సాధారణముగా పుఱ్ఱెయొక్క యడుగుభాగము విరుగుటవలన గలుగు చున్నది.

"చికిత్స"

1. చెవులను మూయుటకు ప్రయత్నము చేయకుము.


2. చెవిపైన పట్టీగుడ్డను పెట్టివదులుగా కట్టుగుడ్డను కట్టుము.

"నలుగగొట్టుటవలన గల్గినగాయములు"

1. దేహముపై నేదైన దెబ్బ తగులుటవలన మీది చర్మము పగులకుండ చర్మము క్రింద రక్తము పేరుకొన వచ్చును. దీనిని నలుగగొట్టబడిన దెబ్బయని చెప్పుదురు. ఈగాయమువలన రంగు మారుటయు వాచుటయుకల్గును.

"చికిత్స"

1. నీళ్ళను, స్పిరిట్‌ను సమభాగములుగా గల్పి, దానిలో బట్టను తడిపివేయుము. లేక మంచుగడ్డనైనను, తడిబట్టనైనను కట్టుము. [సశేషం]



జుట్టు - 1

శ్రీమతి సువేణికాశ్యప్

"Hair it is the robe which curious nature weaves to hang upon the head, and to adorn our bodies.— When we were born, God doth bestow that garment.— When we die, then like a soft and silken canopy it still is over us.— In spite of death, our hair grows in the grave, and that alone looks fresh, when all our other beauty is gone.—"

అన్నాడు Decker. దీన్నిబట్టి చూస్తే జుట్టు యొక్క విలువ తెలుస్తుంది. ఇలాంటి జుట్టును ఎంత శ్రద్ధగా సంరక్షించినా చాలదు. మన కంటే పాశ్చాత్యులు జుట్టుకు ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తారు. అందమైన జుట్టుకు వాళ్ళు బానిసలైపోతారు. ఒక్కొక్కసారి అందమైన జుట్టును పెద్ద Qualificationగా తీసికొని అమ్మాయిలను వివాహం చేసుకొంటారు అంటే అతిశయోక్తి లేదు. జుట్టుఇవ్వలేని అందాన్ని ఇంకేది ఇవ్వలేదని వాళ్ళ అభిప్రాయం. ఆ అభిప్రాయాన్ని ధృఢపరుస్తూ Pops మహాశయుడు "...Beauty draws us with a single hair—"అన్నాడు.

కాని మన పూర్వులు జుట్టును కేవలం అందాన్నిచ్చే వస్తువులాగ కాకుండా పవిత్రమైనదిగా చూసేవారు. అందుకే సౌందర్యవతి, సౌభాగ్యవతి అయిన స్త్రీ నల్లని దీర్ఘ కేశములను గలిగి ఉంటుందన్నారు. ఈ ఉద్దేశం అజంతా శిల్పాలలో కనిపిస్తుంది. ఎన్ని వింత వింత జడచుట్లు ఆ శిల్పాలలో కనిపిస్తాయి! ఈ జుట్టును అలంకరించుకోవటం చాలా తెలివిగలపని అనాలి. ఏ ముఖానికి, ఎప్పుడు ఏవిధంగా జుట్టును ముడిస్తే బాగుంటుందో చాల మందికి తెలీదు. ఇక్కడ కొన్ని రకాల అలంకరణలను చూద్దాము.

మామూలుగ మరీ వదులు కాకుండా, గట్టి కాకుండా జడ అల్లి చివరన కట్టకుండా వదిలేయటం చాలమంది విద్యార్థినుల కలవాటు. నిజానికిది అందగా, ఆకర్షణీయంగా ఉంటుంది. ఇక రెండో విధం రెండు జడలు వేసుకోవటం. ఇది బాగుండదని అనలేము. లేకపోతే వారి వారి

ముఖాలకు తగినట్లుగా వేసుకోవాలి. ఈ రెండు జడల వలన కొంతమందికి లేని అందం వస్తుంది. ఈ రెండు జడలు కొంతవరకు అల్లి చివరికి వచ్చే టప్పటికి రెండు కలిపి ఒకటిగ అల్లటము అదొక Fashion.ఇలాగే రెండు జడలు అల్లి రెండు చివరలు ఇటుది అటు, అటుది ఇటు కట్టడం ఒక విధమైన చుట్టక్రిందకి వస్తుంది. తర్వాత ఈ విద్యార్థినులు వేసుకొనేది రెండు జడలు అల్లి దేనికి అది పైకి ఎత్తి కట్టటము. ఇలాగే రెండు జడలతో అనేక రకరకాలుగా అలంకరించు కొంటారు. రెండు జడలు అల్లి ఒకవైపుది దాని పైకి ఎత్తి కట్టి రెండో చివర కూడ మొదటి దానిమీదకి కడ్తారు. ఇలా కట్టి రిబ్బను రాని వైపున పువ్వులు పెడ్తే అందంగా ఉంటుంది.

అలాగే చుట్టలు చుట్టుకోవటం. ఈ చుట్టల రకాలు చాపచుట్టలో దాగినట్లుంటాయి. రోజు కొక రకం, మనిషికొక రకం చుట్టలను చూస్తాము. అయితే అందులో ఏది బాగుంది అని చూడరు. ఎవరో చుట్టుకొన్నారని మనం చుట్టుకోవటం తెలివితక్కువ. మన కన్నుతీరు, ముక్కుతీరు చూసుకొని చుట్టుకొనే చుట్ట ఎన్నాళ్ళనుండి వాడుతున్నా అదిLatest fashionఅవుతుంది.

ఈ చుట్టలు జడ అల్లి చుట్టుకొంటారు. రెండు జడలు అల్లి చుట్టుకొంటారు. తర్వాత జుట్టును పాయిలుగా తీసి మెలిక త్రిప్పుతూ చుడ్తారు. ఇప్పుడు సింపుల్ ఫాషన్ జుట్టును నున్నగ దువ్వి ముడిలాగ వేస్తారు. ఇది 'Natural beauty'కి బాగుంటుంది. ఇప్పుడిప్పుడు క్రొత్తగా వేసేది ముడివేసి గుండ్రంగా బిళ్ళలాగ చేసి అందులోనుంచి జుట్టును లాగి వదిలేయటం. ఇది అజంతా శిల్పాల్లోని చుట్ట లాంటిది. ఇలాంటి చుట్టలొక ప్రక్క ఉండగా "స్ప్రింగ్స్ హెయిర్" ను చేస్తున్నారు. ఇది జడలుగా వేలాడుతూంటాయి. జుట్టును పైనంతా దువ్వి తల మొదలునుంచి పాయలుతీసి దాన్ని చుట్టగా చుడ్తారు. ఇది పాంపూతో చేయటం తేలికైనది, అందమైనది. పాయలుగా తీసికొన్న జుట్టుకు కొద్దిగ పాంపు తీసికొని రాసి కాసేపు నురుగు పోయేవరకు ఊరుకొని అప్పుడు పెనిసిల్ కొకదానికి చుట్టుకొంటూ వచ్చి, చివరికి ఆ పెన్సిల్ని లాగేస్తే స్ప్రింగులాగ అవుతుంది. ఈ విధములోనె మరోరెండు పద్ధతులున్నాయి. జడ మామూలుగా అల్లుకొని, సగమునుంచి మూడుపాయలను మూడు చుట్టలుగ చుడ్తారు. ఇది చాల మందికి బాగుంటుంది. మరీ వెగటుగాకూడ ఉండదు. మూడో పద్ధతి చక్కని రిబ్బనుతో తల మొదలున పువ్వులాగ కట్టి అక్కడనుంచి ఈ చుట్టలు లాగుతారు. ఇలా అనేక విధాలుగ అలంకరించుకోవచ్చు. కాని ఈ అలంకరణ మన సాంప్రదాయమును బట్టి, వయస్సును బట్టి, వృత్తిని బట్టి చేస్తే ఆకర్షణీయంగా ఉంటుంది.

ఇకపోతే జుట్టును ఉంగరాలుగ త్రిప్పటం. ఇది చాలావరకు పాంపూలనుపయోగించటము వలన పొందవచ్చు. దీని ఉపయోగం మంచిదా కాదా అనే సమస్యను ఇంకోసారి చూదాము. ఈ ఉంగరాలు తలంటి పోసుకోగానే చిన్న చిన్న పాయలుగా తీసి ఉంగరాలుగా చుట్టి దానికని ప్రత్యేకించి అమ్మే పిన్నును పెట్టి కొంత సేపుంచుతే ఉంగరాలు వస్తాయి. అలాకాని పక్షంలో మరికొన్ని పిన్సు ఉంటాయి. ఇవి తలను బాగా దువ్వి పెట్టుకొంటే వస్తాయి. ఈ పద్ధతి సామాన్యంగా రాత్రులందు చేస్తారు. తెల్లవారేటప్పటికి ఉంగరాలు తిరుగుతాయి. ఇలాంటి ఉంగరాలు ఎలక్ట్రిసిటీతోకూడా చేస్తారు. మదరాసులాంటి నగరాలలో వీటికి shops ఉంటాయి.

ఈ పద్ధతులు అమలు పర్చటానికి చూడండి. మరొకసారి జుట్టును ఎలా అందంగా పొడుగుగా కావల్సిన రంగుగా ఉంచుకోవాలో తెలియ చేస్తాను. ★

(దక్షిణ అమెరికాలోని ఇండియనులు చెప్పుకునే ఇతిహాసము)

పని, మరణము, అనారోగ్యము

రచన	: :	ఆంగ్లములోనికి అనువాదము
లియో టాల్‌స్టాయ్		లూయీ & ఏల్మర్ మాడ్

ఆదిలో సృష్టికర్త మనుష్యులను సృష్టించినప్పుడు వారికేమీ పనిచేసుకొనే అవసరం లేకుండాను, గృహాలు అన్నవస్త్రాదులు అక్కరలేక, ప్రతిఒక్కడు నూరేండ్లు జీవించేలాగాను, ఏర్పాటుచేసి వాళ్ళకేరోగమూ నొప్పి రాకుండా ఉంచేడట.

కొన్నాళ్ళు జరిగిన తరువాత ఆయన ఈ లోకము వైపు దృష్టి ప్రసరించాడట. అప్పుడాయనకు కనబడింది ఏమిటంటే ఈ ప్రపంచంలో జీవులందరూ ఎవరిసుఖం వారు చూచుకుంటూ ఎప్పుడు ఒకళ్ళతో ఒకళ్ళు దెబ్బలాడుకుంటూ, సుఖంగా ఉండటానికి బదులుగా జీవితాన్ని తిట్టుకుంటూ బ్రతుకుతున్నారని.

అప్పుడు దేవుడు తనలో తానిలా అనుకున్నాడట — "వీళ్ళకు ఒకరితో ఒకరికి అవుసరము లేకుండా వుండబట్టి ఇట్లా కీచులాడుకుంటున్నారు. వీళ్లకు "ఆకలి" "చలి" అనేవి కల్పిస్తే తినడానికి ఆహారము వుండడానికిఇల్లు అవసరమవుతవి. పంట్లు ధాన్యము సేకరించవలసి వస్తుంది. ఇండ్లు కట్టుకోవలసి వస్తుంది. బట్టలు తయారు చేసుకోవలసి వస్తుంది. భూమి దున్నుకోడము, విత్తులు నాటడము కోతలు కోయడము, వీటికి కావలసిన పనిముట్లు తయారు చేసికోడం, కలప జారేసుకోడం, నూలు వడకడం, బట్టలు చేసికోడం ఇవన్నీ ఎవరికి వారే చేసికోడం అసంభవం. అప్పుడు ఒకరిమీద నొకరు ఆధారపడుతారు. అంతటితో వారికి అందరూ కలసి పనిచేసికోడం వల్ల ఎక్కువ ఫలం దక్కుతుందని, ఎక్కువ సుఖంగా జీవించవచ్చునని తెలుస్తుంది. దానితో కీచులాటలు తగ్గిపోతవి" అందుచేత వెంటనే దేవుడుగారు ఆకలి, చలి కల్పించారట.

కొన్ని రోజులట్లా గడచిన తరువాత ఆయన మళ్ళీఇటు వైపు చూచేడట. వీళ్లు ఇప్పుడయినా సుఖంగా ఉన్నారో లేదోనని. అప్పుడాయనకు మళ్ళీ ఏమి కనుపించిందంటే, వాళ్ళు మునుపటికంటే ఇంకా ఎక్కువ కక్షతో పోట్లాడుకుంటున్నారని. పనులు చేసికోడం ఒకరితోనొకరు కలిసి అయినా, అందఱూ కలవడం లేదని, వాళ్ళలో వాళ్లు చిన్న చిన్న జట్లుగా తయారయి ఒకరిపనినొకరు కాజేస్తూ ఒకరికి మరొకరు ఆటంకాలు కల్పిస్తూ దీని మూలంగా కాలం వ్యర్థం చేసికుంటూ, తగువులకు తమ శక్తిని ధారపోస్తూ అధోగతిలో వుంటున్నారని చూచేడట ఆయన.

సరే. ఇదీకూడా బాగులేకుండా వుందికదా అని ఆపరమాత్ముడు ఏమిచేశాడంటే మనుష్యునకు తన చావు ఎప్పుడయిందీ తెలియకుండా చేస్సి ఈసంగతి మానవలోకంలో తెలియజేశాడట. ఇట్లా చేయడంలో ఆయన ఉద్దేశం ఏమిటంటే ఈ మనుష్యులు "మనసూ నిముషమో మరో నిముషమో పోయేవాళ్ళమే కదా, ఇంత తాత్కాలికమయిన సుఖాలను ఒకరి దగ్గరనుండి ఒకరు ఊడపీక్కోడం దేనికి. దీని కొరకై వారివారికి నియమింపబడిన అమూల్యమయిన జీవితకాలమును వ్యర్థము చేసికోడం దేనికి" అని అనుకొని పోట్లాటను మాని సుఖంగా ఉంటారు కదా అని.

దేవుడు మళ్ళీ తిరిగి వచ్చేసరికి తాననుకున్నదానికి వ్యతిరేకం జరిగిందని గ్రహించాడు. ఈ లోకంలో పరిస్థితి ఇట్లా ఉందంటే, మనుష్యుడు ఎప్పుడో ఒకప్పుడు చచ్చేవాడే కదా అని తెలిసి బలవంతులు బలహీనులను చంపిగాని చంపుతామని బెదిరించికాని అణచివేస్తున్నారు. అందుచేత బలవంతులు వారివారసులుకిపనిపాటలు చేయక సోమరితనము చేత విసిగిపోవడం, బలహీనులేమో వారి శక్తికి పని చేయడం చేత విశ్రాంతి లేక బాధ పడడం జరుగుచున్నవి. రెండు వర్గముల వారికి ఒకరంటే ఒకరికి భయము అయిష్టత ఏర్పడింది. జీవితం మరింత దుఃఖమయమయింది.

పని, మరణము, అనారోగ్యము


ఇదంతా చూచి దీనికి విరుగుడుగా ఒక ఆఖరి మంత్రం ప్రయోగించాడు దేవుడు. అదేమిటంటే ఈ లోకం మీదికి నానారకములయిన రోగాలు పంపించాడు. ఆయనను కున్న దేమిటంటే జబ్బుగా ఉన్న వాళ్ళమీద జాలిపడి జబ్బులేని వాళ్ళు సహాయం చేస్తారనీ, మాళ్ళీ ఎప్పుడయినా మనకు జబ్బుచేస్తే ఇంకొకరు మనకు సహాయం చేస్తారనే ఆశ ప్రతి వాడికి ఉంటుందనీను.

ఈ ఏర్పాట్లు చేసి ఆయన ఎటో వెళ్ళిమళ్ళీ ఇటు తిరిగి చూచేటప్పటికి ఇక్కడి పరిస్థితులు మరింత విషమించికూర్చున్నాయి. అనారోగ్యము అనేది మనుష్యులను కలిపేదానికి బదులుగా, విడదీయటానికి పనికివచ్చింది. ఇప్పుడు బలమున్నవారు బలహీనులచేత పనులు చేయించుకోవడమే కాక, వారిగి అనారోగ్యము కలిగినప్పుడు శుష్రూషకూడా చేయించుకుంటున్నారు. కాని వాళ్ళు మాత్రం బలహీనులకు ఏదయినా జబ్బుచేసినప్పుడు తిరిగి అయినా చూడటం లేదు. బలవంతంమీద ఇంకొకరి పనిచేసి పెట్టవలసి వచ్చిన వారు బలవంతంమీదనే శుష్రూషలు కూడా చేయవలసి రావడముచేత వారిలో వారికి ఏదయినా జబ్బు చేసినప్పుడు చూచుకోడానికి తీరికలేకపోయింది. ఓపికా లేకపోయింది. అందుచేత ఆబలహీనులకు రోగాలువస్తే వారికి చేసిపెట్టే వారెవరూ లేక ఉపేక్షించబడుతున్నారు. ఈ జబ్బుల వాళ్ళు తమ కండ్లబడకుండా బలవంతులు తమ ఇండ్లను ఎడంగా కట్టుకున్నారు. బలహీనులకు జబ్బులువస్తే, వారి ఆప్తులెవరు దగ్గర ఉండటానికి వీలులేదు. ఎవరయినా కూలికి శుష్రూష చేస్తేకూడ ప్రేమతో పనిచేయక ఈసడించుకుంటూ పనిచేస్తున్నారు. అదిగాక రోగాలు అంటువని తెలిసికొని జబ్బుగా ఉన్నవాళ్ళను, వారికి పనులుచేసే వాళ్ళను దూరంగా ఉంచడం మొదలుపెట్టారు.

చివఱకు దేవుడేమనుకున్నాడంటే వీళ్ళకు సుఖం అంటే ఏమిటో ఎట్లా చూపించినా తెలిసికోలేకుండా ఉన్నారు. ఈ కష్టాలన్నీ అనుభవించి అయినా తెలిసికొంటారు” అని అంతటితో ఈ లోకంపరిస్థితులను చక్కబెట్టే ప్రయత్నాలు మానుకున్నాడు.

ఇట్లా ఎన్నో ఏళ్ళు గడచిన తరువాత మనుష్యులు తాము సుఖంగా ఉండటం అవుసరమని, సుఖపడటం సాధ్యమయిన పనేనని తెలిసికొన్నారు. ఇప్పుడిప్పుడే కొద్దిమంది “పని” అంటే కొంతమందిని మాత్రం ముంచివేసేదిగా ఉండకూడదనీ, మనుష్యులనందరినీ ఐక్యము చేసేదిగాను సంతోషదాయకముగాను ఉండవలెననీ తెలిసికొంటున్నారు. ప్రతి జీవియొక్క కర్తవ్యము, తన జీవితకాలమును ప్రేమతో ఐకమత్యతతో గడపుటేయని ఇప్పుడిప్పుడే తెలిసికొంటున్నారు. రోగాలు వస్తే ఒకరిమీద నొకరికి జాలి, ప్రేమ కలుగాలి కాని ఒకరకొకరు దూరమయిపోకూడదని తెలిసికొంటున్నారు.

కో. రా.



సంస్కృతుల సమన్వయము : భావిస్వరూపము

శ్రీమతి యశోదాదేవి

పలువిధములగు విశ్వసంస్కృతుల సమన్వయమునుండి యేక సంస్కృతిని నిర్మింపవలెను. సంస్కృతుల క్రమ పరిణతి, భావిస్వరూపము మనోగోచరములు. స్వతంత్ర దేశముల సంస్కృతులయందు దేశీయత, జాతీయత, ప్రజ్వలమై యుండును. ప్రతి సంస్కృతియు కాలగతి ననుసరించి యేదేని యొక గమ్యస్థానము జేరుటకై మార్పు జెందుచునే యుండును.

ఈసమయము ప్రపంచ సంస్కృతుల చరిత్రలో నతి ముఖ్యమైనది యుగసంధి యనవచ్చును. అన్ని దేశములును తమ సంస్కృతులను యితర సంస్కృతులతో సమన్వయించి, యంతర్జాతీయతకు దోహదమిచ్చుచున్నవి. అంతర్జాతీయ యేక సంస్కృతి రూపము విజయాహ్లాదకరము ; ధర్మోద్దీపితము ; కళోద్ధారకము. సమతాభావ సంజనితము. ప్రాక్పశ్చిమ సంస్కృతుల కలయికకు కాలమాసన్నమైనది. "తూర్పు తూర్పే, పడమర పడమరే" రెండు నెన్నటికి కలియవన్న రోజులు, "యెవరికి వారే, యమునాతీరే" యన్నట్లు ప్రాక్ప్రతీచ సంస్కృతుల సమన్వయ మసంభవమనుకొని, పాశ్చాత్య సభ్యతకు వరవడి పెట్టినది ప్రాచ్య నాగరికతయని మరచినకాలము గతించినది. దిగ్భ్రమ నొందించుచున్న కాలగతి వలన, యిపుడన్ని దేశములును, యన్యోన్యసహకార మున్నను, లేకున్నను, కొన్ని యవసరములకై సమీపమునకు రావలసియున్నది. ప్రాక్పశ్చిమము లొండొంటిపై యాధారపడవలసియున్నది. మానవుని విజ్ఞాన సంపద యద్వితీయమై ప్రపంచమంతటిని రేడియో వైర్‌లెస్ విమానముల వల్ల బంధించినది. శుక్రవారము చన్‌కింగ్‌లో నున్న మనిషి సోమవారం యమెరికాలోనుండుట యాశ్చర్యముగనున్నది. మహాత్ముని మృతి యరగంటలో ప్రపంచమంతట వ్యాపించెను. వినాశన శక్తులు యధికమైనవి. ఆటంబాంబు మారణశక్తి గత యుద్ధములో విదితమైనదిగదా !

మతము మానవుని మనోవికాసమునకు యవలంబనము. శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీతలో వచించినట్లు, ధర్మరక్షణకై ప్రపంచములో యనేక మత ప్రవక్త లుద్భవించిరి. తమ మతముల బోధించి, ధర్మమును స్థాపించి, జనులను పతనావస్థనుండి దప్పించి శాశ్వతకీర్తి చూఱగొనిరి. విషమ సమయములలో నన్ని దేశములందు మత ప్రవక్త లవతరించిరి. మహావీరుడు, బుద్ధుడు, మనదేశమందును Loatse, Confucius చైనాలోను సమకాలికులు. క్రీస్తు, మహమ్మదు, జోరాష్ట్రరు తర్వాతివారు. మత ప్రచారము రాజరక్షణవల్ల వృద్ధి జెందెను. అశోకునికాలములో బౌద్ధము ప్రపంచమంతట వ్యాపించెను. హింసాతత్వము ప్రపంచమును మట్టుపెట్టుచున్న కాలములో, శాంతమూర్తి గాంధి మహాత్ముడు యవతరించియున్నాడు. సత్యము, ధర్మము, యహింసల బునరుద్ధరించి, యాచరణలో బెట్టి విశ్వమంతటిని యాకర్షించెను. అహింసయాయుధముతో గన్నతల్లి దాస్యబంధముల ద్రెంచి స్వతంత్రభారత దేశంలో మతవైషమ్యములకు యాహుతిగ ప్రాణములర్పించెను. ఇక ముందు మతము వైరుధ్యములకు దావలము కాకుండ సోదరత్వ, సామరస్య, సహన, సమభావముల నాపాదించునట్లు జేయవలెను మతము పేరిట జరుగుచున్న దురంతముల నరికట్టవలెను. ఏమతప్రవక్తయును మతము పేరున రక్త ప్రవాహముల గట్టమనలేదు. ప్రతి మానవుడును తన మంచి జీవితమువలన తను పుట్టిన మతమును సార్థకమొనర్చినయెడల మత సంస్కృతి పరిపక్వమైనట్లే.

కళలు మానవుని భావపరంపరలకు రూప కల్పనజేయును. పాశ్చాత్య శిల్పమున బాహ్య జగత్తు ముఖ్యము, ప్రాచ్య శిల్పమున భావ ప్రపంచము ప్రధానము. ఆధునిక భారతీయ శిల్పము పాశ్చాత్య శిల్ప సమ్మితమే. మన వాస్తుకళయు, ప్రాక్ప్రతీచీ శిల్పసమ్మేళనమును జూపుచున్నది. ఇది మానవ ప్రకృతియందు యింకను నభివృద్ధి జెందవలసిన సహనమును దెల్పును. సిలోను, బర్మా, చైనా జపాను శిల్పము బౌద్ధమయ్యు స్వదేశీఛాయల గల్గియున్నది. విగ్రహ నిర్మాణ కళలో మనదేశములో పాశ్చాత్య పద్ధతులు యనుసరింపబడుచున్నవి. చిత్రకళయందును తూర్పు పడమరల సమన్వయము దృగ్గోచరము. ప్రభుత్వ సహాయము, ప్రజాదరణ వల్ల యీ కళ వృద్ధినొందవలసియున్నది. నాట్య, సంగీత కళల కలయికనుండి క్రొత్త సంస్కృతి యుద్భవించవచ్చును.

సంస్కృతుల సమన్వయము

రేడియో సినీమాలు యీ కళలను యభివృద్ధిపర్చుచున్నవి. సుప్రసిద్ధ భరతనాట్యవేత్త కల్పించిన కల్పన చిత్రము భారతీయ జీవితమునకు, కళా సంస్కృతులకు ప్రతిబింబము. శివతాండవమునుండి నేటివరకును నాట్య పరిణతిని యిది చూపుచున్నది. వివిధ నాట్యముల సమన్వయించు నొక యద్భుత కల్పన చిత్రములో ప్రసరించినది. నాగలిదున్నుచు పాట పాడినట్లే, ట్రాక్టరును నృత్యోత్సవములతో రైతులు యాహ్వానింతురు. యీ చిత్రములో ఇపుడు విద్యావంతులు అన్ని కళలలో ప్రవేశించుటవలన, యిటీవల కళారాధకుల కాపాదింపబడిన న్యూనత మృగ్యమైనది. కళాభివృద్ధికై చిత్రశాలలు, సంగీత, నాట్య శిక్షణ ప్రదర్శనశాలలు దేశమంతట నిర్మింపబడవలెను. దక్షిణ దేశములో సంగీత విశ్వవిద్యాలయమునకై యాందోళన ఫలింపవచ్చును.

విశ్వసాహిత్యములో భావమున కెక్కువ ప్రాముఖ్యత గల్గునని యూహింపవచ్చును. సులభశైలిలో గద్యపద్యములలో సాంఘిక జీవనమందలి దైనందిన కృత్యములను, ప్రకృతిని వర్ణించుట పరిపాటియైనది. ఇదే ప్రజా సాహిత్యము. ఇది పురాతన కాలములో లేదనుటకంటె కాల ప్రవాహమున గొట్టుకొనిపోయినదనుట సమంజసము. సారస్వతములో మహత్తర గంభీర రచనములే శాశ్వతములు- వేదపురాణములు, కాళిదాసు, షేక్స్పియరు రచనలు, Confucius ప్రవచనములు. మధ్యయుగమునాటి ప్రజా సాహిత్యము కొంత నిల్చినది. ఆంగ్లేయుల ballads, చైనీయుల drum story, ఆంధ్రుల బుఱ్ఱకథలు, చాటువులు మొదలగునవి. ఇపుడు ప్రజల సాహిత్యము చాల వృద్ధి జెందుచున్నది. శతక వాఙ్మయముతో నారంభమై వేమన పద్యములు, వీరేశలింగ కవికృతులతో వృద్ధి జెందినది యాంధ్ర సాహిత్య సంస్కృతి. గురజాడకవి "దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్" మొదలగు రచనలు దేశములో జాతీయ ప్రబోధము సల్పినవి. దుగ్గిరాల వారిది ప్రజాసాహిత్యమే. కాని యాధునిక సాహిత్య మోహములో సరియైన సాహిత్య రచనలు కుంటుపడకుండ చూచుకొనవలెను.

ప్రస్తుతము దేశములో విద్యావిధాన మెట్లుండవలెనను నదొక గొప్ప సమస్య. ఆంగ్లేయ విద్యావిధానమువలన భారతీయులలో స్వయంప్రభ నుందగించెను; వున్నతవిద్య ప్రజానీకమునకు వ్యాపింపలేదు. స్వతంత్ర భారతములో హిందు రాజభాష యైనది. ప్రాంతీయ భాషలకు ప్రాముఖ్యత వచ్చినది. వయోజనవిద్య వ్యాపించుచున్నది. ఆంగ్ల భాష వ్యామోహము తగ్గినది. వయోజనవిద్య యింగ్లాండు, అమెరికా, రష్యాలలో నెక్కువగ వ్యాప్తిగాంచినది. ప్రతి వ్యక్తి విద్యగడించి వార్తా పత్రికలు, రేడియో, చలన చిత్రములద్వారా సంగతులు యవగాహనము చేసికొనగల్గిన విద్యాసంస్కృతి ప్రపంచమున పరిపూర్ణత నందినట్లే భావింపవచ్చును.

దేశములో క్రొత్త విశ్వవిద్యాలయములు, కళాశాలలు, లలితకళాకేంద్రములు స్థాపింపబడినవి. కొద్దో గొప్పో పని సాగుచున్నది. నిరక్షరాస్యత నశించుటకు దేశసర్వతోముఖ సౌభాగ్యమునకై కోట్ల కొలది రూప్యములు వెచ్చించి ప్రభుత్వము పంచవర్ష ప్రణాళికను యమలు పర్చుచున్నది. యూరపులో సాధారణముగ ప్రతివ్యక్తికి మూడు భాషలు వచ్చియుండును. మాతృభాష, లాటిను, విజ్ఞానమునకై ఫ్రెంచి, జర్మను, యింగ్లీషులో నొకభాష. మనముకూడ మాతృభాష, హిందూస్థానీ లేక సంస్కృతము, యితర ప్రపంచముతో సంబంధము నిల్పుటకు యింగ్లీషు, జర్మను, ఫ్రెంచి భాషలలో నొకటి నేర్చుకొనవలెను. యూరపియను భాషలలో నొకటైన నేర్వని పక్షమున భారతీయులకు యితరులతో సంపర్కము తగ్గిపోవును. వయోజనవిద్యాభివృద్ధికై డాక్యుమెంటరీ చిత్రములు చాల వుపయోగపడుచున్నవి. యూరపులో వారమునకొకపర ప్రభుత్వము గాని, పాఠశాలలుగాని యీ చిత్రములను విద్యార్థులకు జూపింతురు. పల్లె ప్రజకీ చిత్రములు విద్యాబోధ, యారోగ్యవిషయములు, పట్నవిశేషములు తెలియజేయును.

మానవ సంఘ సంస్కృతి స్వరూప మెట్లుండునను నదొక సమస్య. కల్పన చిత్రములో వాస్తవిక జీవితమునకు మానవుడు వూహించు భవిష్యత్తుకు గల వత్యాసము, పతనావస్థయందున్న పాలకులు మరోజగత్తు నిర్మించుటకు త్వరపడుచున్న ప్రజాశక్తులు చిత్రితమైనవి. పోలెండులోని రోక్లోలో 1948 ఆగస్టులో ప్రపంచశాంతి స్థాపనకై యంతర్జాతీయ మేధావుల మహాసభ జరిగెను. ఇందు

యామోదింపబడిన ప్రణాళిక ప్రపంచములో నభ్యుదయవాదుల శాంతి ప్రయత్నము వ్యక్తీకరించుచున్నది. ప్రతినిధులు 800 పైగ నుండిరి. వీరిలో శాస్త్రవేత్తలు, రచయితలు, కళావిదులు, విద్యావేత్తలు, శిల్పులు, గాయకులు, విద్యాధికారులు నుండిరి. మహాసభ అంతర్జాతీయ తాత్కాలిక సంఘమును యేర్పాటుచేసెను. ఇందు భారతదేశప్రతినిధి డా॥ ముల్కరాజ్ ఆనంద్. ఈ సభ యన్ని దేశముల శాంతి రక్షణకై మేధావుల సభలు జరుపవలెనని హెచ్చరించెను. అంతర్జాతీయ మేధావులమధ్య యేకభావము కలుగవలెను. ఈ సభలో ప్రఖ్యాత సోవియట్ రచయిత ఇల్యాఎహ్రెన్‌బర్గ్ వుపన్యాసములో కొన్ని వాక్యములు గమనార్హములు. అప్పటికి 13 యేండ్లక్రితము పారిస్‌లో సంస్కృతి రక్షణకై జరిగిన మహాసభలో ప్రఖ్యాత రచయితలు మానవ సంస్కృతికి గలుగబోవు ప్రమాదమునుగూర్చి హెచ్చరించినప్పటికిని శాంతి స్థాపింపబడలేదు. సంస్కృతికి సరిహద్దులులేవు. భవిష్యత్తును ప్రేమించలేనివాడు గతమును గౌరవింపజాలడు. సంస్కృతిలో యువకుల ధైర్య సాహసములు గలిసియున్నవి. సంస్కృతి రక్షణ యనగా దానిని ముందుకు తీసికొనివెళ్ళుట. సంస్కృతిని ప్రతిక్షణము నిర్మించవలెను. చరిత్ర సచేతనమగుట మానవ సంస్కృతిని విధ ప్రాంతీయముగ విభజింపరాదు. పాశ్చాత్య సంస్కృతి లేక యూరపియనుసంస్కృతి అట్లాంటిక్ సంస్కృతుల గనిపెట్టి, వానిని రష్యానుండి రక్షించవలెననువారు గలరు. కాని రష్యా, యూరపు, అట్లాంటిక్ సంస్కృతులలో భాగము గల్గియున్నది.

సాంఘిక ప్రపంచములో ననేక మార్పులు గల్గినవి; గల్గుచున్నవి. వీటి సమన్వయమువల్ల శాంతిపై నాధారపడి క్రొత్త సంస్కృతి వికసింపవలసియున్నది. ఈ సంస్కృతి మహోత్కృష్టమైనదిగ నుండవలెను. ★





మహిళల ఆరోగ్యరక్షణకు

లోధ్ర

గర్భాశయరోగ నివారిణి

స్త్రీలకు గలుగు ఋతుశూల, బహిష్ఠ కాకుండుట, అకాలబహిష్ఠ, మైల జాస్తిగాను తక్కువగాను పోవుట, కుసుమరోగము, సంతానహీనత, రక్తహీనత, మలబద్ధము, సూతికావాతము, కీళ్ళనొప్పులు, అరికాళ్ళు అరచేతులు మంట మొదలగు స్త్రీ మర్మ వ్యాధులను కుదుర్చును.

12 ఔ. రు. 4-4-0 6 ఔ. రు. 2-4-0

మాదీఫల రసాయనము

ఇది ముదిరిన మాదీఫలముల రసముతో తయారు చేయబడినది. గర్భిణిస్త్రీలకు కలుగు వాంతులకు (వేవిళ్ళు) యిది సంజీవివంటిది. తలతిరుగుడు, వాంతులు, అరోచకము, అజీర్ణము, మలబద్ధకము, నిద్రలేమి మొదలగు జబ్బులకు వజ్రాయుధము. జ్వరవేగమును తగ్గించుటలో యీ రసాయనము పేరుపొందినది. ఇది తేనెవలెయుండి నోటికి రుచిగను యింపుగను నుండును.

3 ఔన్సుల బుడ్డి రు. 1-4-0

గర్భరక్షక

స్త్రీలు బలహీనులగుటచేత గర్భము ధరించిన పిమ్మట పెక్కురు రుగ్మతల పాలగుచున్నారు. ముఖ్యముగ వీరల గర్భస్రావము, అకాలప్రసవము, అప్పుడప్పుడు కడుపు నొప్పి, నడుమునొప్పి, రక్తహీనము, శరీరమందు నీరు చేరుట, బలహీనము, అలసట, ఆయాసము, అజీర్తి, మలబద్ధకము మొదలగు జబ్బులు కలుగుచున్నవి. ఈ 'గర్భరక్షక' సేవించిన పైజబ్బులు రాకుండుటయేగాక ప్రసవించు వరకును శరీరము మంచి ఆరోగ్యస్థితి గలిగియుండి నిండు మాసములు గర్భము ధరించి సుఖముగ ప్రసవించెదరు.

3 ఔ॥ రు. 3-2-0 6 ఔ॥ రు. 5-8-0

క్షీరబలా తైలం

స్త్రీలకు ఋతుస్రావ దోషముచే గల్గు వాతవ్యాధులు, పార్శ్వపు తలనొప్పులు, తలపోటు, గర్భవాతము, శరీరము బిగిసియుండుట, మూర్ఛ, అపస్మారవ్యాధులు, క్షయవ్యాధి, నరముల బలహీనత, యీ తైలముతో అభ్యంజన మొనర్చిన నివర్తించును.

6 ఔ॥ల బుడ్డి రు. 3-0-0

సౌభాగ్యశొంఠి

బాలింతలేహ్యము

ప్రసవానంతరమున స్త్రీలకు బాలింతకారమును ఒక ఘాటు ఔషధమును యిచ్చు ఆచారము మన దేశమున చిరకాలముగనున్నది. అయితే ఈ కారమును లెక్కలేనన్ని పచారిదుకాణపు సామానులతో తయారు చేసి యిచ్చుచున్నారు. ఇందు కలియువస్తువుల పరిమాణమును, పదార్థజ్ఞానమును పాటింపక మందును తయారు చేయుదురు. ఈ కారము వారికి వేడిచేసి అనేక రుగ్మతలు సంభవించుచున్నవి. ఈ సౌభాగ్య శొంఠిని వాడిన ఆరోగ్యము చెడక తల్లియు బిడ్డయు సుఖముగ నుండగలరు. తల్లికి సమృద్ధిగ పాలుపడును.

బుడ్డి రు. 2-0-0

ప్రమేహాంతకం

(తెల్లబట్టవ్యాధికి)

అనేక కారణములవలన స్త్రీలకు గర్భాశయమునుండి తెల్లటిద్రవము వెడలుచుండును. స్త్రీజాతియందు యీ జబ్బు సర్వసాధారణముగనుండును. పసిపిల్లలకుగూడ యీ వ్యాధి సంభవించుచున్నది చిరకాలముగ యీ వ్యాధివల్ల బాధపడువారి గర్భాశయము పుండగును. అట్టివారికి మేహజ్వరము, దగ్గు, నిస్సత్తువ, సంతాన హీనతసంభవించును.

బుడ్డి రు. 4-0-0

కేసరికుటీరం లిమిటెడ్

15, వెస్టుకాట్ రోడ్డు, రాయపేట, మద్రాసు 14

తెనుగుజిల్లాలకు, నైజాముకు ఏజంట్లు

శీతారాం జనరల్ స్టోర్సు, బెజవాడ - సికిందరాబాదు

బిడ్డలు - తలిదండ్రులు

శ్రీ కె. వెంకట్రామయ్య.

(తల్లిదండ్రులతో బిడ్డలకు సరిపడకుండుట - దాని ఫలితముల తరువాయి)

తల్లిదండ్రులు బిడ్డలను కఠిన శిక్షణయందుంచి ప్రతి చిన్నవిషయమును పరిశీలించుచుండినను, వారి నెక్కువగా విసిగించుచు, విమర్శించుచుండినను గూడ వారాహారమును దినక పంతగింపగలరు. క్రొత్తగా బిడ్డ పుట్టుట గూడ నొక కారణము కావచ్చును. అట్లైనచో తల్లిదండ్రులు బిడ్డల నెక్కువ ప్రేమతో జూచుచు పూర్వపు నమ్మిక తిరిగి వారికి కలుగునట్లు జాగరూకతతో మెలగవలెను.

ఒక్కొక్కప్పుడు బిడ్డలు పెద్దవారిదృష్టి నాకర్షించుటకును, తమ ఇషము కొనసాగించుకొనుటకును ఉపాయముగ వాంతి జేసికొనుచుందురు. ఈరీతిగ వారు పెద్దవారిని తమ యాధీనమందుంచుకొనుటకేల ప్రయత్నింతురో తెలిసికొనుట ముఖ్యము. తల్లిదండ్రులు తమ యాతురతకొలది బిడ్డలను స్వేచ్ఛగా నుండనీయనియెడల వారిట్లు ప్రవర్తింప వచ్చును.

బిడ్డలకు ఆహార విషయములందు సరియైన అలవాట్లు నేర్పించుటకు కొన్ని సూచనలు:—

1. బిడ్డలకు మొదటినుండియు వారి వయస్సునకు తగిన పలురకములగు ఆహారములను పెట్టుచుండవలెను. ఏవో కొన్ని యాహారములనుమాత్రమే పెట్టుచుండిన యెడల క్రొత్తయాహారములన్న వారు అయిష్టత చూపగలరు.

2. బిడ్డలకు బాల్యదశ గడచువరకును ఆరోగ్యకరమైనట్టి ఆహారములనే పెట్టుచుండవలెను. పెక్కురకముల వంటకములను, వేపుడు కూరలను, ఊరగాయలను పచ్చళ్ళను వారికి బెట్టరాదు.

3. బిడ్డల యాహారము సక్రమమై సంపూర్ణత్వము గలిగియుండవలెను.

4. మొదటినుండియు బిడ్డలను స్వతంత్ర్యముగా భుజింపనీయవలెను.

5. భుజించుటకుముందు బిడ్డలు పది నిమిషములు విశ్రమించుటమంచిది. అది వారి జీర్ణశక్తికి సహాయకరమగును.

6. భుజించునప్పుడు బిడ్డలకు తగిన ఆసనములును, పాత్రలును, పరికరములును ఉండవలెను.

7. చిన్న బిడ్డలు భుజించునప్పుడు తల్లులు దగ్గర నుండి వారు సరిగా భుజించునట్లు చూడవలెను. కాలయాపన చేయుచు వారు భుజింపరాదు. వీలైన, తల్లిగూడ వారితో భుజించుట మంచిది దాని వలన వారు తల్లిని జూచి మంచి భోజనపుటలవాట్లు నలవరచుకొనగలరు.

8. బిడ్డలు మొదట స్వతంత్రముగా భుజించుట నేర్చుకొనవలెను. అటుపై మర్యాదగా దినుట నలవరచుకొనవచ్చును. అన్నివిషయములను వారికి ఒకేసారి నేర్పుటకు ప్రయత్నింపరాదు.

9. భోజన సమయములందు పాటింపవలసిన నియమములను గూర్చియు మర్యాదలనుగూర్చియు బిడ్డలతో మాట్లాడునపుడు వారికవి సంతోషకరములగు పనులుగా జెప్పవలెనేగాని నిర్బంధ విధులుగా జెప్పరాదు. ఇంతేగాక వారికావిషయములనుగూర్చి భోజనసమయమునకు పూర్వమే చెప్పవలయును. ఏలయన భుజించునపుడు మనముగూడ ఆనియమములనే పాటించుటను బిడ్డలు గమనించి వానిని సులభముగా నలవరచుకొందురు.

10. భుజించు విషయమునందు బిడ్డలుచేయు తప్పులను ఇతరులయెదుట దిద్దుట మంచిదికాదు. అది వారికగౌరముగదోచి, మనయెడ కోపముగలిగి భోజనసమయములందు మనలను బాధింప మొదలిడుదురు.

బిడ్డకు పదేండ్లు వచ్చియు నితరులతో మర్యాదగ భుజింపకున్నయెడల అతనిని వేరుగ భుజింపుమని చెప్పవలసియుండును. ఇతరులతోకలసి భుజించునప్పుడు భోజన మర్యాదలను పాటించుట యవసరమగును. ఒంటరిగా భుజించునప్పుడట్టి యగత్యముండదు. ఈ విషయమును గుర్తించుకొని అతడందరితోకలసి ఎప్పుడు తినగోరిన అప్పుడే రావచ్చునని బిడ్డకు తగు రీతిని ప్రశాంతముగా జెప్పవలెను.

11. భోజనసమయములందు తలిదండ్రులు తమ విచారములను వెలిబుచ్చుకొనుటయు కష్టములనుగూర్చి చెప్పుకొనుటయు పనికిరాదు. ఆసమయములందు కుటుంబములోనివారు తమకాదినమున గలిగిన యనుభవములను గూర్చియు తాము చదివిన విషయములనుగూర్చియు ఒకరితో నొకరు చెప్పుకొనుచు సంతోషముగనుండవలెను. అటగుటచే బిడ్డలాకాలమునందు సాంఘికజీవనమునకను వగు శిక్షణనుగూడ పొందగలరు. మరియు నావేళలందు వారుల్లాసముగ నుండుటచే వారి ప్రవర్తన సరియైన గృహమునందు శాంతియుండును.

12. అన్నిటికంటెను ముఖ్యముగా నీక్రిందివిషయములను జ్ఞప్తియుంచుకొనవలెను.

(ఎ) బిడ్డలలో నేయిద్దరి ఆహారయవసరములు నొకే రీతిగనుండవు ఆ యవసరములలో వత్యాసములుండును. వానిని మనము గమనింపవలెను.

(బి) బిడ్డలు భుజింప నిచ్చగింపకుండుటకేవో కారణములుండును ఆరోగ్యముగానున్న బిడ్డడేదో యొకప్పుడాహారము లేకయున్నను బాధపడడు.

(సి) బిడ్డలు భుజింపనంతనే ఆందోళన జూపరాదు. అది వారిని మరింత తినకుండజేయును. మన మాటలు శాంతముగను సహేతుకముగను ఉండినగాని వారు మనలను వినరు. ఉద్రేకపడుటచే నెట్టి ప్రయోజనమును గలుగబోదు.

నిద్రించుటలో బిడ్డల యలవాట్లు.

భుజించుటలోగల యలవాట్లువలెనే నిద్రించుటలోగల యలవాట్లుగూడ బిడ్డల మనోభావములందును ఆలోచనల యందును మార్పులు దెచ్చుచుండును. నిద్రించుటలో బిడ్డలకు మంచి అలవాట్లేర్పడినయెడల వారి శరీరారోగ్యమును మానసికారోగ్యమును గూడ సరిగా నుండును.

బిడ్డ పుట్టిన దాదిగా నిద్రించుటకలవాటుపడియుండును. మొదటి ఆరు వారములవరకు నాతడు దాదాపుగ రోజంతయు నిద్రించుచునేయుండును. బిడ్డ సరిగా నెదుగవలెనన్న పసితనమునందేగాక బాల్యము గడచువరకునుగూడ బాగుగా నిద్రించుచుండవలెను. పసితనమున బిడ్డలు తగినంతకాలము నిద్రించుచునేయుందురు. కాని బాల్యము రాగానే తలిదండ్రులు వారి నంతగా నిద్రింపనీయరు. అందుచే వారి శరీరాభివృద్ధి సరిగా జరుగకుండును. నిద్ర తక్కువగుటచే బిడలు చిరాకును, కోపమును చూపుచుందురు. సరిగా నాలోచింప జాలకుందురు. వారి వయస్సులనుబట్టి కనీసపక్ష మెంతకాలము నిద్రించుట యుచితమో క్రింది ప్రట్టీలలో జెప్పబడినది.

బిడ్డ వయస్సు	నిద్రించవలసిన కాలము
మొదటి సంవత్సరము	14గం. 45 ని
రెండవ యేడు.	13 గం. 14 ని.
మూడవ యేడు.	12 గం. 43 ని.
నాల్గవ యేడు.	12 గం. 7 ని.
ఐదవ యేడు.	11 గం. 43 ని.
ఆరవ యేడు.	11 గం. 18 ని.
ఏడవ యేడు.	11 గం. 4 ని.
ఎనిమిదవ యేడు.	10 గం. 58 ని.

బిడ్డలు తమ వయస్సునకు తగినటు నిద్రింపకుండిన, కారణమేదో కనుగొనవలెను. పట్టీలో సూచించినట్లే బిడ్డలు నిద్రింపని మాత్రమున వారి నిద్ర సరిగాలేదని పొరబడరాదు. ఏలయన బిడ్డలందరు నొకేరీతిగ నిద్రింపరు. వారు సహజముగ నిద్రించు కాలప్రమాణములలో హెచ్చుతగ్గు లుండును. కొందరెక్కువకాలము నిద్రింతురు. మరికొందరికంత నిద్ర యవసరముండదు ఐనను బిడ్డల నిద్రను జెరచు పరిస్థితులేవియు పరిసరములలో నేర్పడకుండ మనమెప్పుడును తగు జాగ్రత్త తీసికొనవలెను.

బిడ్డ యెదుగుచుండిన కొలది వారి పగటినిద్ర తగ్గుచుండును. రాత్రి నిద్రలోనంత మార్పుండదు. పసితనమున పగలంతయు నిద్రచెడి బిడ్డ ఏడేండ్లు రాగానే ఏమియు నిద్రింపకపోవచ్చును. పగటి నిద్ర ఎట్లున్నను పసి బిడ్డయు నేడేండ్ల బిడ్డయుగూడ రాత్రులందు దాదాపుగ పదకొండు గంటలు నిద్రింపవలెను. ఇది వారి యారోగ్యమున కవసరమగును.

బిడ్డలు రాత్రులందు ఆలస్యముగ నిద్రింపరాదు. అట్లు నిద్రించుటచే నేవో కొన్ని ప్రవర్తనా సమస్యలు తప్పక కలుగుచుండును. రెండేండ్ల బిడ్డడొకడు నాలుగేండ్ల

వయసు గల తనయక్కను కొలుసుకుంచెడివాడు. ఇట్లు తడు ప్రవర్తించుట సరిగా రాత్రి 6-30—7-30 గం. మధ్య జరుగుచుండెడిది. కారణమేమని యాలోచింప, వేళకు సరిగా నిద్రింపకుండుటయే యని తేలెను. రెండేండ్ల బిడ్డ రాత్రి 6 గంటలకే నిద్రించుట యుచితము ఎక్కువ కాలము మేల్కొనుటచే బిడ్డ డలసి అవిధముగ ప్రవర్తించుచుండెను.

బిడ్డలను రాత్రులందు సరిగా వేళకు బరుండనీయకుండుట చాల తప్పు. కొన్ని గృహములందు బిడ్డలు తమ తండ్రి రాకకై నిరీక్షించుచు రాత్రివేళల మేలుకొని యుండవలసియుండును. తండ్రి యానందముకై వారీ విధముగ నిద్రలేక వేచియుండుటచే వారి యారోగ్యము చెడి చిరాకును, కోపమును చూపుచుందురు.

బిడ్డలు పరుండిన వెంటనే నిద్రింపజాలరు. సాధారణముగ వారు పరుండిన ఇరువది నిమిషములకు నిద్రించుచుందురు. తల్లిదండ్రులీ విషయమును గుర్తించి తమ బిడ్డలు పరుండగనే నిద్రింపవలెనని తొందరపడుటయు, తొందర పెట్టుటయు మానవలెను. లేనిచో బిడ్డలు నిద్ర వేళకు వారిని తప్పక బాధింపగలరు.

<u>పగటి నిద్ర</u>:— పసి బిడ్డకు యేడాది గడచువరకును ప్రొద్దుటి నిద్రయు మధ్యాహ్నపు నిద్రయు గూడ అవసరమగును. రెండవ యేడు గడుచుసరికి ప్రొద్దుటి నిద్ర యలవాటు తప్ప వచ్చును. కాని ఐదేండ్లు వచ్చువరకును బిడ్డ మధ్యాహ్నపు నిద్రకలవాటై యుండవలెను. లేనిచో అతని దేహాభివృద్ధి సరిగా నుండదు. పసి బిడ్డలు రాత్రి యంతయు నిద్రించుటచే ప్రొద్దున తిరిగి తక్షణమే నిద్రింపజాలరు. నిద్రించుటకు పూర్వము వారు క్రీడించుటయు, అలయుటయు నవసరమగును. అలసట నిద్రను దెచ్చును. తల్లులీ విషయమును గుర్తించి తగు జాగ్రత్త దీసికొన్నచో పసి పిల్లలు ప్రొద్దుట సరిగా నిద్రింపక వారిని బాధించుట జరుగకుండును. అలసట నిద్ర కవసరమే యైనను అది యెక్కువ కారాదు. మూడు నాలుగేండ్ల బిడ్డలు పగటి నిద్ర లేకుండినచో రాత్రి యగుసరికి ఎక్కువగా నలసి సరిగా నిద్రింపజాలకుందురు.

పిల్లలు పగలు నిద్రించుట మానినంతనే పగటినిద్ర వారికవసరము లేదని మనమను కొనరాదు. ఇంటివద్ద పగటి నిద్రను మానిన పిల్లలు చాలమంది కిండర్ గార్టెన్, నర్సరీ బడులకు పోగానే మధ్యాహ్నపువేళ నొకగంటకు తక్కువలేక నిద్రించుట కలవాటు పడుదురు. కారణమేమన అబడులలో నేర్పాటైన క్రమ విధానమేయని చెప్పనగును.

బిడ్డల నిద్రా విధానములో నెట్టి యాటంకములును రాగూడదు. వారిని ప్రతి దినమును వేళకు సరిగా పరుండబెట్టవలెను. వేళకు సరిగా పరుండి తీరవలెననెడి భావమే వారికి కలుగజేయవలెను. తమ ఇష్టప్రకారమెప్పుడైనను నిద్రింపనగునను భావము వారికెన్నటికిని గలుగనీయరాదు.

బిడ్డ లెనుగుకొలది పగటి నిద్ర యలవాటు తొలగుచు వచ్చునని ఇదివరకే సూచించితిమి. వారు ప్రతిదినమును నిద్రించుటకు బదులు మూడు నాలుగు దినములకొకమారు నిద్రించుట జరుగవచ్చును. బిడ్డలీ స్థితియందున్నప్పుడు, వారు పగటి వేళ నిద్రింపకున్నను ఒక గంట కాలము పరుండి విశ్రాంతిని దీసికొనవలెనని చెప్పవలెను.

మధ్యాహ్న భోజనమైన పిదప బిడ్డలొక గంటసేపైనను విశ్రాంతిని తీసికొనుట యవసరము. దానివల్ల వారికి జీర్ణశక్తి సరిగానుండును. అన్నము దినినంతనే ఆటలాడుట పనికిరాదు.

బిడ్డలు మొదటినుండియు, మధ్యాహ్న భోజనమైన పిదప పరుండుట కలవాటు కావలెను. దాని వలన వారికి పగలు విశ్రాంతిని దీసికొనెడి యలవాటు సులభముగా నేర్పడగలదు. విశ్రాంతి వేళకు పూర్వము బిడ్డలకు తగినంత దేహ పరిశ్రమ యుండవలెను. దానికి తగు రీతిని వారిదైనిక విధానము నేర్పరచిన యెడల విశ్రమించుట కనక్తత జూపకుందురు.

భోజనమైన పిదప నొకగంట పరుండవలెనేగాని నిద్రింపనక్కరలేదని బిడ్డలతో జెప్పినవారు విశ్రాంతి దీసికొనుట కిచ్చగింతురు. వారు పరుండి ప్రశాంతముగా నొక పుస్తకమును చదువవచ్చును లేదా ఏదైన బొమ్మతో నెమ్మదిగా నాడుకొనవచ్చును.

అలవాట్లు నేర్పరచుటలో గడియారము చాల ఉపయోగపడుచుండును. పెద్ద ముల్లొక ప్రత్యేక స్థానమును చేరువరకును పరుండవలెనని బిడ్డతో జెప్పిన అతడా ముల్లును గమనించుచు ప్రశాంతముగా పరుండగలడు. ముల్లుపైనే ధ్యానముండుటచే బిడ్డకు నిద్రగూడ రాగలదు.

శీఘ్రముగా పరుండుట :— చిన్న పిల్లలు రాత్రులందు శీఘ్రముగా పరుండవలెను. అట్లు పరుండుట వారికిని కుటుంబములోని వారికిని గూడ చాలమంచిది. పెద్దవారు పగలంతయు కష్టపడి పనిచేయుటచే రాత్రియగు సరికి బడలిక జెంది విశ్రాంతిని గోరుచుందురు. అట్టి సమయమున బిడ్డలువారిని చికాకు పెట్టుచు బాధించుట పనికిరాదు. కాని బిడ్డలును సాయంకాల మగుసరికి కొంత అలసట జెంది చిరాకుగ నుందురు. రాత్రివేళ శీఘ్రముగా నిద్రించుటచే చిన్న బిడ్డల ఆరోగ్యము బాగానుండును. ఇంతేగాక వారు తమలో తాము కలహించుచుండుటయు తలితండ్రులతోగూడ తగవులాడుచుండుటయు జరుగకుండును. బిడ్డలు పండుకొన బోవుటకు పూర్వము సంతోషముగా నుండవలెనే గాని కోపమును, విచారమును గలిగి యుండరాదు. కోపముతోను, విచారముతోను పరుండుట వలన జీర్ణరసము సరిగా ప్రవహించక నిద్ర పాడగును.

ఒక్కొక్కప్పుడు బిడ్డలు పరుండియు చాలసేపటి వరకును నిద్రింపక మెలకువగనే యుందురు. అట్టియెడ తలిదండ్రులు వారిని లేచి కూర్చుండ నిచ్చుచుందురు. ఇట్లు నిద్రింపక చాలసేపు మేలుకొని యుండుటచే బిడ్డల శరీరమున కొకవిధమగు వేడిగలిగి ఎక్కువగా నలసి యుందురు. అందుచే వారు నిద్రించునపుడు విపరీతముగా నిద్రించుటయు, ప్రొద్దున లేచినపుడు బడలికజెంది చిరాకుగ నుండుటయు జరుగుచుండును. బిడ్డలు, సాధారణముగా, పరుండిన ఇరువది నిముషములలో నిద్రింతురని చెప్పితిమి. ఈ కాలము గడచినపిదప గూడ వారు చాలసేపటివరకు నిద్రింప కుండినచో కారణము నరయ ప్రయత్నింప వలెను. బిడ్డ లెక్కువగా భుజించియు, అరుగని యాహారముల దినియు అజీర్ణముతో బాధపడు చుండవచ్చును. అట్లుగానిచో అతిస్వల్పముగా తినుటచేతనో, తిని చాలకాల మగుటచేతనో వారాకలి గొనియుండవచ్చును. మధ్యాహ్న మాలస్యముగా నిద్రించుటయో లేక ఎక్కువ కాలము నిద్రించుటయో జరిగియుండ వచ్చును. ఇవి యన్నియు బిడ్డల రాత్రి నిద్ర నాటంక పరచు పరిస్థితులైయున్నవి.

బిడ్డలు పగటిపూట $1\frac{1}{2}$, 2 గంటలకన్న నెక్కువ కాలము నిద్రించునెడ వారిని నెమ్మదిగా లేపుట మంచిది. లేనిచో వారికి రాత్రి ఆలస్యముగా నిద్రించుటయో, లేదా, ప్రొద్దుట అతి శీఘ్రముగా లేచుటయో అలవాటు కాగలదు

నిద్రా విధానమున నేదైన మార్పు దెచ్చినచో బిడ్డలు దానిని తక్షణమే యనుసరింప లేరు. ఒకక్రొత్త యలవాటు చేర్పరుచుట కొకవారమైనను పట్టును. తలిదండ్రు లివి గుర్తించుట చాలముఖ్యము.

వేళకు పరుండ బెట్టుట :— బిడ్డలను సరిగా వేళకు పరుండ బెట్టుచుండవలెను. లేనిచో వారుసరిగా నిద్రింపక మనలను అరచు బాధించుచుందురు. నిద్రించుట కొకవేళను నిర్ణయించి నపుడు దానిని పాటించి తీరవలెను. పండుగలు పుట్టినదినములు మొదలగు ప్రత్యేక సమయములందు తప్ప తక్కిన దినములలో నియమము తప్పక నిద్రింపవలెను. బిడ్డలు మనలను బ్రతిమాలిరనియో, వేదించుచుండిరనియో ఒకనాడు వారిని వేళదాటి పరుండ నిచ్చితిమేని మరునాటి నుండియు నిద్రవేళకు వారు మనలను బాధింప గలరు.

నిద్రవేళయగు సంగతిని బిడ్డలకు కొన్ని నిముషములు ముందుగనే జెప్పుచుండుట మంచిది. దానివలన వారు తమ యాటలను, పనులను విరమించుకొని వేళకు పరుండుటకు వీలగును.

అలవాట్లు నేర్పరచుటలో గడియారము మెంతయు నుపకరింప గలదని ముందుగనే సూచించితిమి. అది గంటలు కొట్టి మనలను భుజింపుమనియు నిద్రింపుమనియు చెప్పుచుండునని బిడ్డలతో జెప్పిన వారా యావేళలకు భుజించుటయును, నిద్రించుటయును నలవరచు కొనగలరు. గడియారమును బట్టి యాలేగాక మనమును నడచుకొనుటవారి కెంతయు నచ్చును.

బిడ్డలను బాధించియు దండించియు పరుండ బెట్టుట పనికిరాదు. దానిచే వారికి పరుండుటయే బాధాకరముగ దోపగలదు. నిర్బంధమునచే పరుండుట వలన వారికి నిద్ర రాక, కొన్ని దురలవాట్లు ఏర్పడుచుండును. అంగముతో నాడుట, వారికి విధముగనే యబ్బుచుండును.

పరుండుటకు ముందు దుస్తులను విప్పుకొనుట :— బిడ్డలు పరుండుటకు పూర్వము తమ దుస్తులను తామే విప్పుకొనగ గోరుచుందురు. అట్టియెడ మన మడ్డుపోక వారినే స్వయముగ విప్పుకొన నిచ్చుటమంచిది. అందుచే వారికి సంతోషము గలిగి పరుండుటయన్న నిష్టపడుచుందురు. [సశేషం]



మనలో మనమాట

తగుదునమ్మా

శ్రీమతి లక్ష్మీరఘురామ్

చిన్నప్పటిమాట. ఆరోజుల్లో పిల్లలకందరికీ సంగీతం నేర్పించుట రివాజు. రివాజో, మోజోగాని నావంటి వాళ్ళ కది ప్రాణకంటకముగా పరిణమించింది.

ఏంచదివినా గాడిదకాంబోజీ రాగములో తప్ప చదువ లేని నేను ఆ రోజుల రివాజు ప్రకారము సంగీతము నేర్చు కొనవలసి వచ్చింది. నా కంఠాన్ని శ్రావ్యమైన రాగంలో ఆలాపింప చేయటానికి నేనేమి నా గురువులేమి (బహు వచనమే) పడిన కష్టమింతింతగాదు. మొట్ట మొదట్లో హార్మోనియము తోడ్పాటు, తరువాత ఫిడేలు తోడ్పాటు పొంద వలసి వచ్చింది. ఈ రెండూ నావరకు ఏమీ సహ కరించలేదనే చెప్పాలి. వీటి సహకారము పొందే రోజులలో నా కెంతమాత్రము సంగీతము అలవడలేదనే చెప్పాలి. కాని కొద్దిగా నాట్య విషయములు గ్రహించగలి గాను. సాపా....సా....యని పాట మాస్టారుగారు వారి తొడమీద వేళ్ళు లెక్క పెట్టుకునే సమయములో మనము వారి పిలక నాట్య భంగిమలు జాగ్రత్తగా గమనించి అవగా హన చేసుకొని తరువాత మిత్రురాండ్రలకు బోధ పరచ కలిగాను. ఈ స్వదేశీ సంగీతము వంట బట్టుట లేదని (ఆనాటి విదేశీవ్యామోహపు అలవాట్ల ప్రకారము) విదేశీ సంగీతము అలవరచుకొనుటకు వలయు పియోనానుకూడా నేర్చుకొన ప్రయత్నింప వలసివచ్చింది. ఎబ్బే! వ్రేళ్ళే సరిగా వంగలేదు. కాన్వెంటులోని నన్సు వ్రేళ్ళమీద స్కేళ్ళ దెబ్బలతో దానికి స్వస్థిచెప్ప వలసి వచ్చినది. అప్పటికి మనకు కొంచెము బుద్ధివచ్చి స్కూలుఫైనలు పరీక్ష పుణ్యమా అంటూ ఆ సంగీత శిక్షణకు సంపూర్ణ ముగా స్వస్థి చెప్పగలిగాను. ఇలాంటి అనుభవమే చెప్పు కోను సిగ్గుపడ్డా చాలమందికి పరిచితమే నకుకుంటాను. సరి అవి మనచిన్ననాటి ముచ్చట్లు.

ఇప్పుడు మన పిల్లలమాటలు - పరిస్థితులు ఆలాగే వున్నవి. ఆ రోజులలో అందరికీ సంగీతము నేర్చు కొనుట పరిపాటైతే ఈ రోజులలో తగుదునమ్మాయని అందరికి నాట్యము నేర్పించుట ప్యాషనైంది. మెల్ల కన్నామ్మాయలకు, గ్యారంటీ కలరమ్మాయలకు, పొట్టమ్మా యలకు, గ్లాస్కో-సేందో అమ్మాయిలకు వారికి వీరికన నేమి అందరికీ నేర్పవలసినదే. మా అమ్మాయికి డ్యాన్సు రాదని చెప్పుకొనుట ఒక చిన్న తనపుమాటై పూరు కున్నది.

సంగీతము వలనే నాట్యము అందరికీ అబ్బదన్న సంగతి అందరికీ తెలిసిన విషయమే నైనా అదేమి చిత్రమో అప్పుడప్పుడు తెలిసే చూస్తూ చూస్తూ తెలివి మాలిన పనులు చేయబూనుకుంటాము. కాని అందరూ తమ అమ్మాయిలకు డ్యాన్సు నేర్ప వలయునను సంకల్ప ములో ఏమైన రహస్యమున్న అది ఆ బ్రహ్మకు తెలియ వలసినదే గాని మనకు తెలియరాదు.

పిల్లలు కష్టపడి డ్యాన్సు నేర్చుకొను చున్నప్పుడు, తరువాత సగర్వంగా వాళ్ళ తలిదండ్రులు గురువుల ప్రోత్సాహముతో ప్రదర్శన చేయుచున్నప్పుడు ఆ చిన్ని బిడ్డలకు నామనఃపూర్వ సంపూర్ణ సానుభూతి చెలిపతీ ద్వారా అందచేస్తూనే వుంటాను.

ఇంతకీ ఆ పిల్లలు కష్టపడి డ్యాన్సు నేర్చుకొనేది ఎవరి సంతోషము కోసమో అదేవునికే ఎరుక. ఒకానొకప్పుడు ఈ డ్యాన్సుమోజు ప్రౌఢలకుకూడ అంటుకునే అపాయ పరిస్థితి లేర్పడినా అదృష్టవశాత్తు అటువంటి విపత్తు సంఘటిల్లనందుకు సంతోషించ వలసియున్నది.

సంగీతమైతేనేమి, నాట్యమైతే నేమి గొప్ప కళలే. అట్టి కళలను అలవరచు కొనుటయు గొప్ప విషయమే. స్వతసిద్ధముగా వాటియందు అభిరుచి కౌశలముండవలయును. కళారాధనేమి, దైవారాధనేమి కేవలము గురుశిక్షణ వల్ల అలవడవుకదా! కళలయందు ఆశక్తి, దైవమందు భక్తి యున్నవారికే కళారాధనగాని, దైవారాధనగాని చేయ నర్హులగుదురు. కావున అందరూ తగుదునమ్మాయని సంగీతము నాట్యము నేర్చు కొనుట చాల పొరపాటు.

కావున ఈ కార్యము లేవి తలపెట్టినా అనర్హులగు వారికి అనవసరముగా కాలము, ధనము, శక్తి వ్యయము చేయుటే అగును.

ఇటీవల కొంతమంది తల్లులు తమ బిడ్డలకు ఆరోగ్యమునకై నాట్యము నేర్పించుమన్నట్లు చెప్పుకొనుచుండగా విన్నాను. వారు ఆ పిల్లలకు కష్టపడి ఆ కుప్పిగంతులు, కప్పగంతులు నేర్పేబదులు డ్రిలు ఒన్ టు త్రీ యని నేర్పుట లాభకరమని తోచుచున్నది.

ఇంతకీ ఇదంతా మనలో మనమాటే సుమండీ!



లంకాదహనము :

$\frac{1}{4}$ వీశ పచ్చిమిరప కాయలు.

$\frac{1}{8}$ వీశ ఉల్లిపాయలు.

1 చిన్న గరిటె పసుపు

1 .... ఉప్పు.

$\frac{1}{2}$ కప్పు మంచినూనె.

పచ్చి మిరపకాయలు ముక్కలుగా కోయవలయును. ఉల్లిపాయలు చాలాసన్ననిముక్కలుగా కోయవలయును. ఒకగిన్నెలో నూనెపోసి పొయ్యిమీద పెట్టవలయును. నూనె వెచ్చబడ్డ తరువాత పసుపుపొడిని వేయవలయును. తరువాత ఉల్లిపాయ ముక్కలు వేయవలయును. అవి ఎర్రగా వేగిన తరువాత పచ్చిమిరపకాయ ముక్కలను వేయవలయను. తరువాత ఉప్పు ఒక అరకప్పు నీళ్ళు పోయవలయును. నీళ్ళు పూర్తిగా ఇగిరి పోయేవరకు పొయ్యి మీదవుంచి తరువాత దించి వేయవలయును. ఇంటిలోసమృద్ధిగా పాలున్నయడల నీటి బదులు అరకప్పు పాలుకూరలో పోసిన రుచిగావుండ గలదు.

బాగాచేతిమీద నెయ్యి వడ్డించుకుని వేడి అన్నముతో తినవచ్చును. కారము ఎక్కువగా తినలేనివారు ఒక చెంబుడు మంచి నీళ్ళు దగ్గిరే పెట్టుకొని మరి భోజనానికి కూర్చోండి.

టొమాటీలకాష్మీరీ :

$\frac{1}{4}$ శేరు టమాటీలు

$\frac{1}{8}$ శేరు ఉల్లిపాయలు,

4,5 పచ్చి మిరపకాయలు,

$\frac{1}{2}$ కొబ్బరికాయ పాలు.

1 చిన్నగరిటెడు శనగపిండి.

$1\frac{1}{2}$ చిన్నగరిటెడు ఉప్పు.

1 పెద్దగరిటెడు నెయ్యి.

టమాటీలను ఉల్లిపాయలని పచ్చిమిరప కాయలని సన్నగా కోయవలయును. పొయ్యి మీద వెడల్పాటి గిన్నెలో నెయ్యివేసి తరువాత ఉల్లిపాయల ముక్కలు వేసి ఎర్రగా వేయించ వలయును. తరువాత మిరపకాయ ముక్కలు, ఆ తరువాత టమాటీల ముక్కలు వేయ వల యును. శనగపిండి, ఉప్పు ఒక పావు కప్పు నీటిలో కలపి, ఆ టమాటీ ముక్కలమీద పోయ వలయును. అది బాగా కలుపుతూ వుండవలయును. తరువాత కొబ్బరపాలు పోసి రెండు నిముషములుంచి పొయ్యి మీదనుండి పాత్ర దించివేయవచ్చును.

శ్రీమతి లక్ష్మీరఘురామ్.

" To train women workers and harness their services in the building up of the future of our Nation and Womanhood "

ఫిబ్రవరి 1955

ఆది	సోమ	మంగళ	బుధ	గురు	శుక్ర	శని
•	•	1	2	3	4	5
6	7	8	9	10	11	12
13	14	15	16	17	18	19
20	21	22	23	24	25	26
27	28					

3. షట్తిలైకాదశి. 6. మాఘ పౌర్ణిమ. (సముద్రస్నానం) 20. మహాశివరాత్రి. 22. అమావాస్య.

Edited by Mrs. K. Lakshmi Raghuram, B.A.,
Printed & Published by Mrs. A. C. Krishna Rao, M.A., L.T.,
at the Andhra Mahila Press, Mylapore, Madras 4.